

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 329

సోమవారం 19-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంచిమాట

కుశలత అంటే నేర్పరితనం. ఏ పని చేయటానికైనా ఒక నేర్పరితనం అవసరం. ఏదో ఒక తీరులో తోచిన విధంగా చేయటం కాక, సులువైన పద్ధతిలో సునాయాసంగా చేయగలగటం నేర్పరితనం. బుద్ధిని దాని సామర్థ్యాన్ని తగిన విధంగా ఉపయోగించటమే బుద్ధి కుశలత.

సాధారణంగా మనస్సుని, బుద్ధిని సమానార్థకాలుగా వాడుతూ ఉంటాం. కాని రెండింటికీ తేడా ఉంది. ఆలోచన చేసేది, పంచేంద్రియాలని ప్రేరేపించేది, వాటిపై పెత్తనం చేసేది, తనకి నచ్చినట్టు, కావలసినట్టు ఊహ చేసేది, కలలు కనేది, ఆశపడేది, రాగద్వేషాలకి నిలయమైనది మనస్సు. బుద్ధిలో కూడా మనోవ్యాపారం ఉన్నా, దానిలో విచక్షణా, సహేతుకతా ఉంటాయి.



బుద్ధి కుశలత

ఒక మంచిపని, తనకి, కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఉపయోగపడేది చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పుడు పని చేసింది బుద్ధి. తీరా ఆ పని మొదలుపెట్టిన తరువాత ఏవేవో పనికిరాని కారణాలతో సమర్థించుకుని వాయిదా వేసుకుంటూ వచ్చినప్పుడు పని చేసింది మనస్సు. మనస్సు శారీరిక, మానసిక సుఖాన్ని అపేక్షిస్తుంది. మంచి చెడులను వేర్పరచి విచక్షణతో నిర్ణయం తీసుకునేది బుద్ధి. అయితే ఎన్నో సందర్భాలలో మనసు బుద్ధి వేషం వేసుకుని వస్తుంది. పని వాయిదా వేయటానికి కారణాలు వెదకినట్టుగా మనోవ్యాపారమైన ఆలోచనల సహకారంతో ఏది మంచి ఏది చెడు ఏది శాశ్వతం, ఏది తాత్కాలికం, ఏది తనకి, సమాజానికి ఉపయోగ పడుతుంది, ఏది ఉపయోగ పడదు అనే అంశాలను విడదీసి, విమర్శించి, వేర్పరచి సరైన నిర్ణయం తీసుకునేందుకు సహకరించే శక్తి బుద్ధి.

ఒకప్పుడు గురుకులాల్లో గురువులు శిష్యులకి విద్యాబుద్ధులు నేర్పేవారు. విద్యావంతులు బుద్ధిమంతులుగా ఉండేవారు. విద్య అంటే విషయ సేకరణ మాత్రమే కాదు. సేకరించిన విషయాలను, సముపార్జించిన జ్ఞానాన్ని జీవితానికి అన్వయం చేసి, ఆచరణలో పెట్టగలగటం, ఆ జ్ఞానాన్ని ఎప్పుడు ఎంత అవసరమో నిర్ణయించగల మెలకువ కలిగి ఉండటం. అదే బుద్ధికుశలత.

ఒక పండితుడికి, శాస్త్రవేత్తకి తమ తమ రంగాలకి సంబంధించిన జ్ఞానం చాలా ఉండవచ్చు. దానిని సందర్భానుసారంగా ఎట్లా ఉపయోగించుకోవాలో తెలియక నలుగురిలోనూ నవ్వుల పాలు కావటం చూస్తూ ఉంటాం. మెదడు బాగా ఎదిగింది కాని, విచక్షణ లేదు అని అర్థం. గొప్ప మేధావులు కూడా జీవితంలో సరయిన నిర్ణయం తీసుకోక నష్టపోవటానికి ఎంతోమంది శాస్త్రవేత్తల జీవితాలని ఉదాహరణలుగా గమనించవచ్చు. కారణం విద్యతో పాటు బుద్ధి గరపిన వారు లేకపోవటమే. ప్రస్తుత విద్యావిధానంలో చదువులు నేర్పి అక్షరాస్యులని తయారు చేయటం మాత్రమే కనిపిస్తోంది. కాని, బుద్ధివికాసం ఎంతవరకు జరుగుతోంది? అన్నది ప్రశ్నార్థకమే. ఈ కారణంగానే పెద్ద పెద్ద విద్యార్హతలు ఉన్న వారు కూడా సంఘవిద్రోహకశక్తులుగా మారటం, దేశద్రోహులుగా మారటం కుటుంబ దేశ పరువు ప్రతిష్ఠలను దెబ్బ తీసే విధంగా ప్రవర్తించటం చివరికి తమకే హాని చేసుకోవటం గమనించవచ్చు.

ఆకలి దహించుతోంది, నిద్ర ముంచుకు వస్తోంది. తినటం, పడుకోటంలలో ఏది ముందు చేయాలి? అని నిర్ణయించుకుని మేలు పొందటానికి కావలసినది విచక్షణ మాత్రమే కాని చదువులు కాదు.

కార్యసాధకుల లక్షణాలలో ప్రధానమైనది బుద్ధికుశలత. జీవితంలో గొప్ప విజయాలు సాధించి అత్యున్నత స్థానానికి చేరుకున్నవారందరు బుద్ధికుశలురే. చదువులు సహాయం చేసి ఉండవచ్చు.

– డా.ఎన్.అనంతలక్ష్మి

కుశలత... విచక్షణ

ప్రతి మనిషికి మనసు ఉన్నట్లే బుద్ధి కూడా ఉంటుంది. కాని, అందరూ బుద్ధిని సరిగా ఉపయోగించరు. దానిని ఉపయోగించటంలోని మెలకువలు తెలియటమే బుద్ధి కుశలత. ఏ పని ఎట్లా చేయాలో తెలిసి ఉండటమన్న మాట. దీనినే ఒడుపు అని కూడా అనవచ్చు. ఏ పనినైనా గుడ్డెద్దు చేలో పడ్డట్టు అడ్డదిడ్డంగాను చేయవచ్చు. ఎక్కువమంది చేసేది ఆ విధంగానే. లేదా క్రమపద్ధతిలోనూ చేయవచ్చు. ఇది నేర్పరులు చేసే పద్ధతి. బుద్ధిని ఉపయోగించటంలో ఇటువంటి నేర్పరితనం ఉంటే దాన్నే బుద్ధి కుశలత అనవచ్చు. అంటే చురుకుగా పని చేసే విచక్షణాజ్ఞానం అన్నమాట.

బౌద్ధవాణి

అంధత్వం తొలగితే..!



అది కురుదేశం. అందులో 'కమ్మాసధమ్మం' అనే పట్టణం. మంచి వ్యాపార కేంద్రం. ఆ పట్టణానికి సమీపంలో భారద్వాజ మహర్షి ఆశ్రమం. బుద్ధుడు ఒకానొక సమయంలో ఆ ఆశ్రమంలో ఉంటున్నాడు. బుద్ధుడు భిక్ష కోసం వెళ్ళాడు. మధ్యాహ్న సమయంలో మాగందియుడు అనే పరివ్రాజకుడు ఆ ఆశ్రమానికి వచ్చాడు. అగ్నిశాలలో నేల మీద పరచి ఉన్న పడకను చూశాడు.

''నేను ఇక్కడ ఉండొచ్చా;'' అని అడిగాడు.

''లేదు.. అది భగవాన్ బుద్ధునిది'' అన్నాడు.

''అగ్నిశాలలో పడక ఏర్పాటు చేసేంత గొప్పవాడా ఆ శాక్య గౌతముడు?''

''అవును మాగందియా! అతను తథాగతుడు. దుఃఖ నివారణ ఎరిగినవాడు. అష్టాంగ మార్గం చూపినవాడు'' అన్నాడు భారద్వాజుడు.

''భారద్వాజా! నేను గౌతమునికి మించిన వాడినే. మా ఇరువురినీ ఒకేచోట చూస్తే ఆ గౌతముడు వృద్ధి నాశకుడని మీరే అంగీకరిస్తారు'' అన్నాడు అహంకారంతో మాగందియుడు.

''ఐతే సరి... మీరన్నట్లే'' అన్నాడు భారద్వాజుడు.

మధ్యాహ్నం ముగిసేవేళకి బుద్ధుడు వచ్చాడు. ఒక పక్క కూర్చొని భిక్ష స్వీకరించాడు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు. ఆ తర్వాత మాగందియుడు వచ్చాడు. ఆరోగ్యం, నిర్వాణం, అష్టాంగమార్గం... ఈ విషయాల మీద చర్చ సాగింది. అతి కొద్ది సమయానికే మాగందియుడు వెనకడుగు వేశాడు.

అప్పుడు బుద్ధుడు ''మాగందియా! ఒక గుడ్డివాడు ఉంటాడు. అతను నలుపు, తెలుపు, నీలం రంగుల్ని చూడగలడా?

''లేదు గౌతమా!''

రంగురంగుల వస్తువుల్ని చూడగలడా? తాను నడుస్తున్న దారిలో ఎగుడు దిగుళ్ళను చూడగలడా? చంద్రుణ్ణి చూడగలడా? చుక్కల్ని, సూర్యుణ్ణి చూడగలడా? ఇతరుల్ని చూడగలడా?''

''లేదు గౌతమా? ఎలా చూస్తాడు అతను గుడ్డివాడు కదా?''

''మరి అలాంటి గుడ్డివాడిని అతని బంధువులు ఒక వైద్యుని దగ్గరకు తీసుకు వస్తారు. అతను గొప్ప నేత్ర వైద్యుడు. అతను ఎన్నో విధాలుగా చికిత్స చేస్తాడు. మందులూ, పసర్లు పూస్తాడు. అయినా అతనికి చూపు రాదు. మాగందియా! ఆ వైద్యుని ప్రయత్నం గురించి నీవు ఏమనుకుంటావు?''

''వేరే అనుకునేది ఏముంది గౌతమా! ఆ ప్రయత్నం వ్యర్థం. ఆ వైద్యునికి శ్రమ మాత్రమే మిగిలింది''

''అలాగే నేను నీకు సరైన ధర్మాన్ని బోధించాను. కాని నీవు దాన్ని గ్రహించలేదు.''

''గౌతమా? మరింత విపులంగా వివరించగలరా?''

''మరలా అంధుని గురించే చెప్తాను. ఒకసారి కొందరు ఒక వస్త్రం గురించి మాట్లాడుకుంటూ–'' ఇది తెల్లనిది. మరకలు అంటనిది. అందమైనది. పరిశుభ్రంగా ఉంది. అనుకుంటూ ఉంటారు. ఒక అంధుడు దాన్ని అడిగి తీసుకుని కప్పుకుని వెళ్తూ ఉంటాడు. దారిలో ఒక మోసగాడు – ''అయ్యా! ఆగు.. మీరు కప్పుకున్నది మంచి వస్త్రం కాదు. నా దగ్గర అంత కంటే అందమైన, విలువైన వస్త్రం ఉంది'' అంటూ మురికి పట్టిన వస్త్రాన్ని ఇచ్చి, మంచి వస్త్రాన్ని తీసుకుంటాడు. అప్పుడు అతని మిత్రులు అతని దుస్థితి చూసి నేత్రవైద్యం చేయిస్తారు. అతనికి చూపు వస్తుంది. అప్పుడు అతను తాను ఇంతకాలం కప్పుకున్న వస్త్రం మురికిది అని తెలుసుకుంటాడు. దాన్ని ఏం చేస్తాడు మాగందియా?'' అని ప్రశ్నించాడు బుద్ధుడు.

మాగందియుడు కొద్దిసేపు మౌనం వహించాడు.

నెమ్మదిగా– ''శ్రీమాన్ గౌతమా! మురికి అంటిన ఆ వస్త్రాన్ని వదిలివేస్తాడు. కప్పుకోడు'' అన్నాడు.

''నేను ఏది శరీరానికీ, మనస్సుకీ ఆరోగ్యమో ఆ ధర్మాన్ని చెప్తాను. దుఃఖాన్ని దూరం చేసే దారిని చూపిస్తాను. అతి గొప్పదైన నిర్వాణ గమ్యానికి చేర్చే సద్ధర్మం బోధిస్తాను. నీవు సత్యాన్ని, జ్ఞానాన్ని దర్శిస్తే... గుడ్డితనం వదిలిపోయినట్లు. నేను చెప్పినట్లు గుడ్డితనం వదలనివాడు తిరిగి మురికి వస్త్రాలే ధరిస్తాడు. వదిలినవాడు ఆ మలిన వస్త్రాల్ని త్యజిస్తాడు. మనస్సులోని మలినాల్ని తొలగించుకుంటే ధర్మదర్శనం అవుతుంది'' అని చెప్పాడు.


''అయ్యో! భగవాన్! నేను ఇంతకాలం అహంకారంతో అజ్ఞానాన్ని, దుఃఖాన్ని పట్టుకుని వేలాడాను. ఏది ఆరోగ్యమో? ఏది దుఃఖ విమోచనమో గ్రహించాను'' అంటూ వంగి బుద్ధుని పాదాలంటి నమస్కరించాడు.

బుద్ధుడి అనుయాయిగా మారాడు. జీవితాంతం బుద్ధబోధల్ని ప్రచారం చేశాడు. మహాజ్ఞానిగా రాణించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

శంకరులు చెప్పిన చరమకాంక్ష



గంగాదేవి ఎంత గొప్పదంటే... 'మాతా జాహ్నవీ దేవీ !' అని సంబోధించారు ఆది శంకరులు. గంగాష్టకం చేస్తూ..''మాతర్జాహ్నవి శంభూసంగమిలితే మౌషా నిధాయాఞ్జలిం/ త్వత్తీరే వపుషో వాసనసమయే నారాయణాంఘ్రిద్వయమ్ / సనన్దమ్ స్మరతో భవిష్యతి మమ ప్రాణప్రయాణోత్సవే / భూయాద్భక్తిరవిచ్యుతా హరిహరాద్వైతాత్మికా శాశ్వతీ'' అన్నారు. అమ్మా! అని పిలిచారు. నా శరీరం నుంచి ప్రాణాలు ఊర్ధ్వముఖమై పోతుంటాయి.

ఏదో ఒక సమయంలో శరీరం విడిచి పెట్టాలి కదా! ''జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ /తస్మాదపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి''పుట్టినవాడు శరీరాన్ని వదిలిపెట్టక తప్పదు. అమ్మా! నా శరీరాన్ని వదిలిపెట్టేటప్పుడు నీ ఒడ్డున నిలబడి నా రెండు చేతులు తలమీద పెట్టి అంజలి ఘటించి నీవంక చూస్తూ.... నా ప్రాణాలు పైకి వెళ్ళిపోతుంటే... మిగిలిన వాళ్ళందరూ ఏడ్వ వచ్చుగాక! కానీ నాకు అది ఉత్సవం కావాలి'' అన్నారు. భగవంతుడు లోపలినుంచి బయటికి ఉత్సవమూర్తిగా వస్తుంటే పరమానందంతో రెండు చేతులెత్తి నమస్కరించి ఎగిరెగిరి చూసినట్లు – నా ప్రాణాలు పైకి లేచిపోతుంటే – అమ్మా నేను ఆనందపడిపోవాలి. ఇంతకాలం ఎవరి పాదాలు పట్టి స్మరించానో ఎవరి గురించి చెప్పుకున్నానో వారి పాదపంజరం లోకి వెళ్ళిపోతున్నా.. ఈ శరీరం వదిలి పెట్టేస్తున్నా..... అని .. చెమటపట్టిన బట్టను ఎంత తేలిగ్గా వదిలేస్తామో, అంత తేలిగ్గా నా శరీరాన్ని వదిలిపెట్టేస్తూ, నా తల మీద నారాయణ మూర్తి పాద ద్వయాన్ని స్మరిస్తూ శివకేశవుల మధ్య భేదం లేకుండా బతికిన నేను చిట్టచివరన శరీరం విడిచిపెట్టేటప్పుడు 'అమ్మా! నిన్ను చూడాలి' అని అంటారు.

గంగమ్మ వైభవాన్ని గురించి చెబుతూ ఆయన... ''ఆదావాది పితామహస్య నియమ వ్యాపార పాత్రే జలం/ పశ్చాత్పన్నగ శాయినో భగవతః పాదోదకం పావనమ్ / భూయః శంభుజటా విభూషణ మణిర్జహ్నోర్మహర్షే రియం / కన్యా కల్మషనాశినీ భగవతీ భాగీరథీ దృశ్యతే'' అన్నారు. ఆమె మొట్టమొదట శ్రీమహావిష్ణువు పాదాలను కడగడానికి పనికొచ్చింది. బ్రహ్మ సృష్టికర్త. ఆయన తన కమండలంలోని నీటితో విష్ణువు పాదాన్ని కడిగారు. అంటే ఆ కమండలంలో ఉన్నది గంగే. తరువాత శంభుని తలమీద పడింది. తరువాత జహ్ను మహర్షి తాగి తాను మళ్ళీ విడిచి పెట్టాడు. అలా ఋషి స్పర్శ పొందింది. అటువంటి గంగమ్మా! నా పాపాలన్నీ తొలగించు.. అని వేడుకున్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

దీక్షితార్ వారు దీనినంతటినీ దృష్టిలో పెట్టుకుని గంగే మాం పాహి.. గిరీశ శిరస్థితే... అన్నారు తన కీర్తనలో. గంగ శివుని తలను తాకింది.. ఎలా? వినయంతో తాకిందా !!! నిజానికి పైనుంచి పడిపోయేటప్పుడు చాలా అహంకారంతో పడింది. 'ఈడ్చి అవతల పారేస్తాను పాతాళానికి..'' అంటూ పడింది. అలా పడుతుంటే పరమ శివుడు..''ఇంత అహంకరిస్తోంది గంగ. ఎలా వెళ్ళిపోతుందో, నన్నెంత లాగేస్తుందో చూస్తా..' అనుకుంటూ.. పాండురంగడు నిలుచున్నట్లు నడుం మీద రెండు చేతులు పెట్టుకుని పైకి చూస్తూ నిలుచున్నాడు. పైనుంచి గంగ పడంగానే జుట్టుతో కట్టేసాడు.. జటాజూటంలో. అలా దానిలోకి ఏళ్లతరబడి అలా పడుతూనే ఉంది.

శాస్త్రాలుగానీ మరేదయినా గానీ చదువుకోని దీక్షితార్ వారు చిన్న చిన్న పదాలతో చాలా గంభీరమైన భావాల్ని తన కీర్తనల్లో అద్భుతంగా పలికించారు. అదంతా గురువుల శుశ్రూష ఫలితంగా అబ్బిన విద్యాగంధం.

సినిమా

దసరాకు తండేల్!



నాగ చైతన్య

దసరా పండక్కి థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అవుతున్నారట 'తండేల్'. హీరో నాగచైతన్య, దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం ఇది. ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. కాగా 'తండేల్' సినిమాను ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల చేసే ఆలోచన చేస్తున్నారట దర్శకుడు చందు మొండేటి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెల్లడికానుందని సమాచారం. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



రష్మికా మందన్నా

ఇట్స్ రొమాంటిక్ టైమ్!



ప్రభాస్

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ అండ్ ఫ్యూచరిస్ట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ, అన్నాబెన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు రాజమౌళి, హీరోలు విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ మూవీకి సంబంధించిన మేజర్ షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని ప్రధాన తారాగణమంతా పాల్గొంటారని తెలిసింది. ప్రస్తుతం ప్రభాస్, దిశాపటానీ కాంబి నేషన్‌లో ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట దర్శకుడు నాగ్‌అశ్విన్. ఈ సాంగ్ పూర్తయిన తర్వాత కొంత టాకీ పార్టు, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారట. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

క్రైమ్ థ్రిల్లర్



రాశీ సింగ్, రాజ్ కందుకూరి

''కలర్ ఫోటో' చిత్రానికి ముందు 'మను చరిత్ర' సినిమాలో శివ స్నేహితుడిగా చేశాను. నిర్మాత రాజ్ కందుకూరిగారు నన్ను కూడా తన కుమారుడు శివలానే చూసుకునే వారు. నేను హీరో కాకముందే నన్ను ఓ హీరోలా చూశారాయన. 'భూతద్ధం భాస్కర్ నారాయణ'లోని 'శివ ట్రాప్ ట్రాన్స్..' పాట అద్భుతంగా ఉంది. ఈ సినిమాని అందరూ చూడాలి'' అని హీరో సుహాస్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న విడుదల అవుతోంది. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'శివ ట్రాప్ ట్రాన్స్..' అనే పాటని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి లాంచ్ చేశారు. అనంతరం నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సుహాస్ ముఖ్య అతిథిగా హాజరై, పాట రిలీజ్ చేశారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్ అందించిన ఈ పాటని కాలభైరవ పాడారు. ''మా సినిమాని తప్పకుండా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు శివ కందుకూరి. ''యునిక్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు పురుషోత్తం రాజ్. ''మా మూవీ అందరికీ నచ్చుతుంది'' అన్నారు స్నేహాల్, శశిధర్, కార్తీక్. ఈ వేడుకలో దర్శకుడు విజయ్ కనకమేడల, హీరోయిన్ వర్ష బొల్లమ్మ, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల పాల్గొన్నారు.

తృటిలో తప్పించుకున్నాం!

చావు నుంచి తృటిలో తప్పించుకున్నామని చెబుతున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. అసలు విషయం ఏంటంటే... ఇటీవల ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు రష్మికా మందన్నా ఓ విమానంలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఈ విమానంలోనే మరో హీరోయిన్ శ్రద్ధాదాస్ కూడా ఉన్నారు. అయితే విమానం టేకాఫ్ అయిన అరగంటలోపే ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి ముంబైలోనే అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఆందోళనకరమైన ఘటనను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు రష్మికా మందన్నా. 'చావు నుంచి మేం తృటిలో తప్పించుకున్నాం' అనే క్యాప్షన్‌తో శ్రద్ధాదాస్‌తో ఉన్న ఫోటోను షేర్ చేశారు రష్మికా మందన్నా. ప్రస్తుతం ఈ ఫోటో వైరల్ అవుతోంది. కాగా ఇదే ఘటనపై హీరోయిన్ శ్రద్ధాదాస్ కూడా స్పందించారు. ''విమానంలో వందమందికిపైగా ప్రయాణికులున్నారు. మేం దాదాపు చనిపోతామనే భావన కలిగింది. కానీ, పైలెట్ సరైన నిర్ణయం తీసుకుని అత్యవసర ల్యాండింగ్ చేశారు'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు శ్రద్ధాదాస్.



శ్రద్ధా దాస్‌తో...

ఇంద్రాణి ట్రైలర్ బాగుంది - మణిశర్మ



మణిశర్మ, యానియా భరద్వాజ్

''ఇంద్రాణి' సినిమా ట్రైలర్ చాలా బాగుంది. పాటలు కూడా బాగున్నాయి. సాయి కార్తీక్ అద్భుతమైన సంగీతం ఇచ్చాడు. సరికొత్త కథాంశంతో రూపొందిన 'ఇంద్రాణి' చిత్రం విజయం సాధించాలి'' అని ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. యానియా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఇంద్రాణి'. స్టీఫెన్ పల్లం దర్శకత్వంలో వెరోనికా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై స్టాన్లీ సుమన్ బాబు నిర్మించారు. సుధీర్ వేల్పుల, ఓఓ రెడ్డి, జైసన్, కేకే రెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ– ''అమెరికాలో ఉంటూ ఇక్కడ సినిమా నిర్మించడం ఎంత కష్టమో నాకు తెలుసు. సినిమా మీద ప్యాషన్ ఉంటే తప్ప అది సాధ్యం కాదు. 'ఇంద్రాణి' విజయం సాధించాలి'' అన్నారు. ''అన్ని వాణిజ్య అంశాలున్న సైన్స్‌ఫిక్షన్ థ్రిల్లర్ ఇది. రాబోయే 50 సంవత్సరాల్లో ఇండియా సాంకేతిక పరంగా ఎంత ముందుంటుంది? అనేది ఈ సినిమాలో చూపించాం'' అన్నారు స్టీఫెన్ పల్లం. ఈ వేడుకలో చిత్ర సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: స్టాన్లీ పల్లం, కెమెరా: చరణ్ మాధవనేని.

నా కుటుంబమే నా బలం



వరుణ్ ధావన్, నటాషా దలాల్

బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ఓ శుభవార్తను షేర్ చేశారు. తాను తండ్రి అయిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ''మేం తల్లిదండ్రులయ్యాం. మీ ఆశీర్వాదాలు కావాలి. మై ఫ్యామిలీ మై స్ట్రెన్త్ (నా కుటుంబమే నా బలం)'' అంటూ తన భార్య నటాషాదలాల్ ప్రెగ్నెన్సీతో ఉన్న ఫోటోను షేర్ చేశారు వరుణ్‌ధావన్. ఫ్యాషన్ డిజైనర్, మోడల్ నటాషా దలాల్‌ను 2021 జనవరిలో వరుణ్ వివాహం చేసుకున్నారు. హిందీలో ప్రస్తుతం 'బేబీ జాన్' సినిమా చేస్తున్నారు వరుణ్ ధావన్. అలాగే ఆయన నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ ఈ ఏడాది వేసవిలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇందులో సమంత ఓ లీడ్ రోల్ చేశారు.

సరికొత్త ప్రేమ కథ



వైష్ణవీ సింగ్, ఉదయ్ రాజ్


ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేష్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్‌పై యం. బంగార్రాజు నిర్మించిన ఈ సినిమా వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. రాజేష్ చికిలే మాట్లాడుతూ– ''1990 నేపథ్యంలో సాగే టీనేజ్ లవ్‌స్టోరీ 'మధురం'. సరికొత్త ప్రేమ కథతో రూపొందిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, గొడవలు ఎలా ఉండేవో నేటి తరానికి కళ్లకు కట్టినట్లు మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. నా పాత్ర ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది'' అన్నారు ఉదయ్ రాజ్. ''మా మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు యం. బంగార్రాజు. ఈ సినిమాకు సంగీతం: వెంకీ వీణ.

సమాజం కోసం రికార్డ్ బ్రేక్



సోనియా, రగ్గా ఇఫ్తాకర్

నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన, తుమ్మల ప్రసన్న కుమార్, శాంతి తివారీ, సోనియా, కాశీ విశ్వనాథ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్‌పై చదలవాడ పద్మావతి నిర్మించారు. ఈ సినిమా గ్లింప్స్‌ని 'మాతృదేవోభవ' ఫేమ్ దర్శకుడు అజయ్ కుమార్, టీజర్‌ని నిర్మాత రామ సత్యనారాయణ, ట్రైలర్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి. ప్రసన్నకుమార్ విడుదల చేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ–''వేటగాడు, అడవి రాముడు, దేవదాసు' వంటి సినిమాల స్ఫూర్తితో ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. ఇప్పటి వరకు నాకున్న అనుభవంతో సమాజానికి ఉపయోగపడే ఓ మంచి కథతో సినిమా తీయాలని 'రికార్డ్ బ్రేక్' తీశా. ఇందులో చివరి 45 నిమిషాలు చాలా భావోద్వేగాలు ఉంటాయి. ఈ సినిమాకి విజయం అందించాలి'' అన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులు నిహార్ కపూర్, రగ్గ ఇఫ్తాకర్, సత్య కృష్ణ, సంజన, సోనియా, నాగార్జున, కథా రచయిత అంగిరెడ్డి శ్రీనివాస్, మ్యూజిక్ డైరెక్టర్ సాబు వర్గీస్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కంతేటి శంకర్, నిర్మాణం: చదలవాడ బ్రదర్స్.


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 329

సోమవారం 19-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మంచి పాలనకు

మళ్లీ సిద్ధం

- వివరాలు 10,11 పేజీల్లో

రాప్తాడు సభలో సీఎం వైఎస్ జగన్ పిలుపు

“ జిల్లాల విభజన తర్వాత రాయలసీమకు జల సముద్రం వస్తే ఈరోజు రాప్తాడుకు జన సముద్రం తరలి వచ్చింది. ఈ జన సముద్రానికి, రాయలసీమ గడ్డకు, ప్రతి సీమ బిడ్డకూ మీ జగన్ నిండు మనసుతో గుండెల నిండా ప్రేమతో అభివాదం చేస్తున్నాడు. ఈ ఎన్నికల్లో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరగబోతోంది. ఇవి కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునే ఎన్నికలు మాత్రమే కావు. పెత్తందార్లకు - పేదలకు మధ్య సంగ్రామం. మన పథకాలతో కోట్లాది మంది గుండె తలుపుతట్టాం. ఈ మంచి కొనసాగాలన్నా, భవిష్యత్‌లో ఇంకా మంచి పనులు జరగాలన్నా మనం మళ్లీ గెలవాలి. పొరపాటు జరిగితే చంద్రముఖి మన ఇంట్లోకి గ్లాసు పట్టుకొని సైకిల్‌పై వస్తుంది. పేదల రక్తం తాగేస్తుంది.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలి.
- సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి.
- తాగేసిన టీ గ్లాసు ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలి.



అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు హాజరైన అశేష జన సముద్రంలో ఓ భాగం

సంక్షేమంతో కోట్లాది గుండెల తలుపు తట్టాం

మన పథకాల గురించి ఒక్కొక్కరూ వంద మందికి చెప్పాలి.. ఇవి కీలక ఎన్నికలు.. అత్యంత అప్రమత్తంగా ఉండాలి

పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే చంద్రముఖి సైకిల్‌పై ఇంటికొస్తుంది

బాబుకు ఓటేయడమంటే సామాజిక న్యాయం, డీబీటీని వద్దనుకోవటమే

ఇతర రాష్ట్రాల్లో ఉంటూ మోసం చేయడానికి అప్పుడప్పుడు ఏపీకి వస్తుంటారు

చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒక్కటైనా ఉందా?.. జగన్‌కు ప్రజాబలం లేకుంటే పొత్తుల కోసం వెంపర్లాట ఎందుకు బాబూ?

ఈ ఎన్నికలు విశ్వసనీయత, వంచనకు మధ్య జరుగుతున్నాయి.. 57 నెలల పాలనలో 99 శాతం హామీలను అమలు చేశాం

ఒక్కసారి అధికారం ఇస్తే మీ జగనన్న ఇంత చేశాడు

రెండోసారి మూడోసారి నాలుగోసారి ఇస్తే ఇంకెంత చేస్తాడో ఆలోచించాలి

సీమలో జనసముద్రం

ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిన 250 ఎకరాల సభా ప్రాంగణం

ఖాళీ లేక రోడ్లపై నిలిచిపోయిన లక్షలాది మంది జనం

దేశవ్యాప్తంగా 'ట్రెండింగ్'





434 పరుగుల తేడాతో..

భారత్ బలగం ముందు ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆట కుదేలైంది. రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్టులో యశస్వి, జడేజా, సర్ఫరాజ్ రాణించడంతో మరో రోజు ఆట మిగిలి ఉండగానే భారత్ 434 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా టెస్టుల్లో భారత జట్టుకిదే అతి పెద్ద విజయం. 12లో



ఆసియా క్వీన్స్

ఏమాత్రం అంచనాలు లేకుండా ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత జట్టు ఏకంగా ట్రోఫీనే సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల టీమ్ విభాగం ఫైనల్లో పీవీ సింధు నాయకత్వంలోని భారత జట్టు 3–2తో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. 12లో

రయ్.. రయ్..

విస్తరణలోనూ యకహోమా జోరు

అచ్యుతాపురం వద్ద రూ.3,079 కోట్లతో ఏటీసీ టైర్ల తయారీ యూనిట్

- కోవిడ్ సంక్షోభంలోనూ 16 నెలల రికార్డు సమయంలోనే ఉత్పత్తి మొదలు
- 2022 ఆగస్టులో సీఎం జగన్ చేతుల మీదుగా వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం
- రోజుకు 132 టన్నుల రబ్బరు వినియోగం.. 120కి పైగా దేశాలకు టైర్ల ఎగుమతి.. తొలి దశ ప్రారంభం కాగానే రెండో దశ విస్తరణకు శ్రీకారం
- 2వ దశలో రూ.680 కోట్లతో ప్యాసింజర్ వాహనాల టైర్ల తయారీ యూనిట్
- ఏటా 17 లక్షల కారు టైర్ల తయారీ సామర్థ్యంతో జోరుగా విస్తరణ పనులు
- తద్వారా 2,300 మందికి ఉపాధి

2లో



సొంతూరులో ఉద్యోగం

“ అచ్యుతాపురానికి చెందిన నాకు సొంతూరుకు పక్కనే యకహోమా ఆఫ్ హైవే టైర్స్‌లో ఉద్యోగం లభించడం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ పని వాతావరణం చాలా బాగుంది. పర్యావరణ పరిరక్షణ, భద్రతకు పెద్ద పీట వేస్తూ తగిన శిక్షణ ఇచ్చారు. జపాన్‌కు చెందిన మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం రావడం పట్ల నా ఆనందానికి అవధులు లేవు. ఇదే పట్టుదలతో ఉన్నత స్థానానికి చేరుకుంటాను.

– రజనా శ్యామల, టైర్‌బిల్డింగ్–ప్రొడక్షన్, ఏటీసీ టైర్స్

నవ భారత్ నిర్మిద్దాం

లక్ష్య సాధన కోసం అహర్నిశలూ శ్రమిద్దాం

- 'అబ్‌కీ బార్ చార్‌సౌ పార్' మిషన్‌తో పనిచేద్దాం..
- ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయని విపక్షాలూ నినదిస్తున్నాయి
- కాంగ్రెస్ నుంచి దేశాన్ని, యువతను కాపాడాలి..
- బీజేపీ మళ్లీ రావాలని చాలా దేశాలు కోరుకుంటున్నాయి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పార్టీ శ్రేణులతో ప్రధాని మోదీ

6లో



“ రాబోయే వంద రోజుల్లో ప్రతి కొత్త ఓటరు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుడిని పలకరించాలి. ప్రతి ఇంటికి వెళ్లాలి. అందరి విశ్వాసాన్ని పొందాలి. బీజేపీకి అత్యధిక సీట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. బీజేపీకి సొంతంగా 370కి పైగా స్థానాలు, ఎన్డీఏకి 'అబ్‌కీ బార్ చార్‌సౌ పార్' మిషన్‌తో పనిచేద్దాం. ఇకపై భారత్ స్వప్నాలు, సంకల్పాలు విశాలమైనవిగా ఉంటాయి. ఈ పదేళ్లలో ఒక మైలురాయిని మాత్రమే చేరాం. గమ్యాన్ని చేరుకుంటామనే విశ్వాసం ఉంది. కోట్లాది మంది ప్రజల జీవితాలను మార్చాల్సి ఉంది. తీసుకోవాల్సిన నిర్ణయాలు చాలా ఉన్నాయి. -ప్రధాని మోదీ



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

కష్టకాలంలో కన్న వారిలా ఆదుకున్నారు

మాది మధ్య తరగతి కుటుంబం. మా ఆయన శ్రీనివాసరావు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో టైలరింగ్ చేసి కుటుంబాన్ని పోషించేవారు. మూడేళ్ల కిందట ఆయన గుండెపోటుతో ఆకస్మికంగా కన్ను మూశారు. పిల్లలను ఎలా చదివించుకోవాలో తెలియక సతమతమయ్యా. నేను తప్పనిసరి పరిస్థితుల్లో టైలరింగ్ నేర్చుకుని ఆ పని మొదలుపెట్టా. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నన్ను ఆదుకున్నాయి. మా ఆయన బతికి ఉన్నప్పుడు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.76,964, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.8,375 వచ్చాయి. మా అబ్బాయి ఆకాశ్ పదో తరగతి చదువుతున్నాడు. వాడికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వంతున వచ్చింది. మా అమ్మాయి మేఘన డిగ్రీ చదువుతోంది. ఆమెకు జగనన్న విద్యా దీవెన కింద ఇప్పటి వరకు రూ.12 వేలు వచ్చింది. నాకు



వైఎస్సార్ ఆసరా కింద రూ.22,682, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.1,577, జగనన్న చేదోడు ద్వారా ఏటా రూ.పది వేల వంతున వచ్చాయి. వితంతు పింఛన్ కూడా మంజూరైంది. ఇప్పుడు మేము ఎలాంటి చీకు చింతా లేకుండా జీవిస్తున్నామంటే కారణం ఈ ప్రభుత్వం అందించిన పథకాలే. ముఖ్యమంత్రి జగనన్న మేలును ఎప్పటికీ మరువలేం.

– రౌతు అనూరాధ, కురుపాం
(కె.చంద్రమౌళి, విలేకరి, కురుపాం)

'వెన్ను'దన్నుగా జగనన్న

ప్రభుత్వ వైద్య శాలలు అందుబాటులో లేని సమయంలో 2012కు ముందు వరకు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామంలో ఉంటూ సైకిల్‌పై ఊరూరా తిరుగుతూ ఆర్‌ఎంపీ వైద్యుడిగా ప్రజలకు వైద్యం అందిస్తూ వచ్చాను. నాడు కుటుంబ పోషణ బాగానే ఉండేది. 2012 ఏప్రిల్‌లో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడ్డాను. వెన్నుపూసకు గాయమై మంచం పట్టాల్సి వచ్చింది. నాటి నుంచి ఎన్ని మందులు వాడినా, వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోయింది. మాకు ఒక కుమార్తె ఉంది. ఆమే కొడుకులా మారి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు డీఎంహెచ్‌ఓ పింఛన్ రూ.5 వేలు వస్తోంది. దీనిలో రూ.3 వేలు నెలవారీ మందులకు ఖర్చవుతోంది. ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తోంది. మిగిలిన రూ.2 వేలతో కుటుంబ పోషణ చేస్తున్నా. వైఎస్సార్ చేయూత పథకం



ద్వారా నా భార్యకు ఏటా రూ.18,750 వస్తోంది. జగనన్న మాకు వెన్నుదన్నుగా నిలిచారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాను.

– బిజ్జంకి పాండురంగారావు, బంగారుగూడెం
(కొడమంచిలి ఆశీర్వాదరావు, విలేకరి, తాడేపల్లిగూడెం రూరల్)

ఆపద వేళ సర్కారు ఆసరా

మాది పేద కుటుంబం. నా భర్త వెంకటరమణ చిల్లరకొట్టులో గుమాస్తా. నేను టైలరింగ్ చేస్తుంటాను. మాకిద్దరు పిల్లలు. గుంటూరు జిల్లా తెనాలిలో ఉంటున్నాం. నా భర్త సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టం కావడంతో నేను టైలరింగ్ షాపు పెట్టుకున్నా. అదే సమయంలో కరోనా మహమ్మారి విలయ తాండవంతో వ్యాపారం లేక, ఆదాయం సరిపోక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. షాపు మూసివేయాల్సి వచ్చింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో వైఎస్సార్ ఆసరా పథకం మా కుటుంబాన్ని ఆదుకుంది. ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగు విడతలుగా రూ.48 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ డబ్బుతో టైలరింగ్ షాపును మళ్లీ ప్రారంభించా. జగనన్న తోడు పథకం కింద అదనంగా మరో రూ.10 వేలు వచ్చాయి. ఆ డబ్బులను కూడా వ్యాపారానికి ఉపయోగించా. దీంతో మా జీవితం గాడిలో పడింది. నా కొడుకు ఇటీవలే గుమాస్తాగా చేరాడు. కుమార్తెకు వివాహం చేశా. చేయూత పథకంలో భాగంగా నాకు ఏటా రూ.18,750 చొప్పున రావడం



తో హోల్ సేల్ మార్కెట్ నుంచి చీరలు కొనుగోలు చేసి తీసుకువచ్చి మా టైలరింగ్ షాపులోనే విక్రయిస్తున్నా. సాధారణ కుట్టు మెషిన్ అమ్మేసి ఆధునిక యంత్రాన్ని కొనుగోలు చేశా. దీంతో ఆర్డర్లు కూడా బాగా వస్తున్నాయి. ఇప్పుడు ఉన్నంతలో ఆనందంగా బతుకుతున్నాం. మా ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– మునిపల్లి పార్వతి, తెనాలి
(ఆలపాటి సుధీర్ కుమార్, విలేకరి, తెనాలిఅర్బన్)

రయ్.. రయ్..

- విస్తరణలోనూ యకహోమా జోరు
- అచ్యుతాపురం వద్ద రూ.3,079 కోట్లతో ఏటీసీ టైర్ల తయారీ యూనిట్



సాక్షి, అమరావతి: ఎటువంటి ప్రచార ఆర్భాటం, ఒప్పందాలు, శంకుస్థాపనలు వంటి భారీ కార్యక్రమాలు లేకుండా కోవిడ్ సమయంలో నిర్మాణం పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభించిన జపాన్‌కు చెందిన ఒక భారీ మల్టీ నేషనల్ కంపెనీ విస్తరణ దిశగా వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. జపాన్‌కు చెందిన యకహోమా గ్రూపు.. అలయన్స్ టైర్స్ కంపెనీ (ఏటీసీ) పేరుతో రూ.3,079 కోట్ల భారీ పెట్టుబడితో టైర్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తొలి దశలో రూ.1,750 కోట్ల వ్యయంతో హాఫ్ హైవే టైర్లు (భారీ యంత్ర పరికరాలకు వినియోగించే టైర్లు) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం 2019 నవంబర్‌లో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపీబీ) 2020 నవంబర్‌లో ఆమోదం తెలిపారు. వెనువెంటనే అనకాపల్లి పరిధిలోని అచ్యుతాపురం వద్ద ఏపీఐఐసీ భూమి కేటాయించడంతో నిర్మాణ పనులు ప్రారంభించింది. 2021 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించిన వెంటనే కరోనా సంక్షోభం తలెత్తినా, రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడంతో తొలి దశ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసింది. 2022 జూలైలో తొలి టైరును ఉత్పత్తి చేసింది. ఈ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2022 ఆగస్టు 16న వాణిజ్యపరంగా ప్రారంభించారు. రోజుకు 132 టన్నుల రబ్బరును వినియోగించడం ద్వారా ఉత్పత్తి చేసిన టైర్లను 120కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ప్లాంట్‌లో చిన్న టైర్లు (ఏఎఫ్‌సీ సెగ్మెంట్), పెద్ద బయాస్ టైర్లు (అగ్రి మరియు కాన్స్), రేడియల్ టైర్లు (అగ్రి), రేడియల్ (ఓటీఆర్), బయాస్ టైర్, ఓటీఆర్ టైర్లు, ఫారెస్ట్రీ టైర్లు, సాలిడ్ టైర్లు వంటివి తయారవుతున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో విస్తరణ

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుండటంతో యకహోమా గ్రూపు ప్యాసింజర్ వాహనాల టైర్లను తయారు చేసే యూనిట్ నిర్మాణ పనులను ప్రారంభించింది. సుమారు రూ.680 కోట్ల పెట్టుబడితో ప్యాసింజర్ కారు టైర్ల తయారీ లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. దేశీయ ప్యాసింజర్ కార్లకు డిమాండ్ భారీగా పెరగడంతో దానికి తగ్గట్టుగా ఏటా 17 లక్షల టైర్ల తయారీ సామర్థ్యంతో విస్తరణ పనులు మొదలు పెట్టింది. ఈ యూనిట్‌ను 2024 చివరి త్రైమాసికానికి అందుబాటులోకి తీసుకు రావాలని యకహోమా గ్రూపు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం 28 లక్షల టైర్లుగా ఉన్న ఏటీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా 45 లక్షల టైర్లకు చేరుకోనుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న యూనిట్‌లో 22 అంగుళాల వరకు ఉండే టైర్లను ఉత్పత్తి చేస్తారు. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని, 2022లో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా అవతరించిందని, ఇదే రకమైన వృద్ధి భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని యకహోమా అంచనా వేస్తోంది. 2007లో 7 లక్షల టైర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఇండియాలో అడుగుపెట్టిన ఈ గ్రూపు వేగంగా విస్తరిస్తోంది. ఇండియాలో ఇప్పటికే రెండు యూనిట్లు.. తిరువన్‌వేలి, దోహేజ్‌ల్లో ఉండగా, మూడవ యూనిట్‌ను అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ పూర్తి స్థాయి సామర్థ్యం అందుబాటులోకి వస్తే 2,300 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో 75 శాతం మంది స్థానికులకే ఉపాధి కల్పించనున్నారు. ఇందుకోసం స్థానిక ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసుకొని శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 1000 మందికిపైగా పని చేస్తుండగా, విస్తరణకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచుకోనున్నారు.

పూర్తి స్థాయిలో ప్రభుత్వ మద్దతు

ఈ ప్రాజెక్టు ప్రారంభం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందించింది. ఏపీఐఐసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో పాటు స్థానిక సంస్థల ప్రతినిధులు పూర్తిగా సహకరించారు. నిర్దేశించుకున్న గడువులోగానే ప్రాజెక్టును పూర్తి చేయగలిగాం.

– ప్రహ్లాదరెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఏటీసీ టైర్స్

యకహోమా ఉద్యోగి కావడం ఆనందంగా ఉంది

జపాన్‌కు చెందిన యకహోమా ఆఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్‌లో ఉద్యోగిగా ఉండటం పట్ల చాలా ఆనందంగా ఉంది. క్యాంపస్ సెలక్షన్‌లో నేను ఏటీసీ టైర్స్‌లో ఉద్యోగం పొందాను. యకహోమా కుటుంబ సభ్యుడిగా సొంత రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తాను.

– లాబాల పవన్ కళ్యాణ్, టైర్ బిల్డింగ్-ప్రొడక్షన్, ఏటీసీ టైర్స్

తగ్గుతున్న లింగ నిష్పత్తి అంతరం

- ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- రాష్ట్రంలో 2015–17లో లింగ నిష్పత్తి 916
- ప్రస్తుతం 1,000:934గా నమోదు
- గుంటూరు జిల్లాలో అత్యధికంగా 1,000:1,029

సాక్షి, అమరావతి: లింగ సమానత్వాన్ని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. లింగ నిష్పత్తి అంతరం నానాటికీ తగ్గుతూ ఉండటమే ఇందుకు నిదర్శనం. మగ పిల్లలయినా, ఆడ పిల్లలయినా ఇద్దరూ సమానమే అని ప్రజల ఆలోచన విధానాల్లోనూ మార్పు వస్తోంది. దీంతో గతంతో పోలిస్తే బాలికల జననాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో లింగ నిష్పత్తి అంతరం అంతకంతకూ తగ్గుతోంది. ఓ వైపు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తూ.. ప్రజలను చైతన్యవంతులను చేస్తోంది. 2015–17లో 916గా ఉన్న లింగ నిష్పత్తి (వెయ్యి మంది మగ శిశువులకు ఆడ శిశువులు) ప్రస్తుతం 934కు పెరిగింది. ఈ అంతరాన్ని పూర్తి స్థాయిలో అధిగమించడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రభుత్వ కృషి ఫలించి గతేడాది మార్చి నుంచి డిసెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా 2.42 లక్షల మంది మగ శిశువులు, 2.25 లక్షల మంది ఆడ శిశువులు జన్మించారు.

ముందంజలో గుంటూరు, పార్వతీపురం మన్యం జిల్లాలు..

లింగ నిష్పత్తి అంతరాన్ని అధిగమించడంలో గుంటూరు, పార్వతీపురం మన్యం జిల్లాలు ఏపీలో ముందంజలో నిలిచాయి. గతేడాది మార్చి నుంచి డిసెంబర్ మధ్య గుంటూరు జిల్లాలో 21,244 మంది శిశువులు జన్మించగా.. అందులో 10,470 మగ, 10,774 ఆడ శిశువులు ఉన్నారు. ఈ లెక్కన గుంటూరు జిల్లాలో 1,029 (ప్రతి 1,000 మంది పురుషులకు ఉన్న మహిళలు)గా లింగ నిష్పత్తి నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 4,101 మగ శిశువులు, 4,105 ఆడ శిశువులు జన్మించారు. దీంతో 1,001 లింగ నిష్పత్తితో రెండో స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలిచింది. 1,000:987తో ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానం దక్కించుకుంది. 1,000:876 తో అనంతపురం, 1,000:877తో శ్రీసత్యసాయి జిల్లాలు అట్టడుగు స్థానాల్లో నిలిచాయి.

అట్టడుగు జిల్లాలపై ప్రత్యేక దృష్టి

లింగ నిష్పత్తిలో అంతరాన్ని అధిగమించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అట్టడుగున ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాం. స్కానింగ్ సెంటర్‌లపై జిల్లాల్లో నిరంతర నిఘా పెడుతున్నాం. డెకాయ్ ఆపరేషన్‌లు చేపడుతున్నాం. ప్రజల్లో మరింత అవగాహన పెంచడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నాం.

– డాక్టర్ అనిల్‌కుమార్, అదనపు సంచాలకులు, వైద్య, ఆరోగ్యశాఖ

ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం

'ఎక్స్'లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే, 'ప్రజాసేవలో ఉన్న వారికి మరో రెండు మెట్లు పైకి ఎక్కే అవకాశం కల్పిస్తాం. ఈ ఐదేళ్లు ప్రజలకు మంచి పాలన అందించాం. కాబట్టి, మనలో ఎవరు పోటీలో ఉన్నా ప్రజలు బ్రహ్మరథం పడతారు'.. అని ఆదివారం రాత్రి 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.

పచ్చమంద దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

'చంద్రబాబు కపట వాగ్దానాలు, ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ఎండగట్టడానికి మన సోషల్ మీడియా సైన్యమంతా సిద్ధమా? సోషల్ మీడియాలో మన ప్రభుత్వంపై పచ్చమంద చేస్తున్న దుష్ప్రచారాన్ని మీ సెల్‌ఫోన్ ద్వారా తిప్పికొట్టండి'.. అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఇంధన ఆదాకు రోల్‌మోడల్ 'ఈసీబీసీ బిల్డింగ్'

- ప్రాజెక్టుకు రూ.5 కోట్లు మంజూరు చేసిన బీఈఈ
- జూన్‌నాటికి భవనాన్ని పూర్తి చేసేలా లక్ష్యం



విశాఖలో నిర్మాణంలో ఉన్న సూపర్ ఈసీబీసీ భవనం

సాక్షి, విశాఖపట్నం: త్వరలో విద్యుత్, ఇంధన రంగాల్లో దక్షిణాది నగరాలకు దీటుగా విశాఖపట్నంను రోల్ మోడల్‌లా నిలిపేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ), ఏపీఈపీడీసీఎల్, ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్‌ఈసీఎం) భాగస్వామ్యంతో వైజాగ్‌లో అత్యాధునిక సూపర్ ఈసీబీసీ భవన నిర్మాణ ప్రాజెక్టు సిద్ధమవుతోంది. దీనికి బీఈఈ నిధులు మంజూరు చేసింది. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) బిల్డింగ్‌గా ఏపీఈపీడీసీఎల్ నిర్మిస్తున్న ఈ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ తొలుత జీ+1 నిర్మాణంగా భావించినా.. ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) సహకారంతో జీ+2కు ప్లాన్‌లో మార్పులు చేశారు. జూన్ నెలాఖరుకు ఇది అందుబాటులోకి రానుంది.

అదనపు నిధుల కోసం...

గతేడాది మేలో సాగర్ నగర్ సమీపంలోని బీచ్‌రోడ్డులో భవన నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పటివరకూ రూ.4 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఒప్పంద విలువ తొలుత రూ.10.61 కోట్లుగా భావించినా.. అదనంగా మరో అంతస్తు చేర్చడంతో రూ.15.38 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తం వ్యయాన్ని భరించేలా అదనంగా రూ.10 కోట్ల గ్రాంట్ విడుదల చేయాలని కేంద్ర విద్యుత్‌శాఖను రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ కోరారు.

50 శాతానికి పైగా విద్యుత్ ఆదా

ఈసీబీసీ, ఈసీబీసీ ప్లస్, సూపర్ ఈసీబీసీ అనే మూడు పెర్ఫార్మెన్స్ స్థాయి ప్రమాణాలను ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) సూచిస్తుంది. ఇందులో విశాఖలో నిర్మిస్తున్న 'సూపర్ ఈసీబీసీ' ఇంధన సామర్థ్య నిర్వహణలో అత్యుత్తమ స్థాయికి సూచీ. సంప్రదాయ భవనాలతో పోలిస్తే 50 శాతానికి పైగా ఇంధనం పొదుపు అవుతుంది. అంతేకాకుండా పర్యావరణ సవాళ్లని పరిష్కరించడంతో పాటు ఇంధన డిమాండ్ తీర్చడంలోనూ ముఖ్య భూమిక పోషిస్తుంది. సీఎం జగన్ సూచనలకు అనుగుణంగా ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్పెషల్ సెక్రటరీ కె.విజయానంద్, ఎనర్జీ డిపార్ట్‌మెంట్, డిస్కమ్‌లు వినూత్న కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు.

దేశానికి ఆదర్శంగా..



బీఈఈ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న ఈ భవనం ఏపీని దేశంలోనే ఆదర్శంగా నిలుపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు 24/7 విద్యుత్ సరఫరాకు సహాయకారిగా మారనుంది. 24వ రెగ్యులేటరీ-పాలసీ మేకర్స్ రిట్రీట్, ఇప్పాయ్ పవర్ నేషనల్ అవార్డుల్ని ఏపీఈపీడీసీఎల్ సాధించడమే ఇందుకు నిదర్శనంగా దేశమంతా ప్రశంసిస్తుండటం గర్వంగా ఉంది.

– పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

పొదుపులో అగ్రగామి



ఇంధన వినియోగం, ఉద్గారాల నియంత్రణలో సూపర్ ఈసీబీసీ బిల్డింగ్ కీలకం. విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గడం, తక్కువ నిర్వహణ ఖర్చుల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు కూడా మెరుగుపడనున్నాయి. ఈ భవన నిర్మాణం పర్యావరణ పరిరక్షణ, సరికొత్త ఆవిష్కరణలకు రోల్‌మోడల్‌గా వ్యవహరించనుంది. ఇంధన వనరుల పొదుపులో ఏపీ ప్రభుత్వం, ఈపీడీసీఎల్ చొరవను బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్‌భాక్రే కూడా ప్రశంసించారు.

– ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బీఈఈ సదరన్ స్టేట్స్, యూటీ మీడియా అడ్వైజర్

బాల్య వివాహాలకు ముగింపు

- బాలికా విద్యపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో చర్యలు
- ప్రతినెలా సీఎస్ సమీక్ష



సాక్షి, అమరావతి: బాల్య వివాహాల నివారణకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. గత ఏడాది ఒక్కో నెలలో వందకు పైగా బాల్య వివాహాలపై ఫిర్యాదుల రాగా.. ఈ ఏడాది జనవరి నెలలో ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. జనవరి నెలలో 60 బాల్య వివాహాలపై ఫిర్యాదులు రాగా.. అందులో 57 బాల్య వివాహాలను ప్రభుత్వం నివారించింది. ఏలూరు జిల్లాలో రెండు, పల్నాడు జిల్లాలో ఒకటి కలిపి మొత్తం మూడు బాల్య వివాహాలు మాత్రమే జరగ్గా.. అందులో రెండు వివాహాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మొత్తం 26 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో మాత్రమే జనవరి నెలలో ఫిర్యాదులు వచ్చాయి. మిగతా తొమ్మిది జిల్లాల్లో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. బాల్య వివాహాలపై 1098 హెల్ప్‌లైన్‌తో పాటు వివిధ మార్గాల ద్వారా ఫిర్యాదులు రాగానే సంబంధిత శాఖల సిబ్బంది అప్రమత్తమై రంగంలోకి దిగుతున్నారు.

గ్రామస్థాయి నుంచే పటిష్ట చర్యలు

బాల్య వివాహాల నివారణకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. బాల్య వివాహాల నివారణకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది. యుక్త వయసులో ఉన్న బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు వల్ల ఉత్పన్నమయ్యే చెడు ప్రభావాలపై అవగాహన సమావేశాల్ని నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాల నివారణలో భాగంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన విధించారు. బాల్య వివాహాల నిరోధించడంపై రోజువారీ, నెలవారీ చేపడుతున్న చర్యలు ఫలిస్తున్నాయి. గత నెలలో ఫిర్యాదులు గణనీయంగా తగ్గడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

బాల్య వివాహాల నివారణకు నెలవారీ క్యాలెండర్

'బేటీ బచావో.. బేటీ పఢావో' (ఆడపిల్లను రక్షించండి. ఆడపిల్లలకు చదువు చెప్పండి) పథకం కింద జిల్లాల వారీగా రూ.5.56 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులతో బాలికల విద్యతో పాటు బాల్య వివాహాల నివారణకు అవసరమైన కార్యకలాపాలను నెలవారీ క్యాలెండర్‌గా నిర్వహిస్తున్నారు. ఈ పథకం కింద ఆడ పిల్లలకు విద్యనందించడం, లింగ వివక్షను నివారించడం, ఆడ పిల్లల రక్షణ, సంరక్షణ, బాల్య వివాహాల నివారణ కార్యకలాపాలను జిల్లాల వారీగా నిర్వహిస్తున్నారు. దీనికి తోడు బాల్య వివాహాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి ప్రతినెలా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

రూ.1,042.51 కోట్లతో విద్యాకానుక

- 2024–25 విద్యా సంవత్సరానికి సిద్ధంచేస్తున్న అధికారులు
- 39.52 లక్షల కిట్లకు ఆర్డర్
- బడి తెరిచిన మొదటిరోజే పంపిణీకి ఏర్పాట్లు
- కిట్ల నాణ్యత పరిశీలనకు ప్రత్యేక వ్యవస్థ
- నాలుగేళ్లలో రూ.3,366.53 కోట్లతో జేవీకే పంపిణీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకిచ్చే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ప్రణాళిక సిద్ధమైంది. రాష్ట్రంలోని 44,617 పాఠశాలల్లో చదువుతున్న 39,51,827 మందికి వీటిని అందించనున్నారు. ఇందుకోసం రూ.1,042.51 కోట్లతో వీటిని సిద్ధంచేస్తున్నారు. గతేడాది మాదిరిగానే 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాల తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు విద్యా కానుక (జేవీకే-5)ను అందించాలని పాఠశాల విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది ఒకటి నుంచి పదో తరగతి వరకు పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ కిట్లను తీసుకుంటున్నారు. అయితే, జేవీకే-4లో మిగిలిన వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం కిట్లను తీసుకోనున్నారు. ఇప్పటికే కిట్లకు అవసరమైన వస్తువులను సరఫరా చేసేందుకు ఆయా సంస్థలు అంగీకారం తెలపగా, ఏప్రిల్ చివరివారం నుంచి వాటిని సరఫరా చేయనున్నారు. ఈలోగా టెన్త్ పరీక్షలతో పాటు ఏప్రిల్ రెండోవారం నాటికి మిగతా తరగతుల పరీక్షలు కూడా పూర్తవుతాయి. దీంతో.. అప్పటి విద్యార్థుల సంఖ్య ఆధారంగా కిట్లను తీసుకుంటారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి తప్పి, తిరిగి పాఠశాలల్లో చేరిన వారిని ఈ విద్యా సంవత్సరం 'రెగ్యులర్'గా పరిగణించి వారికి కూడా విద్యాకానుక కిట్లను అందించారు. గతేడాది ఏ ధరకు వస్తువులను సరఫరా చేశాయో, జేవీకే-5 కిట్‌లోని వస్తువులకు కూడా అదే ధరను నిర్ణయించారు. ఇక ఈ నాలుగేళ్లలో జేవీకే పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.3,366.53 కోట్లు వెచ్చించింది.

నూరు శాతం నాణ్యతతో కిట్లు..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులందరికీ 2020–21 విద్యా సంవత్సరం నుంచి 'జగనన్న విద్యా కానుక'ను అందిస్తోంది. ఇప్పటివరకు నాలుగుసార్లు ఈ కిట్లను అందించారు. ఇందులో నాణ్యమైన స్కూలు బ్యాగు, పాఠ్య, నోటు పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్సులు, వర్క్‌బుక్స్ (ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు), ఇంగ్లిష్-తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (హైస్కూల్), పిక్టోరియల్ డిక్షనరీ, కుట్టుకూలీతో సహా మూడు జతల యూనిఫారం క్లాత్, బెల్టు, టై ఉంటాయి. వీటి సరఫరాతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. మరోవైపు.. విద్యార్థులకిచ్చే ఈ కిట్ల నాణ్యతను ఆయా కంపెనీలు పరిశీలించే సరఫరా చేస్తున్నాయి. ఇందుకోసం గతంలో బ్యాగుల నాణ్యతా ప్రమాణాలను సీపెట్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) చూసింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసింది. అంటే.. రా మెటీరియల్ నుంచి బ్యాగుల ఉత్పత్తి, స్టాక్ పాయింట్‌కు చేరే వరకు అన్ని దశల్లోనూ పర్యవేక్షణకు లాభాపేక్ష లేకుండా కేంద్ర ప్రభుత్వం మద్దతుతో నడుస్తున్న 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' సంస్థకు అప్పగించింది. వచ్చే విద్యా సంవత్సరానికి సరఫరా చేసే వస్తువులను సైతం క్యూసీఐ సంస్థే నాణ్యతను పర్యవేక్షించనుంది.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన

206 అడుగుల విగ్రహం ఏర్పాటు ఘనత సీఎందే: మంత్రి మేరుగు



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో మంత్రి మేరుగు

పర్చూరు (చినగంజాం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు ప్రఖ్యాతులను, ఆశయాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున కొనియాడారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం బోడవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ గేరా అశోక్ బాబు అధ్యక్షతన నిర్వహించిన 'థ్యాంక్స్ జగన్' కార్యక్రమంలో మంత్రి మేరుగు మాట్లాడుతూ.. విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు కూరాకుల ఇస్సాక్‌బాబు, జంగా ఎలీ షాబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మైలా చిననాగేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలపై నేరాలకు పాల్పడితే సత్వరమే శిక్ష పడాలి: బబిత

సాక్షి, అమరావతి: బాలలపై నేరాలకు పాల్పడిన కేసులకు సంబంధించి న్యాయ, పోలీస్, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి నిందితులకు సత్వరమే శిక్ష పడేలా చూడాలని ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(ఏపీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి మజ్జి బబిత పేర్కొన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె చెప్పారు. ఏపీఎస్ఎల్ఎస్ఏ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(సీఆర్ఏఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి కన్సల్టేషన్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై తల్లిదండ్రులు, పిల్లలకు చైతన్యం కలిగేలా పోలీసులతోపాటు ఆయా శాఖలు సైతం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ(ఏపీఎఫ్ఎస్ఎల్), జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ ఫణిభూషణ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్ఎస్ఎల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హెచ్.అమర రంగేశ్వర రావు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి, దిశ డీఎస్పీ సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

'సంసద్ రత్న' గ్రహీతలకు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి అభినందన

సాక్షి, న్యూఢిల్లీ: సంసద్ రత్న అవార్డులు పొందిన పార్లమెంటు సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లు అభినందించారు. అవార్డులు పొందిన ఎంపీలందరూ కలసి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతిలతో తీసుకున్న గ్రూపు ఫొటోలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పర్యాటక, రవాణా, సాంస్కృతిక శాఖల పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ హోదాలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకుగాను విజయసాయిరెడ్డి సంసద్ మహారత్న అవార్డును ఢిల్లీలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అందుకున్న విషయం తెలిసిందే.

జనసేన నేతలతో పవన్ భేటీ

సాక్షి, విశాఖపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదివారం రాత్రి వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. టీడీపీతో పొత్తు నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆ పార్టీ అభ్యర్థులకు టికెట్ల కేటాయింపులు, సర్దుబాట్లు, నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, రానున్న ఎన్నికల్లో టీడీపీ శ్రేణులతో కలిసి పనిచేయడం, వారితో ఎలా సమన్వయం చేసుకోవాలి.. తదితర అంశాలపై చర్చించారు.

సాంకేతిక ఉత్పత్తుల్లో
అగ్రగామిగా ఏపీ

దేశంలోనే మొదటి నాలుగు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్

- వ్యర్థాలతో టెక్నికల్ టెక్స్‌టైల్స్ ఉత్పత్తికి సమృద్ధిగా వనరులు
- అరటి వ్యర్థాలతో ఉత్పత్తుల్లో మొదటి స్థానంలో రాష్ట్రం
- జనపనార ఉత్పత్తుల్లో ఐదో స్థానం
- అమెరికా, జర్మనీ, నేపాల్‌కు ఏటా రూ.180 కోట్ల విలువైన ఎగుమతులు



సాక్షి, అమరావతి: సాంకేతిక ఉత్పత్తులు (టెక్నికల్ టెక్స్‌టైల్స్) రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ఈ రంగంలో ఐఐటీ–ఢిల్లీ నిర్వహించిన అధ్యయనంలోనూ దేశంలోనే మొదటి నాలుగు స్థానాల్లో రాష్ట్రం చోటు దక్కించుకుంది. సాంకేతిక ఉత్పత్తుల్లో వైద్య రంగం (మెడిటెక్), వ్యవసాయం, ఆక్వా (అగ్రోటెక్), ఆటోమొబైల్ (మొబిటెక్), క్రీడా పరికరాలు (స్పోర్ట్స్‌టెక్), భవన నిర్మాణ సామాగ్రి (బిల్డ్‌టెక్), గృహోపకరణాలు (హోంటెక్), భారీ టవర్లు (ఇండుటెక్), ప్యాకింగ్ సామాగ్రి (ప్యాక్‌టెక్) వంటి దాదాపు 12 విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలో ప్రధానంగా ఆగ్రో టెక్స్‌టైల్స్, మొబైల్ టెక్స్‌టైల్స్, జియో టెక్స్‌టైల్స్‌లకు భారీ డిమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా, జర్మనీ, నేపాల్ తదితర దేశాలకు ఏటా రూ.180 కోట్ల విలువైన సాంకేతిక ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతున్నాయి. రాష్ట్రంలోనూ స్థానికంగా వినియోగం ఉంటోంది. విశాఖపట్నంలోని మెడిటెక్ జోన్‌లో వైద్య పరికరాల ఉత్పత్తులు (మెడికల్ టెక్స్‌టైల్స్) ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్లాస్టిక్, గ్రాసిమ్ వంటి అంతర్జాతీయ డిమాండ్ ఉన్న 15 టెక్నికల్ టెక్స్‌టైల్ కంపెనీలు మనరాష్ట్రంలోనే ఉండటం విశేషం. రాష్ట్రంలో సాంకేతిక ఉత్పత్తులు (టెక్నికల్ టెక్స్‌టైల్స్)కు మూడు పారిశ్రామిక కారిడార్లు, పోర్టులు, పారిశ్రామికీకరణ వంటివి అనుకూల పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

రాష్ట్రంలో ఏయే రంగాల్లో అనుకూలమంటే..

- ➢ **మొబిటెక్:** కియా, ఇసూజీ, అశోక్ లేలాండ్, హీరో వంటి ప్రధాన ఆటోమొబైల్ తయారీదార్ల నుంచి రాష్ట్రంలో మొబిల్‌టెక్ ఉత్పత్తులకు చాలా డిమాండ్ ఉంది.
- ➢ **జియో టెక్స్‌టైల్స్:** దేశంలో రెండో అతిపెద్ద తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో జియో ట్యూబులు, జియో బ్యాంగ్‌లకు డిమాండ్ ఉంది. ఓడరేవుల వద్ద తీర ప్రాంతం నీటి కోతకు గురికాకుండా జియో ట్యూబులను వినియోగిస్తారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడలో జియోట్యూబ్ సీవాల్ నిర్మాణం ఒకటి. ఇది దేశంలోనే మొదటి జియో టెక్స్‌టైల్ ట్యూబ్ నిర్మాణంగా గుర్తింపు పొందింది. రోడ్ల పటిష్టత కోసం కూడా జియో ట్యూబులను వినియోగిస్తారు.
- ➢ **ఆగ్రోటెక్ టెక్స్‌టైల్స్:** ఉద్యాన రంగంలో ఉపయోగించే షేడ్ నెట్‌లు, పండ్లు, మొక్కలకు ఉపయోగించే క్రాప్ కవర్ ఉత్పత్తులు.. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, వనరుల సామర్థ్యం, వ్యర్థాల తగ్గింపునకు దోహదం చేస్తాయి. హార్టికల్చర్‌లో ఆగ్రో టెక్స్‌టైల్స్ వినియోగంతో మంచి దిగుబడులను సాధించవచ్చు. నీటి వినియోగాన్ని 30 నుంచి 45 శాతానికి తగ్గించవచ్చు. ఆక్వా కల్చర్‌లోనూ ఫిషింగ్ నెట్స్, ఫిషింగ్ లైన్ల రూపంలో ఆగ్రో టెక్స్‌టైల్స్‌కు అవకాశాలు ఉన్నాయి. చేపల చెరువుల నిర్మాణం, నిర్వహణలోనూ జియో టెక్స్‌టైల్స్‌ను ఉపయోగిస్తున్నారు. రాష్ట్రంలో 2.12 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్న ఆక్వాకల్చర్ రంగం ఆగ్రోటెక్‌కు ప్రధాన ప్రోత్సాహంగా నిలుస్తోంది. దేశంలో చేపలు, రొయ్యల ఉత్పత్తిలో ఆగ్రోటెక్, జియోటెక్స్‌టైల్స్‌కు 30 శాతం డిమాండ్ ఉంది.

అరటి వ్యర్థాల ఉత్పత్తుల్లో దేశంలోనే ఏపీ టాప్..

టెక్నికల్ టెక్స్‌టైల్స్‌లో అరటి వ్యర్థాలతో ఉత్పత్తులను తయారు చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. అలాగే జనపనార ఉత్పత్తుల్లో ఐదో స్థానం దక్కించుకుంది. రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలను నూలుగానూ, ఆ తర్వాత వస్త్రంగానూ పలు రకాలుగా వినియోగించే సాంకేతిక ఉత్పత్తులను తయారు చేయడంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందడుగు వేస్తున్నారు. రీసైకిల్ చేసిన వ్యవసాయ వ్యర్థాలను నూలు ఉత్పత్తులు, షూలు, శానిటరీ నాప్‌కిన్‌లు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. అరటి ఫైబర్ నుంచి కవర్లు, శానిటరీ ప్యాడ్‌లు, నూలు, షూలు తయారు చేస్తున్నారు. పైనాపిల్, అరటి పండు వ్యర్థాల నుంచి వివిధ ఫంక్షనల్ ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్నారు. సాంకేతిక ఉత్పత్తుల్లో రాష్ట్రం గత ఐదేళ్లలో 8–10 శాతం వృద్ధిని నమోదు చేసింది.

సాంకేతిక ఉత్పత్తులకు మంచి భవిష్యత్ ఉంది..

సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సాంకేతిక ఉత్పత్తుల రంగంలో వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నాం. రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు ఆక్వా రంగం పెద్ద వినియోగదారుగా ఉంది. ఆగ్రో టెక్స్‌టైల్స్.. సుస్థిర వ్యవసాయం, వనరుల సామర్థ్యం, వ్యర్థాల తగ్గింపునకు దోహదం చేస్తున్నాయి. హార్టికల్చర్‌లో ఆగ్రో టెక్స్‌టైల్స్.. నీరు, ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు దోహదం చేస్తున్నాయని అనేక అధ్యయనాలు తేల్చాయి. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక ఉత్పత్తులకు మంచి భవిష్యత్ ఉంది. దీంతో రాష్ట్రంలోనూ ఆ దిశగా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పుష్కలమైన వనరులు, సాంకేతిక సామర్థ్యాలు కలిగిన ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు ఉత్పత్తిదారుగానే కాకుండా అతిపెద్ద వినియోగదారుగా కూడా ఉండనుంది.

– కె.సునీత, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి

రాష్ట్రం నుంచి ఎగుమతవుతున్న సాంకేతిక ఉత్పత్తులు..

జిల్లా	ప్రధాన సాంకేతిక ఉత్పత్తులు
అనంతపురం	సీటు బెల్టులు, ఎయిర్ బ్యాగ్‌లు
చిత్తూరు	శానిటరీ ప్యాడ్స్
తూర్పుగోదావరి	చేపలు పట్టే వలలు, లైఫ్ జాకెట్లు
ప్రకాశం	కన్వేయర్ బెల్ట్
పశ్చిమగోదావరి	జనపనారతో చేసిన హెస్సియన్ వస్త్రం
విశాఖపట్నం	సన్నటి ఊలు దారాల ఉత్పత్తులు, సీటు బెల్టులు, కన్వేయర్ బెల్టులు

పశుపోషకులకు
కొండంత భరోసా

నాణ్యమైన పశువుల దాణా సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

- పశుపోషణ ఖర్చు తగ్గించి లాభాల దిశగా పాడి రంగం
- పకడ్బందీగా ఏపీ పశు దాణా చట్టం–2020 అమలు
- దీని పరిధిలోకి దాణా తయారీ, అమ్మకం, సరఫరా
- నిర్దేశిత ధరలకే కల్తీ లేని నాణ్యమైన దాణా
- 1,680 మందికి లైసెన్సులు జారీ
- రాష్ట్రవ్యాప్తంగా నాసిరకం తయారీదారులపై ఉక్కుపాదం



సాక్షి, అమరావతి: నాణ్యమైన దాణాను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పశుపోషకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశు పోషణ ఖర్చును భారీగా తగ్గించి.. పాడిరంగాన్ని లాభాల బాట పట్టించడమే లక్ష్యంగా ఏపీ పశు దాణా చట్టం –2020 తీసుకొచ్చింది. దీని పరిధిలోకి దాణా తయారీ, సరఫరా, అమ్మకం కార్యకలాపాలన్నింటినీ తెచ్చింది. అంతేకాకుండా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లపెంపకందార్లకు నాణ్యతా ప్రమాణాలు కలిగిన.. కల్తీలేని దాణా, ఖనిజ లవణ మిశ్రమాన్ని నిర్దేశించిన ధరలకు అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే 1,680 మంది తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, స్టాకిస్టులకు ఈ చట్టం కింద లైసెన్స్‌లు జారీ చేసింది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ నాసిరకం దాణా తయారీ, విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతోంది. లైసెన్సుల జారీ, శాంపిల్స్ తనిఖీల ద్వారా ఇప్పటివరకు రూ.5.25 కోట్లు వసూలు చేసింది.

పశువుల ఆహార అవసరాలకే 70 శాతం ఖర్చు

రాష్ట్రంలో 46 లక్షల ఆవులు, 62.19 లక్షల గేదెలు, 1.76 లక్షల గొర్రెలు, 55 లక్షల మేకలు, 10.78 లక్షల పౌల్ట్రీ సంపద ఉంది. మూగజీవాలకు ఏటా 65 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం కాగా ఏటా సగటున 70.92 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. పశుపోషణ కోసం చేసే ఖర్చులో 70 శాతం వాటి ఆహార అవసరాల కోసమే ఉంటోంది. గతంలో నాణ్యత విషయంలో దాణా తయారీదారులు గోప్యత పాటించడం పశుపోషకులకు ఆశనిపాతంగా ఉండేది. దాణాలో.. తేమ, ముడి మాంసకృత్తులు, ముడి కొవ్వు పదార్థాలు, ముడి పీచు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు ఉంటాయి. ఇలా తయారైన దాణాను అధిక మోతాదులో వినియోగిస్తే తప్ప ఆశించిన స్థాయిలో ఉత్పాదన వచ్చేది కాదు. ముడి మాంసకృత్తులను పెంచడానికి కొంతమంది తయారీదారులు చట్టవిరుద్ధమైన పనులు చేసేవారు. దీంతో పెట్టుబడి భారం పెరగడంతోపాటు నాణ్యమైన పాల ఉత్పత్తి రాక పశుపోషకులు ఆర్థికంగా నష్టపోయేవారు. మరోవైపు ఆరోగ్యవంతమైన పశువులు సైతం దీర్ఘకాలిక రోగాల బారిన పడేవి. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఏపీ పశు దాణా చట్టం తెచ్చింది. ఈ చట్టం 2021 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

చట్టం అమలుకు ప్రత్యేక కమిటీలు

పశు దాణా చట్టం అమలు కోసం ప్రత్యేకంగా పశు దాణా నాణ్యత, నియంత్రణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 'కంట్రోలింగ్ అథారిటీ, కలెక్టర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల నేతృత్వంలో జిల్లా స్థాయి లైసెన్సింగ్ అథారిటీలను నియమించింది. పశుదాణా నాణ్యతను తనిఖీ చేసేందుకు స్థానిక పశువైద్యులకు యానిమల్ ఫీడ్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు అప్పగించింది. వీరు క్షేత్ర స్థాయి తనిఖీల్లో సేకరించిన శాంపిల్స్‌కు ప్రభుత్వం గుర్తించిన ప్రయోగశాలల్లో నాణ్యతా పరీక్షలు చేస్తున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ షాపులను అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ఏపీ యానిమల్ ఫీడ్ యాక్ట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ పేరిట ప్రత్యేకంగా ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఇప్పటివరకు 1,680 మంది దాణా తయారీదారులు, అమ్మకందార్లకు లైసెన్సులు ఇచ్చింది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక గతంతో పోలిస్తే నాసిరకం దాణా తయారీ, సరఫరా, అమ్మకాలు తగ్గుముఖం పట్టాయని పశుపోషకులు చెబుతున్నారు.

నాణ్యత లేని దాణా తయారుచేస్తే క్రిమినల్ కేసులు..

పశు దాణా చట్టం అమల్లోకి వచ్చాక అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నాం. నాణ్యత లేని దాణా తయారీదారులు, నిర్ణీత ప్రమాణాలు పాటించనివారు, తప్పుడు ప్రకటనలు ఇచ్చే కంపెనీలపై ఈ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించినట్టు తేలితే కనీసం ఏడేళ్ల జైలుశిక్ష, తగిన జరిమానా పడుతుంది.

– డాక్టర్ అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

బాబుకన్నా దుర్మార్గులు ఎవరుంటారు?

- నేను సిఫార్సు చేస్తేనే నీకు అప్పట్లో మంత్రి పదవి
- నీకే సత్తా ఉంటే నీకొడుకు ఎందుకు మంగళగిరిలో గెలవలేదు
- నేను గెలిచి నీ పార్టీలోకి వస్తానని చెప్పినట్లు గలీజు మాటలు మాట్లాడితే సహించను
- చంద్రబాబుపై చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం ఫైర్



ఒంగోలు: 'నీ చరిత్ర ఏంటో, నా చరిత్ర ఏంటో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నా.. నీవు ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా'.. అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సవాల్ విసిరారు. పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో శనివారం జరిగిన బహిరంగసభలో చంద్రబాబు తనను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం కరణం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

నన్ను దుర్మార్గుడు అన్న చంద్రబాబు కన్నా లోకంలో ఎవరైనా దుర్మార్గులు ఉంటారా? 2019 ఎన్నికల్లో నేను చీరాల టికెట్ అడగలేదు. నిన్ను, నీ కొడుకుని దూషించారంటూ వారిపై కోపంతో దుగ్ధ తీర్చుకునేందుకు బలవంతంగా నన్ను చీరాల పంపిన విషయం మర్చిపోవద్దు. గతాన్ని మరిచి మాట్లాడొద్దు. 1975లో నేను ప్రకాశం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు నువ్వు ఒక తాలూకా అధ్యక్షుడివి. అప్పట్లో ఢిల్లీ వెళ్లి నీకు మంత్రి పదవికి సిఫార్సు చేసింది నేను. అది మరిచి నాపై విమర్శలు చేస్తే నీ జీవితం మొత్తం బయటపెట్టాల్సి వస్తుంది. నేను చీరాలకు వెళ్లినా గెలిచానంటే అక్కడి స్థానిక పరిస్థితుల దృష్ట్యా పార్టీలకు అతీతంగా ప్రజలు నాకు బ్రహ్మరథం పట్టారు. అంతేతప్ప చంద్రబాబు శక్తివల్ల కాదు. చంద్రబాబుకే గెలిపించే సత్తా ఉంటే ఆయన కొడుకు లోకేశ్‌ను మంగళగిరిలో ఎందుకు గెలిపించుకోలేకపోయాడు. నేను గెలిచి నీ పార్టీలోకి వస్తానని చెప్పినట్లు గలీజు మాటలు మాట్లాడితే సహించను.

కోడెలను కనీసం పరామర్శించలేదు..


నువ్వు సీఎంగా ఉండగా 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తీసుకుని అందులో కొందరికి మంత్రి పదవులు ఇచ్చావు. ఇది మీకు స్వయంగా, పార్టీకి నష్టం అని చెప్పినా వినలేదు. నువ్వు చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారం అన్నట్లుగా మాట్లాడితే ఎలా? నీ కార్పొరేట్ రాజకీయాలవల్ల పార్టీని నమ్ముకున్న ఎందరో బలైపోయారు. పరిటాల, కోడెల విషయంలో నువ్వు ఏమైనా పద్ధతిగా వ్యవహరించావా? కోడెల ఆస్పత్రి పాలైతే కనీసం పరామర్శ కూడా చేయలేకపోయావు. ఎవరినీ వెళ్లకుండా కట్టడి చేయడమే కాక కనీసం ఫోన్ కూడా చేయనీయకపోతే నేను వెళ్లి చంద్రబాబు పంపారంటూ అబద్ధం చెప్పాల్సి వచ్చింది. మరోవైపు.. బల్లికురవ మండలం వేమవరంలో జంట హత్యలు జరిగితే పార్టీ తరఫున నిజనిర్ధారణ కమిటీ కూడా వేయకుండా పార్టీ తరఫున కనీసం పరామర్శ కూడా చేయలేకపోవడానికి సిగ్గుండాలి. జిల్లాలో ఒక వ్యక్తిని పార్టీలోకి చేర్చుకునే సమయంలో విజయవాడ మనోరమ హోటల్ నుంచి సూట్‌కేసులతో హైదరాబాద్ ఫాం హౌస్‌కు వచ్చి డబ్బులు ఎవరికిచ్చారో చెప్పాలి.

నీ జాతకం నాకు తెలుసు

ఇక నీ పార్టీ నుంచి ఎవరైనా బయటకు వెళ్తే చెత్త అంటున్నావు.. అదే అవతలి పార్టీ వాళ్లు వద్దన్నా వారిని వేదికపై కూర్చోపెట్టుకుంటే నీకు చెరకులాగా ఉందా? నువ్వు సీఎంగా ఉన్నప్పుడు కలెక్టర్‌గా ఉన్న వినయ్‌చంద్, మంత్రి శిద్దా రాఘవరావులకు సైతం కుర్చీలను తీసేయించిన విషయం అందరికీ తెలుసు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించలేని నువ్వు నోరు జారేటప్పుడు ఎవరి క్యారెక్టర్ ఏంటో తెలుసుకుని మాట్లాడాలి. లేదంటే నీ జాతకం అంతా తెలిసిన వాడ్ని నేను నోరు విప్పే వరకు తెచ్చుకోవద్దు. నేను ఎప్పుడూ ఇంతగా ఎవరినీ విమర్శించలేదు. నన్ను వ్యక్తిగతంగా విమర్శించబట్టే నేను మాట్లాడాల్సి వచ్చింది. పార్టీలో కార్యకర్తలను నిలుపుకునేందుకు తప్పుడు మాటలు మాట్లాడితే సహించేదిలేదు. ఓడిపోతారని ప్రచారం జరగడంతో రాహుల్‌గాంధీ వద్దకు వెళ్లి మెడలో మాల వేస్తావు.. అలాగే, మోదీ భార్య ఎక్కడో అంటూ మాట్లాడడం చంద్రబాబుకు ఏమవసరం. మళ్లీ ఇప్పుడు బీజేపీ పంచన చేరేందుకు పడరాని పాట్లు పడటం ఇంతకంటే సిగ్గు పడాల్సిన అంశం ఏమైనా ఉందా?

నారాసుర వధకు జనం సిద్ధం

- సిద్ధం సభలకు ఆశయం, లక్ష్యం ఉన్నాయి: టీజేఆర్




సాక్షి, అమరావతి: నారాసుర వధకు ప్రజలంతా సిద్ధమయ్యారనేందుకు సీఎం జగన్ సభలకు తరలివస్తున్న జన సందోహమే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ సిద్ధం సభలకు సిద్ధాంత బలం, ఆశయం, లక్ష్యం ఉందన్నారు. సిద్ధం సభల ద్వారా తన సైన్యాన్ని, బలాన్ని క్రోడీకరించి సీఎం జగన్ సమర శంఖారావాన్ని పూరిస్తున్నారని చెప్పారు. సామాన్య కార్యకర్తలను సైతం ఎమ్మెల్యేలు, ఎంపీలను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సొంత కుమారుడినే ఎమ్మెల్యేగా గెలిపించుకోలేని బాబు జీవితమంతా కుట్రలమయం అని మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీకి అభ్యర్థులే దొరకడం లేదనీ, ఓసీ సీట్లలోనూ సీఎం జగన్ బీసీలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు.

బాబు బీసీలకు ఇచ్చిన రాజ్యసభ సీట్లెన్ని?

మంచి జరిగిందని నమ్మితేనే ఓటేయాలని కోరుతున్న ఏకైక రాజకీయ నాయకుడు దేశంలో సీఎం జగన్ మాత్రమేనని టీజేఆర్ స్పష్టం చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గొల్ల బాబూరావు, బీసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురుని సీఎం జగన్ రాజ్యసభకు పంపించి సామాజిక న్యాయంలో చిత్తశుద్ధిని చాటుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఆయన హయాంలో ఎంతమంది బీసీలకు రాజ్యసభ సీట్లు ఇచ్చారని ప్రశ్నించారు. రుషికొండపై భవనాలు కరకట్టపై దొంగ నిర్మాణాలు లాంటివి కావని వ్యాఖ్యానించారు. బుద్ధి ఉన్నవాడు ఎవరైనా రుషికొండ బిల్డింగ్ దగ్గర సెల్ఫీ దిగి జాతికి అంకితం ఇస్తానంటారా? అని లోకేష్‌నుద్దేశించి ప్రశ్నించారు. రాజధాని రైతుల ఉసురు తగిలి తండ్రీ, కుమారుడు దేశ దిమ్మర్ల మాదిరిగా తిరుగుతున్నారని చెప్పారు. ఎంతమంది కట్టగట్టుకుని వచ్చినా వైఎస్ జగన్ మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నాయకుల దాడి

మారణాయుధాలతో దాడి చేయడంతో ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన ఈశ్వర్‌రెడ్డి

రెంటచింతల: వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని తేలిపోవడంతో మరోసారి పచ్చమూక బరితెగించింది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లులో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతలు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఆదివారం ఈ ఘటన జరగ్గా, ఒకరు తీవ్రంగా, మరో ముగ్గురు గాయపడ్డారు. గ్రామంలో టీడీపీకి చెందిన గోగుల వెంకట రామిరెడ్డి, గోగుల సీతారెడ్డి, నెవలి లింగారెడ్డి, గోగుల లక్ష్మారెడ్డి, గోగుల పున్నారెడ్డి, గోగుల మహేష్‌రెడ్డి, పల్లెర్ల శ్రీనివాసరెడ్డి, పల్లెర్ల వెంకటరెడ్డి, మద్దిగపు పిచ్చిరెడ్డి, ధర్మనబోయిన అంకిరాజుతోపాటు మరికొందరు వైఎస్సార్‌సీపీకి చెందిన మేకపోతుల ఈశ్వర్‌రెడ్డిపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన గ్రామ సర్పంచ్ పొట్లపాటి చంద్రారెడ్డి, ఆయన కుమారుడు మనోహర్‌రెడ్డి, తమ్ముడు మల్లారెడ్డిపైనా దాడి చేశారు. ఈ ఘటనలో ఈశ్వర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా మిగిలిన ముగ్గురు గాయపడ్డారు. వీరిని కుటుంబ సభ్యులు వెంటనే గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ ఈశ్వర్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

బ్రహ్మారెడ్డి వచ్చినప్పటి నుంచి..

టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డిని నియమించినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు తమ ఉనికిని చాటుకునేందుకు దాడులకు పాల్పడుతున్నారని బాధితులు తెలిపారు. ఎంతోకాలంగా ఫ్యాక్షన్‌తో అల్లాడిపోయిన మంచికల్లు గ్రామం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రశాంతంగా ఉంది. ఇప్పుడు జూలకంటి రాకతో ఫ్యాక్షన్ దాడులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయని చెబుతున్నారు. దాడి సమాచారం అందుకున్న రెంటచింతల ఎస్‌ఐ కె.వెంకటనారాయణరెడ్డి మంచికల్లుకు చేరుకుని గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.



కుబుసం విడవలేని పాము చచ్చిపోతుంది.
అలాగే తమ అభిప్రాయాలను మార్చుకోలేని మైండ్,
ఇక మైండ్ కాకుండాపోతుంది.

– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 19 ఫిబ్రవరి 2024

పైజామా జేబులో బొంగరం

'అర్ధరాత్రి సమయం. అమ్మ నగలన్నీ వేసుకుంది. తక్కినవి మూట కట్టుకుంది. నాకంటే ఆరేళ్లు చిన్నది చెల్లెలు. దానికి పాలు బాగా తాగించి భుజాన వేసుకుంది. నేను మాత్రం నాకున్న ఒకే ఒక ఆస్తి బొంగరాన్ని నా పైజామా జేబులో పెట్టుకున్నాను. అందరం కాందిశీకులంగా మారి ఆవలి సరిహద్దుకు బయలుదేరాం. చీకటి. భీతి గొలుపుతున్న అరణ్యమార్గం. అందరి కళ్లు చీమ చిటుక్కుమన్నా రెప్పలు విప్పార్చి భయంతో, కోపంతో మొరిగినట్టుగా చూస్తున్నాయి. నడిచాం.. నడిచాం.. అమ్మ రక్తపు వాంతి చేసుకుంది. చెల్లి భుజం నుంచి జారి మట్టిలో కలిసిపోయింది. నేను నా బాల్యాన్ని అక్కడే భూస్థాపితం చేసి ఇటువైపుకు చేరుకున్నాను'...

గుల్జార్ కవిత ఇది. దేశ విభజన సమయంలో అతనికి పన్నెండు పదమూడేళ్లు ఉంటాయి. నేటి పాకిస్తాన్‌లోని జీలం నుంచి వాళ్ల కుటుంబం ఢిల్లీకి చేరుకుంది. రెఫ్యూజీ క్యాంప్‌లో గుల్జార్ బాల్యం గడిచింది. ఇక్కడకొచ్చాక కూడా వీళ్లుంటున్న రోషనారా రోడ్, సబ్జీమండీల్లో నరమేధాన్ని చూశాడు. 'మా స్కూల్లో రోజూ ప్రేయర్ చదివే కుర్రాణ్ణి చంపారు' అంటాడు. 'సబ్జీమండీలో శవాల మీద పాత కుర్చీలు, విరిగిన మంచాలు వేసి తగలబెట్టడం చూశాను' అంటాడు. 'ఇరవై ముప్ఫై ఏళ్లు అవే పీడకలల్లో వెంటాడేవి' అని వగస్తాడు.

సిక్కులు కష్టజీవులు. గుల్జార్ తండ్రి టోపీలు, చేతిసంచుల దుకాణం తెరిచాడు. పాకిస్తాన్ నుంచి వచ్చిన సిక్కులు 'మా ఊరివాడు ఒక్కడు కనిపించినా చాలు' అని వెతుక్కుంటూ తిరిగేవారు. కొందరు గుల్జార్ తండ్రి దగ్గరకు వచ్చి గుల్జార్ వాళ్ల ఇంట్లోనే తల దాచుకునేవారు. 'మా ఇల్లే ఒక రెఫ్యూజీ క్యాంప్‌గా మారింది. నాకు పడుకోవడానికి చోటే లేదు' అని చెప్పుకున్నాడు గుల్జార్. ఇదీ ఒకందుకు మంచిదే అయ్యింది. గుల్జార్‌కు కరెంటు లేని స్టోర్‌రూమ్ ఇవ్వబడింది. ఒకడే కుర్రవాడు.. తోడుగా లాంతరు. వీధి చివరకు వెళ్లి పావలా ఇస్తే వారంలో ఎన్ని పుస్తకాలైనా అద్దెకు తెచ్చుకోవచ్చు. అలా గుల్జార్ పఠనం స్టోర్‌రూమ్‌లో లాంతరు కింద మొదలైంది. 'ఒకరోజు ఒక పుస్తకం అద్దెకు తెచ్చుకున్నాను. అది ఇంతకుముందు చదివిన పుస్తకాల వలే లేదు. చదివాను. మరసటి రోజు అదే రచయిత రాసిన మరో పుస్తకం చదివాను. భలే అనిపించింది. ఆ తర్వాత ఆ రచయిత సెట్ అంతా ఉర్దూలో ఉంటే తెచ్చుకుని చదివాను. దారీ తెన్నూ లేని ఒక కాందిశీక పిల్లవాడి జీవితాన్ని మార్చడానికే బహుశా ఆ రచయిత నాకు తారసపడ్డాడేమో. అతని పేరు రవీంద్రనాథ్ టాగోర్' అంటాడు గుల్జార్.

ఇంటి నిండా కాందిశీక బంధుమిత్రులు ఉండిపోవడంతో గుల్జార్‌కు జరిగిన మరో మంచి బొంబాయిలో ఉన్న సోదరుడి దగ్గర ఉండమని తండ్రి పంపించడం. అక్కడే గుల్జార్ సొట్టలుపోయిన కార్లకు పెయింట్ వేసే పని మొదలెట్టాడు. అప్పటికే అతడికి రంగులు తెలుసు. బొమ్మలు తెలుసు. కవిత్వంలోని పదచిత్రాలు తెలుసు. 'ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' (పి.డబ్ల్యు.ఏ) వారాంతపు మీటింగ్‌లకు వెళ్లి కవిత్వం చదివితే సినీకవి శైలేంద్ర మెచ్చుకుని బిమల్ రాయ్‌కు పరిచయం చేశాడు. 'కార్లకు పెయింట్ వేయడం కంటే సినిమాల్లో రాస్తే ఎక్కువ డబ్బులు వస్తాయి' అని బిమల్ రాయ్ 'బందిని'లో మొదటి పాట రాయించాడు– 'మోర గోర అంగ్ లైలె'. తర్వాత గుల్జార్ హృషీకేశ్ ముఖర్జీకి ప్రధాన అనుచరుడయ్యాడు. ఆ తర్వాత సాగిందంతా గుల్జార్ జైత్రయాత్ర.

గుల్జార్ కవి, రచయిత, స్క్రీన్ ప్లే రైటర్, సినీ కవి, మాటల రచయిత, దర్శకుడు. అనువాదకుడు, బాలల రచయిత, టెలివిజన్ డైరెక్టర్... 'హర్ ఫన్ మౌలా'. సకల కళాకోవిదుడు. 'నేను నా దేశవాసుల మనోఫలకం మీద కవిగా మిగలాలని కోరుకుంటున్నా' అని అభిలషిస్తాడు గుల్జార్. అయితే మన దేశంలో పాప్యులర్ కల్చర్‌లో ఉన్న వ్యక్తి సీరియస్ సాహిత్యంలో ఎంత పని చేసినా ఎంతో ఎరుకతో వ్యవహరిస్తే తప్ప సాహిత్యముద్రను ముందువరుసలో పొందలేడు. గుల్జార్ సాహిత్యకృషి కంటే అతని సినిమా కృషే ఎప్పుడూ ముందుకొస్తూ ఉంటుంది. గుల్జార్ కవిత్వానికి ఉన్న పాఠకుల కంటే అతని సినిమా పాటలకు ఉన్న శ్రోతలు విస్తారం కావడమే కారణం. చిత్రమేమిటంటే గుల్జార్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' వచ్చినప్పుడు ఆనందించినవారు ఎందరో మొన్న 'జ్ఞానపీఠ్' ప్రకటించినప్పుడు సంతోషించినవారు అందరు. ఇలా 'దాదాసాహెబ్', 'జ్ఞానపీఠ్' రెండూ అందుకున్న సృజనమూర్తి మన దేశంలో ప్రస్తుతానికి మరొకరు లేరు.

'ఎప్పుడైనా ఒంటరిగా కూచుని నా కవిత్వం మొత్తం చూసుకున్నప్పుడు ఇందులో ఇంత ఉదాసీనత ఎందుకుందా అని బెంగటిల్లుతాను' అంటాడు 90 ఏళ్లకు సమీపిస్తున్న గుల్జార్. జీవితాన్ని, ప్రేమను, మానవీయ అనుబంధాలను, ప్రకృతి ప్రదర్శించే ఇంద్రజాలంలో పొందగల ఆనందాలను... ఊరటను, చిన్నచిన్న ఫిర్యాదులను, పెద్దపెద్ద సర్దుబాట్లను రాస్తూ వచ్చిన గుల్జార్ ఈ దేశపు వర్తమాన ముఖచిత్రాన్ని అనునిత్యం న్యూస్‌పేపర్లలో చూసి ఉదాసీనత చెందుతూనే ఉంటాడు. మరల మరల ప్రేమను పంచాల్సిన సంకల్పాన్ని పొందుతూనే ఉంటాడు.

కత్తులు నిద్రలేచే రాత్రులు మరోమారు దేశంలో అరుదెంచకూడదని కలవరపడే గుల్జార్, పైజామా జేబులో బొంగరాన్ని దాచుకుని బుగ్గలపై కన్నీటి చారికలతో మిగిలిన మరో బాలుడి గాథ ఈ దేశం భవిష్యత్తులో వినరాదని దుఆ చేస్తాడు. హిందీని, ఉర్దూను కలిపి తాను మాట్లాడేభాషను 'హిందూస్తానీ'గా పేర్కొనే గుల్జార్ తన పేరుకు తగ్గట్టు ఈ హిందూస్తాన్ ఒక పూలతోటై విరబూయాలని, సుగంధాలను వెదజల్లుతూనే ఉండాలని కలంతో సందేశాలను పంపుతూనే ఉంటాడు.

డ్రాగన్‌కు పావురంతో పనేంటి?

కామెంట్



కరణ్ థాపర్

కాళ్లకు లోహపు రింగులు, రెక్కల వెనుక చైనీస్ అక్షరాలున్న ఒక పావురాన్ని గత మే నెలలో ముంబై పోలీసులు అదుపులోకి తీసుకుని, ఎనిమిది నెలల పాటు 'కస్టడీ'లో ఉంచారు. 'అనుమానాస్పదమైన సమాచారం' లభించకపోవడంతో విడుదల చేశారు. చివరకు అది తైవాన్ నుంచి తప్పిపోయి వచ్చిన రేసు పావురం అని తేలింది. ఇవి రోజుకు వెయ్యి కిలోమీటర్లు ఎగరగలవు. భారత అధికారులు ఒక పావురాన్ని బంధించటం ఇదే మొదటిసారి కాదు. 2015లో, 2020లో కూడా ఇలా జరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలంలో పావురాలను నిఘా కోసం ఉపయోగించారు. కానీ గూఢచర్యం కోసం ఇప్పుడు అనేక అత్యాధునిక సాధనాలు ఉన్నప్పుడు, చైనా ఒక రేసు పావురాన్ని వదిలిపెడుతుందా?

తరచూ మన దేశంలో చిత్ర విచిత్రాలు, అద్భుతమైన విషయాలు సంభవిస్తూ ఉంటాయని మనందరికీ తెలుసు. అసలలా ఉండటమే ఇండియాను ఉత్సుకతను రేకెత్తించేలా, ఉత్తేజం కలిగించేలా, అనేకసార్లు ఊహాతీతమైనదిగా చేస్తుంటుంది. అయితే 'ద వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఇటీవల వచ్చిన ఒక కథనం ఇవేవీ కానటువంటి పూర్తి భిన్నమైన కొత్త కోణాన్ని ఇండియాకు జోడించింది. నిజం చెప్పాలంటే, ఆ కొత్త కోణాన్ని నేను ఏ విధంగానైనా వివరించగలనేమో నాకు తెలియటం లేదు. మీకే వదిలేస్తాను.

'ద పోస్ట్'లో వచ్చిన కథనం ఇలా మొదలౌతుంది: ''చైనా తరఫున గూఢచర్యానికి వచ్చి వాలిందన్న అనుమానంపై ఎనిమిది నెలల పాటు బందీగా ఉంచిన ఒక పావురాన్ని చివరికి అది గూఢచారి ఏజెంట్ కాదనీ, దిక్కుతోచక దారి తప్పి వచ్చిన తైవాన్ రేసింగ్ పక్షి అనీ నిర్ధారించుకున్న భారత అధికారులు దానికి విముక్తి కల్పించారు.''

కాళ్లకు లోహపు రింగులు, రెక్కల వెనుక ఈకల చాటున చైనీస్ అక్షరాలు కలిగి ఉన్న ఈ పావురాన్ని గత మే నెలలో ముంబైలోని ఒక ఓడరేవు సమీపంలో కనిపెట్టిన పోలీసులు దానిని అదుపులోకి తీసుకుని, ఎనిమిది నెలల పాటు 'కస్టడీ'లో ఉంచారు.

''లోతైన మరియు సరైన దర్యాప్తుతో పాటుగా, అనేక విచారణలను'' జరిపిన అనంతరం ''అనుమానాస్పదమైన సమాచారం గానీ, తగిన సాక్ష్యాధారాలు గానీ'' తమకు లభించలేదని ముంబై పోలీసులు చెప్పినట్లు ఆ పత్రిక నివేదించింది. తదనుగుణంగా – ఇప్పటికి దాదాపు మూడు వారాల క్రితం – విడుదలైన ఆ పక్షి మంచి ఆరోగ్యంతో ఉంది.

'ద పోస్ట్' పత్రిక సంప్రదించిన నిపుణులు చెప్పటం ఏమిటంటే– బహుశా ఆ పావురం పరుగు పందేల్లోని పక్షి అయుండి, ''తైవాన్ తీరానికి సమీపంలో జరిగిన రేసింగ్ పోటీల నుంచి దారి తప్పి, అక్కడి నుంచి పడవలో దాదాపు 3,000 మైళ్లు ప్రయాణించి'' ఉండొచ్చని!

అయితే రేసు పావురాల వ్యాపారం చేస్తుండే తైవాన్ కంపెనీ 'నైస్ పీజన్' యజమాని యాంగ్ త్సంగ్–టే ''ఒక రేసు పావురం ఒక రోజులో 1,000 కిలోమీటర్ల వరకు ఎగరగలదనీ, అయితే అది ఇండియా వరకు ఎగురుతూ వెళ్లగలిగిందీ అంటే మధ్యలో కొన్ని మజిలీలు చేసి ఉంటుందనీ'' అన్నారు. ''ఏమైనా, కొన్ని పావురాలు తైవాన్ తీర ప్రాంతం నుంచి యూఎస్, కెనడా వరకు కూడా వచ్చిన ఉదంతాలు ఉన్నాయి'' అని ఆ పత్రిక రాసింది. తైవాన్, ఉత్తర



అమెరికాల మధ్య విస్తారమైన మహా సముద్ర జలం తప్ప వేరే ఏమీ లేనందున, పక్షులు అంతదూరం ఎలా వెళ్లగలిగాయో నాకైతే అంతు పట్టటం లేదు. ఒకవేళ పావురాలకు ఈత కొట్టటం గానీ తెలిసి ఉంటుందా?

భారత అధికారులు ఒక పావురాన్ని పట్టి బంధించటం ఇదే మొదటిసారి కాదు. 'ద పోస్ట్' చెబుతున్న దానిని బట్టి 2015లో, మళ్లీ 2020లో ఇలా జరిగింది. ఆ సందర్భంలోనే... ''భారీ సైనిక మోహరింపులతో ఉండే సరిహద్దుల మీదుగా ఎగిరొచ్చిన ఒక పాకిస్తానీ మత్స్యకారుడి పావురాన్ని పోలీసులు స్వల్పకాలం పాటు అదుపులోకి తీసుకున్నారు.''

ఇప్పుడు మీరు వృత్తి పట్ల ఎంతో నిబద్ధతను కలిగి ఉన్న ముంబై పోలీసులను చూసి పరిహసించే ముందు, చరిత్రలో పక్షుల గూఢచర్యం నిజంగానే ఉండేదని ఆ పత్రిక రాసిన విషయాన్ని గమనించాలి. ''మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ... పావురాల ఛాతీకి కెమెరాలను కట్టి శత్రు దేశాల గుట్టుమట్లను కనిపెట్టేందుకు వాటిని ప్రయోగించేది. పక్షి కంటే కూడా ఆ పక్షికి కట్టిన కెమెరా పెద్దదిగా ఉండేదని నేను రూఢిగా చెప్పగలను. ''రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాలు (జర్మనీని వ్యతిరేకించే బ్రిటన్, రష్యా, అమెరికా, చైనా మొదలైన దేశాలు) తమ మధ్య రహస్య సందేశాల బట్వాడాకు పక్షులను ఉపయోగించాయి.'' దీని వెనుక ఉండే కారణానికి పెద్ద వివరణేమీ అక్కర్లేదు. ''పావురాలు సాధారణ పక్షి జాతులు. కెమెరా కట్టి ఉన్న పావురాలైనా సరే, గూఢచారి పక్షుల్లా ప్రత్యేకంగా కాక, వేలాది ఇతర పక్షుల కార్యకలాపాల మధ్య దాగిపోయేవి'' అని అమెరికా గూఢచార సంస్థ సీఐఏ చెప్పడమే కాకుండా, అలాంటి ఒక రహస్య కెమెరాను సైతం వృద్ధి చేసింది. స్వయంగా సీఐఏనే ఈ విషయాన్ని వెల్లడించింది కనుక అది నిజమే అయి వుంటుంది.

అయితే 'ద పోస్ట్' సంప్రదించిన ప్రతి ఒక్కరూ కూడా ఈ విషయమై ఏకాభిప్రాయాన్నేమీ కలిగి లేరని తెలుస్తోంది. న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్, 'ద గ్లోబల్ పీజన్' పుస్తక రచయిత కొలిన్ జరోల్‌మాక్‌కు ఇందులో భారతదేశ అసంబద్ధ పరిస్థితే కనిపించింది. ఆ స్థితిని సరిగ్గా చెప్పాలంటే, 'చాలా హాస్యాస్పదం' అన్నారు. ''గూఢచర్యం కోసం చైనా అనేక అత్యాధునిక సాధనాలను కలిగి ఉందనీ, వాటిని విజయవంతంగా భారత్‌పై ప్రయోగిస్తుంది తప్పితే, రేసు పావురాలనైతే వదిలిపెట్టదు కదా'' అని కొలిన్ జరోల్‌మాక్ వ్యాఖ్యానించారు. కావొచ్చు!

నేను కిటికీ దగ్గర కూర్చొని, పావురాల 'గూ.. గూ' లను వింటున్నప్పుడు, అవి నాపై నిఘా పెట్టేందుకు రాలేదు కదా అని అనుకోకుండా అయితే ఉండలేకపోయాను. నేను ఏం చేస్తున్నానో మన ప్రియమైన ప్రభుత్వం ఈ విధంగానే తెలుసుకుంటుందా? పావురాలు తరచూ కిటికీ అంచులపైన కనిపించడానికి కారణం అవి తమ రెట్టలను అక్కడ వదిలి వేయడానికే అయుంటుందా అన్నది నేను కచ్చితంగా చెప్పలేను. అయితే వాటి చిన్నికళ్ల లోతుచూపులను బట్టి, అక్కడ అవి వదిలిన దాని కన్నా ఎక్కువగా తీసుకుని ఉంటాయా అని యోచిస్తాను.

కాబట్టి, ఈసారి ఒక పక్షి మీ తలపైన ఎగురుతూ ఉండటాన్ని, లేదా ఒక చెట్టు కొమ్మపై కూర్చొని కిందికి చూస్తూ ఉండటాన్ని మీరు గమనించినప్పుడు అది ఏదైనా ప్రయోజనం కోసం అక్కడికి వచ్చి వాలిందా అని ఆలోచించండి. బహుశా అంతదూరంలోని బీజింగ్ నుండి కాకపోయినా, దగ్గర్లోని 'సౌత్ బ్లాక్' (ప్రధానమంత్రి కార్యాలయం ఉండే చోటు) నుండి అది వచ్చి ఉండొచ్చు. అలాంటి పక్షులకు మేత మాత్రం వేయకండి. మనం వాటికి అందించే ఆహారపు తునకలు అవి తమ యజమానుల నుండి పొందే ప్రతిఫలాల ముందు పెద్ద విషయమేం కాదు.

చివరిగా, ఈ వ్యాసం పక్షులకు సంబంధించినదని మీరనుకుంటే కనుక మీరలా అనుకోవటం సరైనదే కావచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వరి మాత్రమే పండిస్తారు



కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పంజాబ్‌లో పంటల వైవిధ్యం తేగలదనే వాదనతో పూర్తిగా విభేదిస్తాను. వరికి బదులుగా ఇతర పంటలు వేసేలా ఎంఎస్‌పీ రైతులను పురిగొల్పుతుందని నిపుణులు చెబుతుంటారు. కానీ చిన్న తర్కం ఏమిటంటే, ఇతర పంటల కంటే వరి వల్ల వచ్చే రాబడి ఎక్కువ. అలాగే దిగుబడిలో వాతావరణ సమస్యల రిస్కు తక్కువ.

– అజయ్ వీర్ జాఖడ్, 'భారత్ కృషక్ సమాజ్' ఛైర్మన్

మ్యూజియం నోట్లు



పెద్దనోట్ల రద్దు కంటే కొన్ని నెలల ముందు, 2016లో, నేను ఒక డిబేట్ కాంపిటీషన్‌లో గెలుచుకున్న నోట్లు ఇప్పడే కనబడ్డాయి. సమయంలోగా వాటిని నేను మార్పించుకోలేదని మా అమ్మానాన్న నిరాశ చెందారు. 1,500 కా నుక్సాన్ హోగయా' (1,500 నష్టం కలిగింది).

– ఫాతిమా ఖాన్, జర్నలిస్ట్

త్వరగా చేసెయ్యాలి!



త్వరగా అల్పాహారం, రాత్రి భోజనాలు ముగించడం గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. గంటసేపు ముందుకు జరిగినకొద్దీ 6 శాతం రిస్క్ పెరుగుతుంది. రాత్రి భోజనం ఎనిమిది లోపల చేసేవారికన్నా, తొమ్మిది తర్వాత చేసేవాళ్లలో 28 శాతం రిస్క్ పెరుగుతుంది.

– పూజా గర్గ్, క్లినికల్ సైకాలజీ పరిశోధకురాలు

మాటల్లేవు...



ఇవ్వాళ నన్నో పిల్లాడు 'ఆంటీ' అన్నాడు. అక్కా అని పిలవమని చెప్పబోతుండగా వాడి అమ్మ వచ్చింది. ఆమె స్కూల్లో నాకు జూనియర్. చిన్న ప్రపంచం!

– అల్కా సింగ్, ఇంజినీర్

నో రిఫైన్డ్!



మీ వంటలకు వెజిటబుల్, రిఫైన్డ్ నూనెలకు బదులుగా నెయ్యి గానీ, కొబ్బరి నూనె గానీ వాడటం మంచిది. అవి లోపలి మంటను తగ్గించడంలో, చర్మ నాణ్యతను పెంచడంలో మంచి ఫలితం కనబరుస్తాయి. అన్ని రిఫైన్డ్ నూనెలకూ దూరంగా ఉండండి.

– ప్రమీలా ముంద్రా, న్యూట్రిషనిస్ట్

అదే మంచి అభిప్రాయం



ప్రతిదాని మీదా ప్రతి ఒక్కరికీ ఏదో అభిప్రాయం ఉండాలన్న ఆలోచనే దారుణమైన మూర్ఖత్వం. మనకు అర్థంకాని విషయాల మీద మనకు అభిప్రాయం లేకుండా ఉండటమే ఉత్తమం. ముఖ్యంగా, మనం వ్యవహరించాల్సిన వారి సంఖ్య పెరిగినకొద్దీ ఇది మరింత ముఖ్యం అవుతుంది.


– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

ఇన్ బాక్స్

ఓ దేశభక్తుని స్మృతి శకలాలు

కొందరు నిస్వార్థ సంఘసేవకులు, నిష్కళంక దేశభక్తులు, నిర్మల మనస్కులు తమ జీవితానుభవాల స్మృతి శకలాలు అక్షరబద్ధం చేస్తే, అవి ఆ వ్యక్తుల్ని చరిత్రలో చిరంజీవులుగా నిలబెడ్తాయి. యానాదుల, కొరవల (ఎరుకలవారు), నిమ్నవర్గాల చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన, దేశ స్వాతంత్ర్యం కోసమై పోరాడి, ఎన్నో ఇడుమల పాలైన వెన్నెలకంటి రాఘవయ్య జీవితంలోని కొన్ని జ్ఞాపకాలు 'పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య స్మృతి శకలాలు' పుస్తక రూపంగా వెలువడటం స్వాగతించాల్సిన సంగతి. ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పదిలపరిచి, డా॥ కాళిదాసు పురుషోత్తం సంపాదకత్వంలో వెలుగు చూసింది ఈ విలువైన పుస్తకం.

స్వాతంత్ర్య సమరయోధుడు వెన్నెలకంటి రాఘవయ్య (1897–1981) నెల్లూరి వార పత్రిక 'యూత్ కాంగ్రెస్'లో 1974 ఆగస్టు 22 నుంచి 1975 మార్చి 20 దాకా రాసిన జ్ఞాపక శకలాలివి. మొత్తం 25 వ్యాసాల సంకలనమిది. 81 పేజీల ఈ వ్యాసాలు నిక్కచ్చితనానికీ, సుస్పష్టమైన అభివ్యక్తికీ, జీవితానుభవ సంపన్నతకూ నిలువుటద్దాలు. నెల్లూరులో జన్మించిన మరో స్వాతంత్ర్య వీరుడు, సంఘసేవా పరాయణుడైన ఇస్కా చెంచయ్య సంక్షిప్త స్వీయ చరిత్ర ఈ అమూల్య పుస్తకంలో చోటు చేసుకోవడం ఉభయ తారకం.



వెన్నెలకంటి రాఘవయ్య తీవ్రవాద కాంగ్రెసు నాయకులైన లాల్, బాల్, పాల్‌ల సిద్ధాంతాలతో ప్రభావితుడైన తర్వాత వీర సావర్కార్, అరవింద ఘోషుల భావజాలంతో ఉత్తేజితులైన యువకిశోరుడు. మద్రాసులో 'లా' చదువుతూ కాంగ్రెసు కార్యకర్తగా జైలు పాలయ్యాడు. 1920–21 మధ్యలో రాఘవయ్య మనోవాక్కాయ కర్మల్లో అప్పటమైన గాంధీవాదిగా రాటుతేలాడు. బ్రిటిషు ప్రభుత్వం నేరస్థులుగా పరిగణించిన యానాది, కొరవ (ఎరుకల) జాతి వాళ్ల కోసం అవిశ్రాంత పోరాటం సాగించి చట్టబద్ధంగా వాళ్లను విముక్తుల్ని కావించిన కృపానిధి.

వెన్నెలకంటి వారి భగీరథ ప్రయత్నం వల్ల నెల్లూరు కలెక్టరు ఉడ్‌హౌస్, యానాదులకు 100 ఎకరాల భూమి మంజూరు చేస్తే నోరులేని యానాదులు దారి ఖర్చులకని తమ పొలిభూమిని ఎనిమిదణాల కొక ఎకరా చొప్పున హరిజనులకు అమ్మి తమతమ గూళ్లు చేరుకొన్నారట. రాఘవయ్య, ప్రకాశం పంతులు గారితో కలిసి 1931– 32 సంవత్సరాల మధ్య చెన్నపట్టణంలో వకీలు వృత్తి కొనసాగించారు. కాంగ్రెసు పార్టీ కార్యకర్తగా 'నెల్లూరు గాంధీ'గా పేరుగాంచారు. కాని రానురాను కాంగ్రెసు నాయకులు పదవుల కెక్కి ప్రజా సంక్షేమానికి కృషి చేయకపోగా ధనలక్ష్మికి దాసులవడం రాఘవయ్య గారిని కలవర పరిచింది. నిర్వేదానికి గురి చేసింది. సత్య, అహింసలకు నెలవైన కాంగ్రెస్ పార్టీ ఎలా నీరుకారి పోయిందో వెన్నెలకంటి వారి మాటల్లోనే విందాం –''తప్పత్రాగేవారు, ఖద్దరు మొహమే చూడని వారు, కల్లంగళ్ళు పాడించి, ఎక్కువ 'పాటలు' తెచ్చినందుకు పద్మశ్రీలను ఆశించేవారు, జైళ్ళను తొంగియైనా చూడని వారు ఉండే కాంగ్రెసు ఏ కాంగ్రెసో దేవుడికే ఎరుక!''

ఆయన నేరస్థ జాతులుగా ముద్రపడ్డ యానాదులకు, కొరవలకు, నిమ్న వర్గాలకు విముక్తి కలిగించి సంతృప్తులయ్యారు. వీరి సేవను గుర్తించి భారత ప్రభుత్వం వీరికి 1973లో పద్మభూషణ్ పురస్కారం ఇచ్చి కృతార్థమైంది. 1981 నవంబరు 24వ తేదీన రాఘవయ్య స్వర్గస్థులయ్యారు.

– ఘట్టమరాజు । సాహితీ విమర్శకులు

బహుముఖీన ప్రతిభాశాలి



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ప్రపంచ పరిణామాలను లేదా ఘటనలను దేవుళ్లకు సాగిలపడి మొక్కుకోవడం ద్వారా అర్థం చేసుకోడానికి ప్రయత్నించడం కన్నా హేతువాద దృష్టితో కార్యకారణ సంబంధాన్ని అనుసరించడం ద్వారా తెలుసుకోవచ్చు. ఈ రహస్యాన్ని దూరదృష్టి గల థేల్స్, అనాక్సిమాండర్ లాంటి ప్రాచీన గ్రీక్ తత్వవేత్తలు గ్రహించి వెల్లడించారు. అలాగే ప్రాచీన భారతీయ తాత్వికులూ గాలి, భూమి, అగ్ని, నీరు, ఆకాశం – అనే అయిదింటిని ప్రపంచ పరిణామాలకు మూలమని విశదీకరించారని 'ది గ్రేట్ సైంటిస్ట్' అన్న మహా గ్రంథంలో జాన్ ఫార్నండస్ నమోదు చేశాడు (2005). ఇందులో డార్విన్ ప్రాచీన పరిణామవాద సిద్ధాంత నిరూపణల నుంచి అత్యంత ఆధునిక శాస్త్రవేత్తలయిన రూజ్‌వెల్ట్, ఫ్రాంక్లిన్, స్టీఫెన్ హాకింగ్ నిరూపణల వరకూ నమోదై ఉన్నాయి. ఈ మహనీయులందరి కృషిని ఆకళింపు చేసుకుని ఆధునికంగా తాను ఆవిష్కరించిన నూతన శాస్త్రీయ దృక్కోణాల వరకు శాస్త్ర పరిశోధకులలో ఆధునికుడై అజ్ఞాతంగా ఉండిపోయినవారు డాక్టర్ ఏవీ రావు.

'నరసింహ శతకం'లో, ఒకరి విద్యా ప్రావీణ్యాన్ని జీర్ణించుకోలేని లేదా సహించలేని కొందరు ప్రబుద్ధుల్ని గురించి రాస్తూ శతకకర్త ఓ గొప్ప సత్యాన్ని బహిర్గతం చేశాడు. అలాంటి విద్వేషం చలామణీలో ఉన్నచోట ఎంతటి ప్రయోజకులైన విద్యావంతులు కూడా తమ ప్రతిభా సమున్నతిని చాటుకోవడం ఎంతో కష్టమని ఆ శతక కర్త చాటాడు. ఇటువంటి పరిస్థితులు ఉన్నా వైజ్ఞానిక శాస్త్ర సంబంధమైన పలు అంశాలపై విద్యార్థులకు, వయోధికులకు కూడా సుబోధకం చేయడానికి తన శాస్త్ర విజ్ఞానాన్ని పలు ముఖాలుగా విస్తరించారు డాక్టర్ ఆత్మూరి వెంకటేశ్వరరావు (ఏవీ రావు).

ఆయన హైదరాబాద్ చంద్ర రాజేశ్వరరావు వృద్ధాశ్రమంలో ఉంటూనే శాస్త్ర పరిశోధనలు బహుముఖాలుగా చేస్తూ పిన్నలనూ, పెద్దలనూ వైజ్ఞానికంగా ఉత్తేజపరచడానికి ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్త. వేదిక్ గణిత శాస్త్ర విషయాల నుంచి ఆధునిక పజిల్స్ పరిష్కారం వరకు డాక్టర్ రావు మేధ విస్తరించింది. ఆధునిక 'సుడోకు పజిల్స్'కు పలు తెలివైన పరిష్కారాలు ఆవిష్కరించిన

రెండో మాట



డా॥ ఆత్మూరి వెంకటేశ్వరరావు

ఆయన అంకెల గారడీకి 580 విజిల్ సాంగ్స్‌ను (ఈల పాటలు) విడమర్చి సుబోధకం చేసిన ఆచార్యుడు. అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు రిటైర్మెంట్ తరువాత పొందారు. కుటుంబ శాంతి–సౌఖ్యాలు మన చేతికీ, మనస్సుకూ అందుబాటులో ఉన్నవే కానీ, ఇతరులపై ఆధారపడే సుఖ సంతోషాలు కావని నిరూపిస్తూ రాసిన ప్రత్యేక థీసిస్‌కు అవార్డులు పొందారు. రూర్కేలా యూనివర్సిటీ ఇంజనీరింగ్ శాఖలో 'హైవోల్టేజ్' పరిశోధనా విభాగంలో పనిచేసే పీహెచ్‌డీ విద్యార్థులకు డాక్టర్ రావు టెక్నికల్ కన్సల్టెంట్. అలాగే ఇన్సులేషన్ టెక్నాలజీపై చికాగో (అమెరికా)లో జరిగిన అంతర్జాతీయ మహాసభలో అధ్యయన పత్రాన్ని సమర్పించడానికి ఏర్పాటైన ప్రత్యేక మహాసభ ఆమోదించిన ఏకైక భారతీయ పరిశోధనా పత్రం డాక్టర్ రావుదే కావడం విశేషం. ఇలా దాదాపు 18 రకాల పరిశోధనా కార్యక్రమాలలో డాక్టర్ రావు పాత్రకు గాను అనేక పురస్కారాలు లభించాయి.

వాడకంలో ఉన్న ప్రతి ఒక్క వస్తువూ శ్రమజీవి కాయకష్టం ఫలితమేనని మహనీయుడు కారల్ మార్క్స్ రాశాడు. మార్క్స్ 'పెట్టుబడి' పాఠాలకు ముందు వేల సంవత్సరాల క్రితం రోమ్ సామ్రాజ్య పాలకుడు డయోక్లిటన్ ప్రజా బాహుళ్యానికి అందుబాటులో ఉంచాల్సిన సరకులు మార్కెట్‌కు చేరకుండా సంపన్నులు తొక్కిపెడుతున్నందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాడు. సరకుల ఉత్పత్తి, పంపిణీలపై ప్రభుత్వానికి ఆధిపత్యం దఖలు పరిచాడు. 'ప్రజాబాహుళ్యం సమష్టి కష్టానికి తగిన ప్రతిఫలం సిద్ధించేదాకా వ్యక్తి స్వేచ్ఛను అదుపు చేయాల్సిందే'నని ప్రకటించాడు! అలాగే డాక్టర్ రావు సమాజం పట్ల ఆర్ద్రతతోపాటు కొన్ని నగ్న సత్యాలను నిర్మొహమాటంగా వెల్లడించారు. డాక్టర్ రావు దృష్టిలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థలో సరకుల ఉత్పత్తికి, వాటి వినియోగానికీ మధ్య సమతుల్యత అనేది సాధ్యపడదు. కనుకనే సమాజంలో సంక్షోభాలు అనివార్యమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన 'వైదిక గణితం' పరిశోధనా గ్రంథం త్వరలో వెలుగుచూడగలదని ఆశిద్దాం. ఎందుకంటే –


'కావ్య శాస్త్ర వినోదేన, కాలో గచ్ఛతి ధీమతాం / వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా' (కావ్య శాస్త్ర వినోదాలతో బుద్ధిమంతుల కాలం గడిచిపోతుంది. మూర్ఖులు వ్యసనాలతో, నిద్రతో, కలహాలతో కాలక్షేపం చేస్తారు).

abkprasad2006@yahoo.co.in

బ్రహ్మ జిజ్ఞాస

అనాది కాలం నుండి జిజ్ఞాసాపరుడైన మానవుడు సృష్టి రహస్యం తెలుసుకొనటానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. తాత్విక విషయాలు చర్చించే సందర్భంలో ఎదురయ్యే చిక్కుగానీ, చమత్కారంగానీ ఏమిటంటే, ఒక ప్రశ్నకు సమాధానం దొరికేటంతలో దానికి అనుబంధంగా రెండు ప్రశ్నలు తలెత్తడం. ఫలితంగా మౌలిక ప్రశ్నలకు సంబంధించిన అంతిమ సమాధానాల కొరకు జరిగే అన్వేషణ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నది.

'శ్వేతాశ్వతర' ఉపనిషత్తు, బ్రహ్మ జిజ్ఞాసాపరులు కొందరు చేసిన చర్చలో భాగంగా వారు వేసిన ప్రశ్నలతో ప్రారంభం అవుతుంది. ఈ విశ్వానికి మూల కారణం



ఏమిటి? మనం ఎందుకు జన్మించాము? ఎక్కడ నుండి వచ్చాము? జీవిత పరమార్థం ఏమిటి? మనిషి చనిపోయాక ఏమవుతాడు? ఎవని నియమానుసారం ఈ సుఖదుఃఖాల వ్యవస్థకు మనం లోబడి ఉంటున్నాము? ప్రపంచంలో దుఃఖం ఎందుకున్నది? ఇలా సాగుతుంది ఉపనిషత్తు.

యవ్వనంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొన్న శ్రీరాముడు కుల గురువు వసిష్ఠుల వారిని లోకంలో ఉన్న దుఃఖం గురించీ, జనన మరణాల గురించీ, అనిత్యతా స్వభావం గురించీ తెలియజెప్పమని అడుగుతాడు. రాముడి నోటి నుండి ఇలాంటి తాత్విక జిజ్ఞాసాపరమైన అభ్యర్థనను విని సంతోషించిన వసిష్ఠుడు రాముడికి ఉపదేశించిన ఆధ్యాత్మిక విషయ సంగ్రహమే 'యోగ వాసిష్ఠం'గా రూపుదిద్దుకొన్నది.

స్టీఫెన్ హాకింగ్ అనే సైంటిస్టు తన గ్రంథం 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' చివర్లో మనం ఒక విభ్రమం గొలిపే ప్రపంచంలో ఉన్నామని అంటాడు. అంతేకాదు ఈ విశ్వం స్వభావం గానీ, లక్షణం గానీ ఏమిటి? అందులో మన స్థానం ఏమిటి? ఈ విశ్వం, అందులో ఉన్న మనం ఎలా, ఎక్కడ నుండి ఆవిర్భవించాము? ఈ విశ్వం ఉన్న తీరు, అలాగే ఎందుకు ఉన్నది? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు తెలిస్తే, అంతకు మించిన జయం మానవాళికి లేదని చెబుతూ తన గ్రంథాన్ని ముగిస్తాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.దశమి ప.11.57 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: మృగశిర ప.1.36 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.10.16 నుండి 11.52 వరకు, దుర్ముహూర్తం: ప.12.37 నుండి 1.25 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, అమృతఘడియలు: తె.4.02 నుండి 5.41 వరకు (తెల్లవారితే మంగళవారం); రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.29, సూర్యాస్తమయం: 5.56.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీదే గెలుపు
సినీనటుడు సుమన్


గంగమ్మ సన్నిధిలో నటుడు సుమన్

తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): సామాజిక న్యాయపాలనకు ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ గెలుస్తుందని ప్రముఖ నటుడు సుమన్ స్పష్టం చేశారు. తన వీరా భిమాని బుజ్జమ్మ కుమార్తె వివాహం కోసం తిరుపతికి వచ్చిన ఆయన ఆదివారం తిరుపతి గ్రామదేవత శ్రీ తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం సుమన్‌ను ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థ, ప్రసాదాలు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగమ్మ తల్లిని దర్శించు కోవడం సంతోషం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా, లేక ఏ పార్టీకైనా మద్దతు పలు కుతారా అని మీడియా ప్రశ్నించగా రాజకీయ పరంగా పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు సీనియర్ సిటిజన్స్‌కు ప్రాధాన్యత కల్పిస్తూ మేనిఫెస్టో అందించే పార్టీకి తన సంపూర్ణ సహ కారం ఉంటుందని సుమన్ చెప్పారు. రాజ కీయం అంటే పదవులు చేపట్టడం కాదని, ప్రజల సంక్షేమం దిశగా ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజాదరణ పొందినప్పుడే ప్రజా నాయకులు అవుతారని, ఎంత కష్టమైనా ఇచ్చి న హామీలు నెరవేర్చి ప్రజల కోసం శ్రమించే వారికే పట్టం కడతారని పేర్కొన్నారు.

శ్రీ శారదాపీఠంలో సుబ్రహ్మణ్య ఆరాధన
నేడు పూర్ణాహుతితో ముగియనున్న పీఠం వార్షిక మహోత్సవాలు


పీఠంలో పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్త రాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీ జీలు పీఠం అనుష్టదైవం అయిన వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠ ప్రాంగణంలో వారాహి ప్రత్యంగిరా దేవి సహిత నర్తనకాళి అవతారంలో రాజశ్యామల అమ్మవారు దర్శనమిచ్చారు. దక్షిణామూర్తి, వనదుర్గ, దాసాంజనేయస్వామి, షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి, కాలభైరవ స్వామి ఆలయాల్లో స్వామీజీలు ప్రత్యేక పూజలు చేశారు. 5 రోజుల పాటు సాగిన పీఠం వార్షికోత్సవాలు మహారుద్ర సహిత రాజశ్యామల యాగం పూర్ణాహుతితో నేటి (19వ తేదీ)తో ముగియనున్నాయి.

సీబీఐ వలలో తిరుపతి రైల్వే ఉద్యోగులు


రామమోహన్‌రావు

తిరుపతి (అలిపిరి): తిరుపతి రైల్వేస్టేష న్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటుం డగా సీబీఐ అధి కారులు శనివారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే తిరుపతిలోని రైల్వే కోచ్‌లకు 750 వోల్టు విద్యుత్ సరఫరా చేసేందుకు మైసూరుకు చెందిన కోర్–4 ఇంజ నీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.2.56 కోట్లకు టెండరు దక్కించుకుంది. వివిధ పనుల నిమిత్తం సంస్థ ప్రతినిధులు బిల్లులు సమర్పిం చగా, వాటి చెల్లింపుల కోసం ఎస్‌ఏఈ రామ మోహనరావు రూ.40వేలు, ఏడీఈఈ అప్ప లరాజు రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సంస్థ ప్రతినిధులు సీబీఐ అధికారు లను ఆశ్రయించగా, శనివారం లంచం తీసుకు నే సమయంలో వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. అనంతరం కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా మార్చి 1వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

తిరుపతి మీదుగా అయోధ్యకు రైలు



తిరుపతి (అలిపిరి): తిరుపతి నుంచి అయో ధ్యకు వెళ్లేవారికి రైలు అందుబాటులోకి వచ్చిం ది. విజయవాడలో ఆదివారం ఉదయం 11 గంటలకు తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆస్తా ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.25 గంటలకు తిరుపతికి చేరుకుంది. విజయవాడ నుంచి నెల్లూరు, తిరుపతి, ఎర్రగుంట్ల, కర్నూలు, కాచిగూడ, గోండియా జంక్షన్, జబల్‌పూర్, ప్రయాగ్‌రాజ్ మీదుగా మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆస్తా ఎక్స్‌ప్రెస్ అయోధ్యకు చేరుకోనుంది. ఈ నేపథ్యంలో తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో అధికారులు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అయోధ్యకు వెళ్లే ప్రయాణికు లకు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ‘మిలాన్’ మెరుపులు

విశాఖ వేదికగా ప్రతిష్టాత్మక అంతర్జాతీయ నేవీ యుద్ధ విన్యాసాలకు సర్వం సిద్ధం

- రెండోసారి ఆతిథ్యమిస్తున్న తూర్పు నౌకాదళం
- పాల్గొననున్న 50కి పైగా దేశాలు
- ఇప్పటికే విశాఖకు చేరుకున్న యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు
- 22న సిటీ పరేడ్‌కు హాజరుకానున్న ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


జపాన్ యుద్ధ నౌక జేఎస్ సజ్‌నామీకి స్వాగతం పలుకుతున్న భారత నౌకాదళ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ విన్యాసా లకు వేదికగా నిలిచేందుకు విశాఖ మహానగరం సిద్ధ మైంది. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలా న్–2022ని వరుసగా నిర్వహించి ప్రపంచ దేశాలకు సత్తాచాటిన విశాఖ మహా నగరం... తాజాగా ప్రతి ష్టాత్మక మిలాన్–2024 విన్యాసాలకు ఆతిథ్యం ఇవ్వ నుంది. సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు జరిగే మిలాన్ విన్యాసాల్లో 50కి పైగా దేశాలు పాల్గొననున్నాయి. మిలాన్ విన్యాసాల్లో కీలకమైన సిటీ పరేడ్‌ను ఈ నెల 22వ తేదీన ఆర్కే బీచ్‌లో నిర్వ హించనున్నారు. ఈ పరేడ్‌కు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. మిలాన్–2024 విన్యాసాలను ‘కమరడెరీ(స్నేహం)–కొహెషన్ (ఐక్యత)–కొలాబ రేషన్(సహకారం)’ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

ఇప్పటి వరకు 11 ‘మిలాన్’లు..

వివిధ దేశాల మధ్య సహృద్భావ వాతావరణం, స్నేహ పూర్వక సత్సంబంధాలను మెరుగుపరుచు కోవడంతోపాటు శత్రు సైన్యాలకు తమ బలం, బలగం గురించి తెలియజేసేందుకు ‘మిలాన్’ పేరుతో 1955 నుంచి విన్యాసాలు నిర్వహిస్తు న్నారు. తొలిసారి జరిగిన విన్యాసాల్లో భారత్, ఇం డొనేషియా, సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలు మాత్రమే పాల్గొన్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ‘మిలాన్’లో ఏటా దేశాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2005లో సునామీ రావడం వల్ల మిలాన్ విన్యాసాలు రద్దు చేయగా.. 2001, 2016 సంవత్సరాల్లో ఇం టర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలు నిర్వహిం చడం వల్ల ఈ విన్యాసాలు జరగలేదు. ఈ విన్యాసాల్లో 2010 వరకు 8 దేశాలు మాత్రమే పాల్గొనగా.. 2012లో అనూహ్యంగా 16 దేశాలు పాల్గొన్నాయి. 2022లో విశాఖలో నిర్వహించిన విన్యాసాల్లో 35 దేశాలు పాల్గొనగా, 2023లో అండ మాన్‌లో జరిగిన విన్యాసాల్లో 30 దేశాలు పాల్గొన్నాయి. ఈసారి ఏకంగా 50కి పైగా దేశాలు పాల్గొంటున్నాయి.

సాగర తీరంలో వివిధ దేశాల నౌకాదళాల సందడి

భారత నౌకాదళ ఆహ్వానం మేరకు మిలా న్–2024లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల నౌకాదళాలతో విశాఖ సాగర జలాలు కిటకిటలాడుతున్నాయి. భారత్‌తో పాటు యూఎస్ఏ, రష్యా, జపాన్, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, ఫ్రాన్స్, ఈజిప్ట్, శ్రీలంక, వియ త్నాం, మొజాంబిక్, సూడాన్, ఇజ్రాయిల్, ఖతర్, థాయ్‌లాండ్, మలేషియా, సోమాలియా, కెన్యా, మయ న్మార్, న్యూజిలాండ్, టాంజానియా, కొమరోస్, మాల్దీవులు, బ్రూనే, ఫిలిప్పీన్స్, సౌదీ అరేబియా, ఒమన్, కాంబోడియా, దక్షిణ కొరియా, కువైట్, ఇరాన్, మడగాస్కర్, బంగ్లాదేశ్, బహ్రెయిన్, యూఏఈ, జిబౌటీ, ఎరిత్రియా, మారిషస్, సీషెల్స్, ఫిజీ, టోంగా, టోగో, పెరూ తదితర 50దేశాలకు చెందిన యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్‌లు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు విశాఖ చేరుకుం టున్నాయి. ఈ చరిత్రాత్మకమైన ఈవెంట్‌ను విజయ వంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశాఖ నగర ప్రజలకు తూర్పు నౌకాదళాధికారులు విజ్ఞప్తి చేశారు.

మిలాన్-2024 కార్యక్రమాలు ఇలా...

- మొదటగా ఈ నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలు నిర్వహిస్తారు.
- 19న తొలి రోజు ప్రీ సెయిల్ డిస్కషన్స్, టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ బ్రీఫింగ్స్, అతి థులకు ఐస్ బ్రేకర్ డిన్నర్ ఉంటాయి.
- 20న హెల్త్ ట్రెక్, ఆగ్రా, తాజ్‌మహల్ సందర్శన, యంగ్ ఆఫీసర్ల ఆత్మీయ కల యిక ఉంటాయి. ఆర్కే బీచ్‌లో సిటీ పరేడ్ రిహార్సల్స్ నిర్వహిస్తారు.
- 21న క్రీడాపోటీలు, మేరీటైమ్ టెక్నికల్ ఎక్స్‌పో–2024 ప్రారంభోత్సవం, భారత యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ విజిట్, ద్వైపాక్షిక విన్యాసాలు, వివిధ దేశాల ప్రతినిధుల సిటీ టూర్, మిలాన్ విన్యాసాలు ప్రారంభోత్సవం, మిలాన్ విలేజ్ ప్రారంభ కార్యక్రమాలు ఉంటాయి.
- 22న అంతర్జాతీయ మేరీటైమ్ సెమినార్ ప్రారంభం, ప్రీసెయిల్ డిస్కషన్స్, సిటీ టూర్, ఆర్కే బీచ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ నిర్వహించనున్నారు.
- 23న బుద్ధగయ పర్యటన, సిటీ టూర్‌తో హార్బర్ ఫేజ్ విన్యాసాలు ముగుస్తాయి.
- 24 నుంచి 27 వరకు వివిధ దేశాలకు చెం దిన యుద్ధ నౌకలు, హెలికాప్టర్లు, ఎయి ర్‌క్రాఫ్ట్‌లు, సబ్‌మెరైన్స్‌తో సీఫేజ్ విన్యా సాలు నిర్వహిస్తారు.
- 28న వివిధ దేశాల యుద్ధ నౌకల నిష్క్రమణ
- ఈసారి విన్యాసాల్లో భారత నౌకాదళానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ షిప్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమా దిత్య ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సామాజిక న్యాయానికి ఏపీ రోల్‌మోడల్
వైఎస్సార్ సీపీ యూకే కోర్ కమిటీ సభ్యులు భూమిరెడ్డి కార్తీక్


కేక్ కటింగ్‌లో పాల్గొన్న యూకే కోర్ కమిటీ

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలనను అందించారని వైఎస్సార్ సీపీ యూకే కోర్ కమిటీ సభ్యులు భూమిరెడ్డి కార్తీక్ అన్నారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ–అభి వృద్ధి ఫలాలు అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ విభాగ యూకే కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం లండన్‌లో వ్యూహం సినిమా రిలీజ్ సం దర్భంగా లండన్ ఈస్‌హ్యామ్‌లోని హైదరాబాద్ బావాచీ హోటల్ మినీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ అభిమానుల సమావేశం జరిగింది. అనంత పురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన ‘సిద్ధం’వి జయవంతం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. భూమిరెడ్డి కార్తీక్ మాట్లాడుతూ..2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు యూకే కోర్ కమిటీ ఏపీకి వచ్చి కృషి చేస్తుందని చెప్పారు. సామాజిక న్యాయానికి ఏపీని రోల్‌మోడ ల్‌గా సీఎం జగన్ మార్చారని కొనియాడారు. నార్త్ అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పం డుగాయల రత్నాకర్, వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా జూమ్ కాన్ఫరెన్స్‌లో హాజరై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రవాసాంధ్రులు క్రాంతిపాలెం, పాతకోట ఓబుల్ రెడ్డి, మలిరెడ్డి కిశోర్ రెడ్డి , గాండ్ల వెంకటసాయి, దేవరపల్లి చాళుక్య రెడ్డి, గుంతా వెంకట, పుటికరెడ్డి ఆదిత్య రెడ్డి, అక్కిదాస్ ఆనంద్, మణిదీప్, విశ్వేశ్వర్ రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, బొడ్డు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై చంద్రబాబు అంతులేని నిర్లక్ష్యం

- ప్రజలను బస్సుల్లో తీసుకువెళ్లి మరీ భజనలు చేయించారు
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబా బు హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అంతులేని నిర్లక్ష్యం నెలకొందని మాజీ ఎంపీ ఉండ వల్లి అరుణ్ కుమార్ అన్నారు. ప్రజలను బస్సుల్లో తీసుకు వెళ్లి మరీ భజనలు చేయించడం పైనే చం ద్రబాబు దృష్టి పెట్టారు తప్ప.. చేసిందేమీ లేదని విమర్శించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు 70:30 నిష్పత్తిలో నిర్మించాల్సి ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొంది, నేటికి పదేళ్లు పూర్తయిందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన వ్యవహారం పూర్తిగా అప్రజా స్వామికమన్నారు. బిల్లు ఆమోదం విషయంలో లోక్‌సభ ప్రచురించిన డాక్యుమెంట్ ఆధారంగా తాను కోర్టును ఆశ్రయించానని చెప్పారు. బిల్లు ఆమోదం తప్పని తనకు మద్దతుగా సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిందని అన్నారు. ఏపీకి పదేళ్లు ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పటి మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రకటించిం దని గుర్తుచేశారు. 2015 డిసెంబర్ నాటికి నీతిఆయోగ్ తయారు చేసిన నివేదిక ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు రామ చంద్రరావు కోరినప్పటికీ కేంద్రం నిరాకరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.17 వేల కోట్లు అడిగితే రూ. 4 వేల కోట్లు తగ్గించి ఇచ్చిందని, ట్యాక్స్ ఇన్‌సెంటివ్‌లు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలం గాణ రాష్ట్రాలు 89 ఆస్తులను 58:42 నిష్పత్తిలో పం చుకోవాల్సిందిగా తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టారని, దీనిపై ఇంతవరకూ ఎటువంటి సమాధానమూ ఇవ్వలేదని అన్నారు. కొట్టుకు చావండని రాష్ట్రా లను కేంద్ర ప్రభుత్వం వదిలేసిందని దుయ్యబ ట్టారు. ఏ ఇన్‌స్టిట్యూట్ కట్టాలన్నా కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదన్నారు. తెలంగాణ, ఆంధ్రా మధ్య తేలాల్సిన ఆస్తుల విలువ రూ. 1.46 లక్షల కోట్లు ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విభజన రాజ్యాంగబద్ధమా, కాదా అనే విషయంపై పార్లమెంటులో చర్చ జరగాలన్నారు. రాష్ట్ర పునర్విభజనపై సుప్రీంకోర్టులో వేసిన కేసును అడ్వాన్స్ చేయిస్తే కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా అఫిడవిట్ ఫైల్ చేయాల్సి ఉంటుందని ఉండవల్లి చెప్పారు.

రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేసిన చంద్రబాబు


రిలే నిరాహార దీక్షలో పాల్గొని నిరసన తెలియజేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,239వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తాడికొండ: అమరావతి పేరుతో అన్ని ప్రాంతాల అభివృద్ధిని పక్కనపెట్టి రాష్ట్ర భవిష్యత్తును చంద్ర బాబు అంధకారమయం చేశారని బహుజన పరిర క్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జం క్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,239వ రోజుకు చేరాయి. పలు వురు నాయకులు మాట్లాడుతూ ఒకే సామాజిక వర్గం, ఒకే ప్రాంతం, కొంతమంది వ్యక్తుల పెట్టు బడులకు నిలయంగా అమరావతి మారిందన్నారు. అటువంటి అమరావతిని అభివృద్ధి చేస్తే రూ.కో ట్లకు పడగలెత్తి కుబేరులయ్యేది చంద్రబాబు, ఆయన బినామీలే తప్ప ప్రజలకు ఏం ప్రయోజనం ఉందో టీడీపీ వారు చెప్పాలన్నారు. కులవాదమే అజెండాగా రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్న ఓ సామాజికవర్గం తరతరాలు రాష్ట్రంపై తామే ఆధి పత్యం చెలాయించాలని తపనపడుతోందని, ఆ వర్గానికి ప్రజల ప్రయోజనాలు ఎప్పటికీ పట్టవ న్నారు. మళ్లీ ఇప్పుడు అమరావతి పేరుతో దొంగ నాటకాలు మొదలు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెద్దింటి విజ య్, కొమరవల్లి కిషోర్‌బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర సామ్యేలు, కారుమూరు పుష్ప రాజు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి, పలు వురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అక్కినేని నట జీవితం స్ఫూర్తిదాయకం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి
- సినీ నటుడు మురళీమోహన్‌కు అక్కినేని స్మారక జాతీయ పురస్కారం ప్రదానం


మురళీమోహన్‌కు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శేషసాయి

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నట జీవితం స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్‌లో ఆది వారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్‌కు అక్కినేని నాగేశ్వరరావు స్మారక జాతీయ పుర స్కారం ప్రదానం కార్యక్రమం జరిగింది. జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ.. తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగంగా భావించొచ్చ న్నారు. ఆయన బహుముఖ ప్రతిభాశాలి అని, ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడని పేర్కొన్నారు. అలాగే సినీ నటుడు మురళీమోహన్ చలన చిత్ర రంగంలో అందరినీ మెప్పించిన వ్యక్తి అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విలువలతో కూడిన జీవితం అక్కినేని వద్దనే నేర్చుకున్నానని చెప్పారు. సినీ క్రిటిక్ సం జయ్ కిషోర్ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరా బాద్ రావడానికి ఆయన ముఖ్య కారకులన్నారు. పురస్కారం అందుకున్న మురళీమోహన్ మాట్లాడుతూ అక్కినేని వద్ద క్రమ శిక్షణ నేర్చుకున్నానన్నారు.

మల్లేశ్వరాలయంలో ఘనంగా కుంభాభిషేకం

- శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ, కలశస్థాపన
- పూర్ణాహుతితో ముగిసిన కార్యక్రమాలు


ధ్వజస్తంభ ప్రతిష్టలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయ వాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వరాలయం లో కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఇటీవల శ్రీదుర్గామల్లేశ్వ రస్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి)లో మల్లే శ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం జరిగింది. ఆలయ పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి ధ్వజస్తంభ, కలశస్థా పన, కుంభాభిషేక మహోత్సవాలను దేవ స్థానం నిర్వహిస్తోంది. ఐదో రోజైన ఆదివారం ఉదయం పుణ్యాహవాచనం, యంత్రస్థాపన, విగ్రహ స్థాపన, కళాన్యాసం, కళాహోమాలను నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట, స్వర్ణశిఖర కుంభాభిషేకం పూజలకు దేవ దాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబా బు, ఈవో కేఎస్ రామారావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు ధ్వజస్తంభ, కలశస్థాపన, కుంభాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. స్వామి వారికి కళాపకర్షణ నిర్వహించిన అనంతరం సముద్ర, జీవ నదులు, తీర్థాల నుంచి సేకరించిన పుణ్యజలాలతో స్వామికి అభిషేకాలు, కుంభాభిషేకం జరిపారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిం చారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు శాంతి కల్యాణం, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు.

రోశయ్య ఆశయాల సాధనకు కృషి చేద్దాం

- మాజీ మంత్రి బాలినేని
- ఒంగోలులో మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ


రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని

ఒంగోలు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఒంగో లులోని శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఎదు రుగా సొంత ఖర్చులతో కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన నిర్మించారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ విగ్రహాన్ని బాలినేని శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్యతో తనకు ఉన్న అను బంధం మరువలేనిదన్నారు. ఆయనలేని అసెంబ్లీని ఊహించలేకపోతున్నామని చెప్పా రు. నాడు చమత్కారంతో ప్రతిపక్షాలకు సమా ధానం చెబుతూ యువ శాసనసభ్యులకు రోశ య్య స్ఫూర్తిగా నిలిచేవారని కొనియాడారు. బియ్యపురెడ్డి అనే పేరు ఉన్న జనార్దన్‌రెడ్డిని అనుకరిస్తూ.. శాసనసభలో ఆయన పెద్దపె ద్దగా మాట్లాడితే చెయ్యి కట్ చేస్తానంటూ హెచ్చరించిన దమ్మున్న ధైర్యశాలి రోశయ్య అని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన ఉం టే అప్పుడే సభ అయిపోయిందా అని అనిపిం చేదన్నారు. రోశయ్య తనకు పితృసమానులు అని తెలిపారు. ఆయన ప్రభుత్వంలో తాను గనుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు గాలి జనా ర్దన్‌రెడ్డికి మైన్స్ అనుమతులు ఇవ్వవద్దని సీఎంను కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించింద న్నారు. అయితే మంత్రిగా ఉన్న తనకు తెలియ కుండా అధికారులు అనుమతులు ఇచ్చార న్నారు. దీనిపై కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్ అయితే రోశయ్య స్వయంగా హైకమాండ్‌తో మాట్లాడి తనకు సమస్య లేకుండా చేశారని గుర్తు చేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీని వాసులురెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబా నికి, రోశయ్యకు మధ్య ఉన్న బంధాన్ని నెమరు వేసుకున్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందాలని ఆయన బాగా ఆకాంక్షించేవార న్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో ఆర్యవైశ్యులకు ఎటువంటి పథకాలు అం దలేదని తెలిపారు. నేడు ప్రభుత్వం ప్రతి పథ కంలోనూ భాగస్వాములను చేస్తోందన్నారు. రాష్ట్రంలో 42 వేల కుటుంబాలు ఐదేళ్లుగా పథ కాలను అందుకుంటున్నాయని చెప్పారు.

సీఏఎఫ్ కమాండర్‌ను పొట్టనబెట్టుకున్న మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో మావోయిస్టులు సాయుధ బలగాల కమాండర్‌ను దారుణంగా చంపారు. కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దర్బా గ్రామంలో ఆదివారం జరిగే సంతకు ఛత్తీస్‌గఢ్ సాయుధ బలగాల 4వ బెటాలియన్ జవాన్లు బందోబస్తుగా ఉన్నారు. ఉదయం 9.30 గంటల సమయంలో గ్రామీణుల వేషధారణలో వచ్చిన మావోయిస్టులు ఏమరుపాటుగా ఉన్న కమాండర్ తేజో రాం బౌర్యా తలపై గొడ్డలితో వేటు వేశారు. దీంతో, ఆయన అక్కడికక్కడే కుప్పకూలి, ప్రాణాలొదిలారు. ఆ వెంటనే మావోయిస్టులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న బలగాలు మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు.

ఉపేంద్ర కుష్వాహా కొత్త పార్టీ

పట్నా: జేడీయూ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌తో తెగదెంపులు చేసుకున్న కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా 'రాష్ట్రీయ లోక్ మంచ్'పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. తన పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు కూడా లభించిందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురి దుర్మరణం

బర్న్స్‌విల్లె: అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు చనిపోయారు. మిన్నెపొలిస్ శివారులోని ఓ ఇంట్లో గృహహింస జరుగుతోందంటూ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు అందింది. అక్కడికి వెళ్లిన బర్న్స్‌విల్లె పోలీసులపై కాల్పులు జరిగాయి. ఘటనలో ఇద్దరు పోలీసులతోపాటు ఒక కార్యకర్త ప్రాణాలు కోల్పోయారు.

పీఎంఎల్-పీపీపీ పొత్తు నేడు ఖరారయ్యే అవకాశం

ఇస్లామాబాద్: సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ మధ్య సయోధ్య కుదరలేదు. చర్చల్లో కీలక పురోగతి సాధించామని చెబుతున్నా సందిగ్ధం వీడలేదు. సోమవారం తుది విడత భేటీలో అధికార పంపిణీ ఫార్ములా ఖరారు చేయాలని ఇరువర్గాలు నిర్ణయించాయి. ప్రధానిగా షెహబాజ్ షరీఫ్‌ను పీఎంఎల్-ఎన్ నామినేట్ చేయడం తెలిసిందే. నేషనల్ అసెంబ్లీలో 265 స్థానాలకు ఈ నెల 8వ తేదీన జరిగిన ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీ చేసిన ఇమ్రాన్ ఖాన్ పార్టీ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అభ్యర్థులు 93 సీట్లు, పీఎంఎల్-ఎన్ 75, పీపీపీ 54 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుకు కనీసం 133 మంది అభ్యర్థుల మద్దతు అవసరం.

చేజారిన తోడే.. బొడ్డుతాడై...

యుద్ధంలో వేలాదిగా బలవుతున్న ఉక్రెయిన్ జవాన్లు

వారి వీర్యం/అండంతో పిల్లల్ని కంటున్న భాగస్వాములు

ఉక్రెయిన్. ఒకప్పటి అందాల దేశం. ఇప్పుడు రష్యా రక్త దాహానికి బలైన శిథిల చిత్రం. యుద్ధం మిగిల్చే బీభత్సానికి సాక్షి. పోరులో ప్రాణాలొదిలిన వేలాది మంది ఉక్రెయిన్ యువ సైనికుల జీవిత భాగస్వాములది మాటలకందని దైన్యం. వారిలోనూ అసలు సంతానమే లేనివారిదైతే చెప్పనలవి కాని వ్యథ. ఎవరి కోసం బతకాలో తెలియని నైరాశ్యం. అయితే తమ జీవిత భాగస్వాములు ముందుజాగ్రత్తగా భద్రపరిచి వెళ్లిన వీర్యం/అండాలు వారిలో కొత్త ఆశలు నింపుతున్నాయి. వాటి సాయంతో బిడ్డలను కంటున్నారు. తమను శాశ్వతంగా వీడి వెళ్లిన తోడు తాలూకు నీడను వారిలో చూసుకుంటున్నారు. భవిష్యత్తుపై ఆశలు పెంచుకుంటున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్




మన పాప నవ్వుల సాక్షిగా... నువ్వెప్పటికీ నాతోనే...

మనసుతో చూడగలిగితే లక్ష భావాలను, కోటి ఊసులను కళ్లకు కట్టే ఫొటో ఇది. ఇందులో నేపథ్యంలోని పోస్టర్లో కనిపిస్తున్నది రష్యాతో పోరులో మరణించిన ఉక్రెయిన్ సైనికుడు విటాలీ. బుల్లి పాపాయిని ఎత్తుకున్నది అతని భార్య విటాలినా. భర్త మరణానంతరం ఆయన వీర్యంతో గర్భం దాల్చి ఈ పండంటి పాపాయికి జన్మనిచ్చిందామె. కూతురిని భర్త ఫొటోకు చూపిస్తూ ఇలా భావోద్వేగానికి గురైంది. రష్యాతో యుద్ధం మొదలయ్యే కొద్ది నెలల ముందే విటాలీ ఉక్రెయిన్ సైన్యంలో చేరాడు. ఫ్రంట్ లైన్‌లో పోరాడుతూ యుద్ధం మొదలైన తొలి నాళ్లలోనే మరణించాడు. అప్పటికే విటాలినా 13 వారాల గర్భవతి. కానీ ఆ గర్భం నిలవలేదు. భర్త క్షేమం తాలూకు ఆందోళనే అందుకు ప్రధాన కారణమని ఇప్పటికీ కన్నీళ్లపర్యంతం అవుతుంటుంది విటాలినా. ''అటు జీవితాంతం తోడుండాల్సిన భర్తను, ఇటు ఇంకా లోకమే చూడని మా కలల పంటను కొద్ది రోజుల తేడాతో శాశ్వతంగా కోల్పోయా. బతుకంతా ఒక్కసారిగా శూన్యంగా తోచింది'' అంటూ అప్పటి రోజులను గుర్తు చేసుకుందామె. ''ఇలాంటి పరిస్థితిని ఊహించే నా భర్త వీర్యాన్ని భద్రపరిచి వెళ్లాడు. దాని సాయంతో తల్లిని కావాలని నిర్ణయించుకున్నా. అలా ఈ చిట్టి తల్లి ఈ లోకంలోకి అడుగు పెట్టింది. తన రాకతో నాకు నిజంగా సాంత్వన చేకూరింది. పాప వాళ్ల నాన్న పోలికలనే గాక హావభావాలను కూడా ముమ్మూర్తులా పుణికి పుచ్చుకుంది. దైవ కృప అంటే బహుశా ఇదేనేమో. నిజానికి గంపెడు సంతానాన్ని కనాలని, మాది పెద్ద కుటుంబం కావాలని పెళ్లికి ముందు నుంచీ ఎన్నెన్నో కలలు కన్నాం. కానీ విధి రాత మరోలా ఉంది. అయినా తను ముందుచూపుతో తీసుకున్న నిర్ణయం ఈ చిట్టితల్లి రూపంలో ఇలా ఫలించింది'' అంటుంటే విని చెమర్చని కళ్లు లేవు. కాస్త అటూ ఇటుగా ఉక్రెయిన్ సైనిక వితంతువులందరి గాథ ఇది...!

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలై రెండేళ్లవుతోంది. 2022 ఫిబ్రవరి 24న ఆ దేశంపై రష్యా సైన్యం హఠాత్తుగా విరుచుకుపడింది. రోజుల్లో తల వంచుతుందనుకున్న ఉక్రెయిన్ దీటుగా పోరాడుతోంది. దాంతో రెండేళ్లయినా పోరు కొనసాగుతూనే ఉంది. యుద్ధమంటేనే ప్రాణనష్టం! ఇప్పటిదాకా ఏకంగా 70,000 మంది ఉక్రెయిన్ జవాన్లు మరణించినట్లు అంచనా. మరో లక్షన్నర మందికి పైగా క్షతగాత్రులుగా మారారు. యుద్ధంలో జవాను వీరమరణం పొందితే అతడి/ఆమె వంశం అంతమైపోవాల్సిందేనా? బతికుండగానే అండాలు, వీర్యం భద్రపర్చుకొని, తాము లేకపోయినా జీవిత భాగస్వామి ద్వారా సంతానం పొందే వెసులుబాటును ఎందుకు ఉపయోగించుకోవద్దు? ఇలాంటి ప్రశ్నలు ఉక్రెయిన్ సైన్యం నుంచి గట్టిగా వినిపించాయి. దీనిపై ప్రభుత్వమూ సానుకూలంగా స్పందించింది. పార్లమెంటులో ఇటీవలే ఒక బిల్లును ఆమోదించింది. అధ్యక్షుడు వొలిదిమిర్ జెలెన్‌స్కీ సంతకం చేస్తే చట్టంగా మారనుంది. ఇదొక విప్లవాత్మక చట్టం కానుందని నిపుణులు ప్రశంసిస్తున్నారు. యుద్ధంలో మరణించినవారి వీర్యం/అండాలతో సంతానం పొందే అవకాశం ఇప్పటిదాకా ఉక్రెయిన్‌లో చట్టపరంగా లేదు. ఇక ఈ పరిస్థితి మారనుంది...

- ఉక్రెయిన్ పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లు ప్రకారం జవాన్లు తమ వీర్యం, అండాలు భద్రపర్చుకోవచ్చు. వారు యుద్ధంలో అమరులైతే వాటి సాయంతో జీవిత భాగస్వాములు సంతానం పొందవచ్చు.
- ఇందుకు వీలుగా యుద్ధంలో మృతి చెందిన జవాన్ల వీర్యం/అండాలను మూడేళ్లపాటు భద్రపరుస్తారు. ఇందుకు ప్రభుత్వమే ఆర్థిక సాయం అందిస్తుంది.
- యుద్ధంలో క్షతగాత్రులై, ఆరోగ్యం దెబ్బతిని సంతానోత్పత్తికి, బిడ్డలకు జన్మనిచ్చే సామర్థ్యానికి దూరమైన సైనికులు కూడా వీర్యం/అండాలను భద్రపర్చుకుని సంతానం పొందవచ్చు.
- ఇలా భద్రపర్చిన వీర్యం/అండాలతో పుట్టే పిల్లలకు చట్టబద్ధంగా అన్ని హక్కులూ ఉంటాయి. అమర వీరులైన తల్లి/తండ్రి పేరును వారి బర్త్ సర్టిఫికెట్‌లో ముద్రిస్తారు!
- ఈ కొత్త చట్టాన్ని అంతా స్వాగతిస్తున్నారు. దీని ద్వారా అమర సైనికుల కుటుంబ వారసత్వం కొనసాగుతుందంటున్నారు.
- జవాన్ల వీర్యం/అండాలు ఉచితంగా భద్రపరుస్తామని ఉక్రెయిన్‌లో పలు సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచే ఇలాంటి ఆఫర్లు ఇస్తున్నాయి.
- వీర్యం/అండాలు భద్రపర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్న సైనికుల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. ప్రభుత్వం అనుమతితో పాటు ఆర్థిక సాయమూ అందిస్తుందని స్పష్టత రావడమే కారణమని తెలుస్తోంది.
- యుద్ధంలో గాయపడిన పలువురు జవాన్లు ఈ సేవలు ఉపయోగించుకుంటున్నారు.
- ఇప్పటికే ఒక బిడ్డ ఉన్నవారు కూడా మరో బిడ్డను కనడానికి ముందుకొస్తున్నారు. ఇలా భద్రపర్చుకుంటున్న జవాన్లలో మహిళల కంటే పురుషుల సంఖ్య అధికంగా ఉంది.

గ్రామాలకూ న్యాయవిద్య: సీజేఐ



న్యూఢిల్లీ: న్యాయ విద్య కోర్సులను మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఇంగ్లిష్ మాట్లాడని విద్యార్థులను సైతం న్యాయవిద్యలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నేషనల్ లా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాంకేతికత మనకు సుదూరప్రాంత విద్యార్థులకు సైతం చేరువయ్యే సామర్థ్యాన్ని అందించింది. న్యాయ విద్య ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, ఆంగ్లం మాట్లాడే పట్టణ ప్రాంత పిల్లలకు మాత్రమే ప్రస్తుతం ఇది అనుకూలంగా ఉంది'అని అన్నారు. 'ఇటీవల అయిదు లా యూనివర్సిటీల్లో ఓ సర్వే చేపట్టాం. విభిన్న భాషా నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులు కేవలం ఇంగ్లిష్‌లో మాట్లాడ లేకపోవడమే కారణంతో ఈ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందలేకపోతున్నట్లు సర్వేలో తేలింది'అని సీజేఐ వెల్లడించారు. భాషా పరమైన అవరోధాలను అధిగమించేందుకు భాషిణి సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందన్నారు. ఇందులో సుప్రీంకోర్టు 1950–2024 మధ్య వెలువరించిన 36 వేల పైచిలుకు తీర్పులను తర్జుమా చేసి ఇందులో పొందుపరిచి ఉన్నాయన్నారు. జిల్లా స్థాయి కోర్టుల్లో ఇంగ్లిష్ మాట్లాడలేని న్యాయవాదులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. న్యాయవిద్యను హిందీలో బోధిస్తే ఉత్తమ విద్యార్థులు తయారవుతారని వర్సిటీ యంత్రాంగానికి ఆయన సూచించారు.

కులగణన.. దేశానికి ఎక్స్‌రే: రాహుల్

ప్రయాగరాజ్/వయనాడ్: దేశ జనాభాలో ఓబీసీలు, దళితులు, గిరిజనులు కలిపి 73% వరకు ఉన్నప్పటికీ వారు యజమానులుగా ఉన్న కంపెనీల్లో టాప్–200లో ఒక్కటి కూడా లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. దేశానికి ఎక్స్ రే వంటి కులగణనతో ప్రతి ఒక్కటీ తేటతెల్లమవుతుందని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో స్వరాజ్‌భవన్ వద్ద జరిగిన ర్యాలీలో మాట్లాడారు. ఎవరి జనాభా ఎంతో తెలియడానికి కులగణన ఆయుధం వంటిది. దేశ సంపదలో మీ వాటా ఎంతో తెలుసుకోవచ్చు. దేశంలోని 73 శాతం జనాభా చేతుల్లో ఎంత సంపద ఉందో తెలుస్తుంది. ఈ కులాలకు సంబంధించిన ప్రతి ఒక్కటీ వెల్లడవుతుంది'అని రాహుల్ పేర్కొన్నారు. బడా పారిశ్రామికవేత్తల రుణాలను రద్దు చేసిన ప్రభుత్వం, రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకుకోట్లాది రూపాయల రుణాలను క్షణాల్లోనే మంజూరు చేసే బ్యాంకులు, దళితులు, వెనుకబడిన కులాల వారిని మాత్రం దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదని ఆరోపించారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటే అర్థం నిరుద్యోగులకు డబుల్ దెబ్బ అని యూపీలోని బీజేపీ సర్కారునుద్దేశించి రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

వయనాడ్‌లో పర్యటన..

రాహుల్ ఆదివారం ఉదయం కేరళలోని సొంత నియోజకవర్గం వయనాడ్‌లో పర్యటించారు. ఇటీవల ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటానని చెప్పారు. వారికి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని అధికారులను కోరారు.



ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

నవ భారతం నిర్మిద్దాం: మోదీ

'అబ్‌కీ బార్ చార్‌సౌ పార్' మిషన్‌తో పని చేద్దాం

- ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయని విపక్షాలూ అంటున్నాయి
- కాంగ్రెస్ బారినుంచి దేశాన్ని, యువతను కాపాడాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పార్టీ శ్రేణులకు పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: నవ భారత నిర్మాణం కోసం కదలి రావాలని బీజేపీ శ్రేణులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. లక్ష్య సాధన కోసం రాబోయే 100 రోజులు ఎంతో కీలకమని, 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' మిషన్‌తో పనిచేద్దామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం కాకుండా దేశ నిర్మాణం కోసం పనిచేద్దామని సూచించారు. అభివృద్ధి ఎజెండా లేని కాంగ్రెస్ పార్టీ నుంచి దేశాన్ని, యువతను రక్షించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. భారతదేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలంటూ చాలా దేశాలు తనను ఆహ్వానిస్తున్నాయని తెలిపారు. ఇండియాలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆయా దేశాలు భావిస్తున్నాయని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏకు 400 స్థానాలు వస్తాయని మన దేశంలో విపక్షాలు సైతం నినదిస్తున్నాయని గుర్తుచేశారు. ఢిల్లీలో భారత్ మండపంలో రెండు రోజుల పాటు జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. బీజేపీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 64 నిమిషాలపాటు ప్రసంగించారు. కాంగ్రెస్ సహా విపక్షాలపై నిప్పులు చెరిగారు. సొంతంగా అనుభవించడానికి అధికారం కోరుకోవడం లేదని, దేశానికి మేలు చేయాలన్నదే తన తపన అని స్పష్టం చేశారు.

శతాబ్దాల సమస్యలను పరిష్కరించాం

దేశంలో శతాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కారించేందుకు సాహసం చేశామని మోదీ చెప్పారు. ''500 ఏళ్ల నాటి అయోధ్య సమస్యను రామమందిర నిర్మాణంతో పరిష్కరించాం. ఏడు దశాబ్దాల తర్వాత ఆర్టికల్ 370 నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి లభించింది. మూడు దశాబ్దాల తర్వాత మహిళ రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ చట్టాలు తెచ్చాం. పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. నా సొంతింటి గురించే ఆలోచించుకుని ఉంటే ఇంతమందికి ఇళ్లు నిర్మించివ్వడం సాధ్యమయ్యేది కాదు. మూడోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారుస్తాం. సీఎంగా, ప్రధానిగా ఎంతో సాధించారు, ఇక విశ్రాంతి తీసుకోండని ఓ సీనియర్ నాయకుడు నాతో అన్నారు. నేను రాజనీతి, రాష్ట్రనీతి కోసం పని చేస్తా. ఛత్రపతి శివాజీ ఆశయాలే నాకు స్ఫూర్తి'' అన్నారు.



మోదీని గజమాలతో సత్కరిస్తున్న అమిత్ షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా

దేశాన్ని విభజించే పనిలో కాంగ్రెస్

భాష, ప్రాంతం ఆధారంగా దేశాన్ని విభజించే పనిలో కాంగ్రెస్ పార్టీ నిమగ్నమైందని ప్రధానమంత్రి దుయ్యబట్టారు. దేశ సైనికుల నైతిక స్థైర్యాన్ని, మనోధైర్యాన్ని దెబ్బతీసే పాపం కాంగ్రెస్ చేసిందన్నారు. సైన్యం సాధించిన విజయాలపై ప్రశ్నలు లేవనెత్తిందని విరుచుకుపడ్డారు. దేశానికి రఫెల్ యుద్ధ విమానాలు రాకుండా అడ్డుకొనేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమికి అభివృద్ధి ఎజెండానే లేదన్నారు. బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను కాంగ్రెస్ పెంచి పోషించిందని విమర్శించారు. గతంలో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ ఇప్పటికీ కుట్రలు చేస్తోందన్నారు. దేశాభివృద్ధి పట్ల ఎలాంటి ప్రణాళిక లేని ఆ పార్టీ విచ్చలవిడిగా హామీలు ఇస్తోందని ఆక్షేపించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

వచ్చే వెయ్యేళ్లలో 'రామరాజ్యం'

అయోధ్య రామాలయమే ప్రతీక
బీజేపీ జాతీయ సదస్సులో తీర్మానం

అయోధ్యలో రామ మందిర నిర్మాణం పట్ల బీజేపీ హర్షం వెలిబుచ్చింది. ఇది ప్రతి భారతీయుడికి ఆనందం కలిగించిందని పేర్కొంది. రాబోయే వెయ్యేళ్లలో సంవత్సరాల్లో స్థాపించబోయే రామరాజ్యానికి ఈ ఆలయం ప్రతీక అంటూ ఆదివారం జాతీయ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించింది. ''అయోధ్య రామాలయం జాతిని జాగృతం చేసే ఆలయం. వికసిత్ భారత్ తీర్మానాల సాకారంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. రాముడి జన్మస్థానంలో భవ్య మందిర నిర్మాణం చరిత్రాత్మక విజయం. తీర్మానంలో ప్రస్తావించారు. రాజ్యాంగ అసలు ప్రతిలో సీతా రామ లక్ష్మణుల చిత్రాలున్నాయి. పౌరుల ప్రాథమిక హక్కులకు రాముడు స్ఫూర్తి అనేందుకిదే నిదర్శనం. రామరాజ్యమనే భావన మహాత్మాగాంధీ హృదయంలోనూ ఉండేది. ఆ ఆదర్శాలను మోదీ చక్కగా పాటిస్తున్నారు'' అంటూ కొనియాడింది. రామ మందిర ప్రాణప్రతిష్ఠను విజయవంతంగా నిర్వహించిన మోదీకి అభినందనలు తెలిపింది.

వచ్చే వంద రోజులు కీలకం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే 100 రోజుల ఎంతో కీలకమని మోదీ చెప్పారు. ఈ 100 రోజులు కొత్త శక్తి, ఉత్సాహం, విశ్వాసంతో పని చేయాలని సూచించారు. ''ఈ రోజు ఫిబ్రవరి 18. దేశంలో 18 ఏళ్లు నిండిన యువత 18వ లోక్‌సభకు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. రాబోయే వంద రోజుల్లో ప్రతి కొత్త ఓటరును, ప్రభుత్వ పథకాల లబ్ధిదారును పలుకరించండి. ప్రతి ఇంటికీ వెళ్లండి. అందరి విశ్వాసం పొందండి. బీజేపీకి అత్యధిక సీట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. బీజేపీకి సొంతంగా 370కి పైగా స్థానాలు, ఎన్డీఏకి 'అబ్‌కీ బార్, చార్‌సౌ పార్' మిషన్‌తో పని చేద్దాం. ఇకపై భారత్ స్వప్నాలు, సంకల్పాలు విశాలమైనవిగా ఉంటాయి. ఈ పదేళ్లలో ఒక మైలురాయిని మాత్రమే చేరాం. కోట్లాది మంది ప్రజల జీవితాలను మార్చాల్సి ఉంది. తీసుకోవాల్సిన నిర్ణయాలెన్నో ఉన్నాయి. యువత, మహిళ, పేదలు, రైతుల శక్తిని 'వికసిత్ భారత్' నిర్మాణానికి వినియోగించుకోవాలి. ఆయా వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, కొత్త చట్టాలు తీసుకొచ్చాం. 2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్' అనే పెద్ద తీర్మానం చేసుకున్నాం'' అన్నారు.

విపక్ష కూటమిలో 2జీ, 3జీ, 4జీ పార్టీలు

మూడోసారీ మోదీయే: అమిత్ షా

న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మహాభారత యుద్ధంతో పోల్చారు. పాండవులు, కౌరవుల్లా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా' కూటమి తలపడబోతున్నాయని చెప్పారు. ''విపక్ష కూటమిలోని పార్టీలన్నీ వారసత్వ, బుజ్జగింపు, అవినీతి రాజకీయాల్లో ఆరితేరాయి. అవన్నీ 2జీ, 3జీ, 4జీ పార్టీలు. వాటిని రెండో తరం, మూడో తరం, నాలుగో తరం నేతలు నడిపిస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు. ఆదివారం బీజేపీ జాతీయ సదస్సులో 'బీజేపీ: దేశానికి ఆశ, ప్రతిపక్షానికి నిరాశ' తీర్మానంపై అమిత్ షా మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రధాని మోదీ విపక్షాల అనైతిక రాజకీయాలకు ఇప్పటికే చరమగీతం పాడారని, దేశంలో అభివృద్ధి రాజకీయాలను తీసుకొచ్చారని కొనియాడారు. ''ప్రజల మనస్సులో ఏ సందేహాలూ లేవు. మోదీని మూడోసారి ప్రధానిగా ఎన్నుకోవాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారు. మోదీ తాను కరిగిపోతూ వెలుగులు పంచే కొవ్వొత్తి లాంటివారు. దేశాభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారు. బీజేపీలో వారసత్వ రాజకీయాలే ఉంటే ఒకప్పుడు టీ అమ్ముకొని జీవించిన పేద తండ్రి కుమారుడైన మోదీ ప్రధాని అయ్యేవారు కాదు'' అన్నారు.

జేపీ నడ్డా కొనసాగింపు

సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా పదవీ కాలాన్ని ఈ ఏడాది జూన్ వరకు పొడగించారు. ఆదివారం బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నడ్డా పదవీకాలం పొడిగింపు ప్రతిపాదనను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. లోక్‌సభ ఎన్నికలకు ఆయన సారథ్యంలోనే ఎదుర్కొంటామని బీజేపీ ప్రకటించింది. ముఖ్యమైన పార్టీ నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే అధికారాన్ని నడ్డాకు కట్టబెట్టారు.

గృహిణుల సేవలకు వెలకట్టలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇంట్లో గృహిణులు రోజంతా చేసే పనులకు వెలకట్టలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. గృహిణి బాధ్యతలు ఎంతో గౌరవప్రదమైనవని, డబ్బుతో వాటిని పోల్చలేమని తెలిపింది. ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు వ్యాఖ్యానించింది. వాహన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళ కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.6 లక్షలకు పెంచుతూ తీర్పు వెలువరించింది. 2006లో ఓ మహిళ వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఆమె నడిపే వాహనానికి బీమా చేయించలేదు. మృతురాలి భర్త, మైనర్ కుమారుడికి కలిపి రూ.2.5 లక్షలు చెల్లించాలని మోటారు వాహన క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ప్రమాదానికి కారణమైన వాహన యజమానిని ఆదేశించింది. దీనిపై మృతురాలి కుటుంబం ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించింది. మృతురాలు ఉద్యోగిని కాదు, కేవలం గృహిణి మాత్రమే. పరిహారాన్ని ఆమె జీవిత కాలాన్ని, నామమాత్రపు ఆదాయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తారు'అని పేర్కొంటూ పరిహారం మొత్తాన్ని పెంచేందుకు నిరాకరిస్తూ 2017లో తీర్పు చెప్పింది. దీనిపై బాధితులు అత్యున్నత న్యాయస్థానం తలుపుతట్టారు. విచారించిన ధర్మాసనం 'ఒక గృహిణి సేవలను రోజువారీ కూలీ కంటే తక్కువగా ఎలా నిర్ణయిస్తారు? ఈ విధానాన్ని మేం అంగీకరించడం. గృహిణి విలువను ఎన్నడూ తక్కువగా అంచనా వేయరాదు'అని పేర్కొంటూ రూ.6 లక్షల పరిహారాన్ని మృతురాలి కుటుంబానికి చెల్లించాలని వాహన యజమానిని ఆదేశించింది.

ఆధార్‌ను తొలగిస్తున్న కేంద్రం: మమత

సూరి: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందనివ్వడం లేదని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తమ ప్రభుత్వం ఆధార్ కార్డుతో పనిలేకుండానే సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బిర్భూమ్ జిల్లా సూరిలో జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. 'జాగ్రత్తంగా ఉండండి. కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌లోని చాలా జిల్లాల్లో ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉచిత రేషన్, లక్ష్మీభండార్ వంటి పథకాలను ప్రజలకు అందకుండా చేసేందుకు ఇలాంటి చర్యలకు దిగుతోంది. ఆధార్ లేదనే కారణంతో పథకాలను ప్రజలకు అందకుండా నిలిపివేయవద్దని అధికారులను ఆదేశించాను. బెంగాల్ ప్రజలు భయపడొద్దు. మీకు అండగా నేనున్నాను' అన్నారు. ఆధార్ కార్డుల తొలగింపు వెనుక కుట్ర ఉందని తెలిస్తే ఒక్క కూడా దాన్ని లింక్ చేయడానికి అనుమతించబోనన్నారు. ఆధార్ కార్డులు తొలగించిన వారి వివరాలతో పోర్టల్‌ను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని కారణంగా బ్యాంకులు లావాదేవీలను నిరాకరించినట్లయితే సహకార బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సేవలను వాడుకోవాలని ప్రజలకు ఆమె సూచించారు.

జైన గురువు 'సల్లేఖనం'

ప్రధాని మోదీ, పలువురు సంతాపం



రాజ్‌నందన్‌గావ్: ప్రముఖ జైన గురువు ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ 'సల్లేఖన' వ్రతం ద్వారా శరీరత్యాగం చేశారు. రాజ్‌నందన్‌గావ్ జిల్లా డొంగార్‌గఢ్‌లోని చంద్రగిరి తీర్థ్‌లో ఆదివారం ఉదయం ఆయన తుదిశ్వాస వదిలారని తీర్థ్ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఆరు నెలలుగా మహారాజ్ డొంగార్‌గఢ్ తీర్థ్‌లోనే ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడు రోజులుగా సల్లేఖన దీక్షను పాటిస్తున్నారు. జైన మతాచారం ప్రకారం సంపూర్ణ ఉపవాస దీక్ష (సల్లేఖనం)తో శరీరం వదిలారు. ఆత్మశుద్ధీకరణార్థం ఈ దీక్ష చేపట్టారు'' అని తీర్థ్ తెలిపింది. తీర్థ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

సొంత బ్రాండ్ షూస్ విడుదల చేసిన ట్రంప్



ఫిలడెల్ఫియా: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత బ్రాండ్ షూస్‌ను విడుదల చేశారు. ఆదివారం ఫిలడెల్ఫియాలో కన్వెన్షన్ సెంటర్‌లో వాటిని ప్రదర్శించారు. బంగారు వర్ణం షూలు 399 డాలర్లకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు విక్టరీ47 అనే సెంటును కూడా విడుదల చేశారు. ఆస్తుల విలువను ఎక్కువ చేసి చూపిన నేరానికి కోర్టు ఏకంగా 35.5 కోట్ల డాలర్ల భారీ జరిమానా విధించిన మరునాడే ట్రంప్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ బరిలోకి దిగనున్నారు.

బీజేపీ గూటికి మనీశ్ తివారీ?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ బీజేపీ కండువా కప్పుకుంటారని, ఆ పార్టీ తరఫున పంజాబ్‌లోని లూధియానా లోక్‌సభ స్థానం బరిలో దిగుతారని ఆదివారం వార్తలొచ్చాయి. అయితే ఇవన్నీ పుకార్లంటూ తివారీ కార్యాలయం ఖండించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ తన కుమారుడు, ఎంపీ నకుల్‌తో పాటు బీజేపీ గూటికి చేరనున్నారంటూ కూడా వార్తలొస్తుండటం తెలిసిందే. ఆయన తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. పార్టీ మారుతున్నారన్న ప్రచారంపై ప్రశ్నించగా 'ఏమైనా ఉంటే మీకే మొదట చెబుతా'నంటూ దాటవేశారు!

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహ స్వామి తిరునాళ్ల క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త గంజి చిరంజీవి ఆదివారం ఆవిష్కరించారు.



గవర్నర్‌కు ఘనస్వాగతం

కోనేరుసెంటర్: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు విచ్చేసిన గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్‌కు కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ స్వాగతం పలికారు.

నేటి స్పందన రద్దు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో ఈనెల 19వ తేదీ సోమవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులకు ఎన్నికల శిక్షణ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



గుడివాడ టౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా ఖోఖో పురుషులు, మహిళల జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఈ ఎంపికకు జిల్లా లోని అన్ని ప్రాంతాల నుంచి 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎంపిక చేసినట్లు ఖోఖో సంఘం అధ్యక్షుడు మడకా ప్రసాద్ తెలిపారు. ఎంపికైన మహిళ, పురుషుల జట్లు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు సామర్లకోట ప్రభుత్వ కళాశాలలో జరిగే అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటాయన్నారు.

గ్రంథాలయాధికారి రమాదేవికి బెస్ట్ సర్వీస్ అవార్డు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయం గ్రేడ్–1 గ్రంథాయాధికారి కె. రమాదేవికి హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రకటించింది. ఆదివారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప అరుణాచల మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయాధికారి రమాదేవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అమ్మిరెడ్డి రజిని, నేషనల్ చైర్మన్ రాజా పాల్గొన్నారు.

ముగిసిన సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారి పుష్ప శయ్యాలంకృత పర్యంకసేనతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ ఏసీ చక్రధరరావు తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 9 గంటలకు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి(భక్తిరస నాటకం) చరిత్ర భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

వేడుకకు వేళాయె

నేటి నుంచి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం సోమవారం ప్రారంభం కానుంది. ఏటా మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) పర్వదినాన ప్రారంభమై 15 రోజులు పాటు జరిగే ఉత్సవాలను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పారుపూడి, నెరుసు వంశస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అంకురార్పణ చేస్తారు. సంప్రదాయం ప్రకారం పట్టణ పోలీసులు పసుపు కుంకుమ సమర్పించి తొలి పూజ చేయటంతో తిరునాళ్ల మహోత్సవం మొదలవుతుంది. మెట్టినింట కొలువైన అమ్మవారు రాత్రి 7.30 గంటలకు ఊరేగింపుగా బయలుదేరతారని ఆలయ ట్రస్టీ పారుపూడి సుబ్బారావు తెలిపారు. అమ్మవారు పల్లకీలో పట్టణ వీధుల్లో ఊరేగి మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఊయల స్తంభాలకు చేరుకుంటారన్నారు. ఊయల ఉత్సవం పూర్తి చేసుకున్న పిదప ఆలయ ప్రవేశం చేసి భక్తుల పూజలందుకుంటారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, రవాణా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

తిరుగు పయనం..
ఊరంతా సంబరం

- భక్తజనసంద్రమైన పేట
- అడుగడుగునా నీరాజనాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

పల్లకీల్లో తరలివెళ్లిన తిరుపతమ్మ, గోపయ్య, సహదేవతలు



పెనుగంచిప్రోలుకు ప్రత్యేక పల్లకీల్లో వెళ్తున్న విగ్రహాలు

జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత తిరుపతమ్మ రంగుల మహోత్సవాన్ని ముగించుకొని ప్రత్యేక పల్లకీల్లో పెనుగంచిప్రోలుకు తరలివెళ్లారు. ఆదివారం ఉదయం 5.16గంటలకు పట్టణంలోని రంగు బజార్‌లోని సంయుక్త రంగుల మండపంలో రంగులు పూర్తి చేసుకుని ఉన్న ఊరు అంకమ్మ, పెద్ద తిరుపతమ్మ, పెద్ద గోపయ్య, వినుకొండ అంకమ్మ, చిన్న తిరుపతమ్మ, చిన్న గోపయ్య, మద్దిరావమ్మ, చంద్రమ్మ, మల్లయ్య, గుర్రం, పులి విగ్రహాలకు అర్చకులు మర్రిబోయిన రమణ, గోపాలరావు, ఆలయ ఈవో శోభారాణి, పాలకవర్గ సభ్యులు వేద పండితులు పూజలు చేశారు. అనంతరం కేరళ వాయిద్యాలు, కొమ్ము వాయిద్యాలు, మేళతాళాల మధ్య విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేసిన ఎనిమిది పల్లకీల్లో అధిష్టింపజేశారు.

పలు వీధుల గుండా ఊరేగింపు..

మండపం నుంచి పల్లకీ యాత్ర పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు పలుకుతూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమలు, వారులు, టెంకాయలు కొట్టి అమ్మా, మమ్మల్ని చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. కొయ్య, డప్పువాయిద్యాలు, కోలాటాలు, నృత్యాల నడుమ పల్లకీలు ముందుకు సాగాయి. దాదాపు ఉదయం 6 గంటల నుంచి వైఎస్సార్ సర్కిల్ వెళ్లేందుకు 8 గంటల సమయం పట్టింది. పల్లకీలకు భక్తులు ఎదురేగి పూజలు చేస్తుండటంతో యాత్ర ఆలస్యంగా సాగింది.

బారులు తీరిన భక్తులు..

17 రోజులపాటు రంగుల మండపంలో కొలువైన దేవతామూర్తులు పెనుగంచిప్రోలుకు తిరుగు ప్రయాణం అవటంతో భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. మరలా తిరిగి రెండేళ్లకు రానుండటంతో పల్లకీలలో దేవతామూర్తులను చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు రహదారులపై బారులు తీరారు. పల్లకీలు వారి ఇళ్ల ముందు నుంచే వెళ్లడంతో మామిడి తోరణాలు కట్టి అమ్మకు స్వాగతం పలికారు. ప్రత్యేక పొంగళ్లు తయారు చేసి జంతు బలులు సమర్పించారు.

భారీ బందోబస్తు..

పల్లకీల యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. 150 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సీఐ జానకీరామ్, ఎస్ఐలు సూర్య భగవాన్, పద్మారావు పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో విప్ ఉదయభాను

తిరుగు ప్రయాణం అవుతున్న అమ్మవారిని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే, సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు రంగుల మండపంలో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొద్ది సేపు పల్లకీలు మోస్తూ ముందుకు నడిపించారు. ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల శ్రీకాంత్, భవానీ, నాయకులు మార్నెళ్ల పుల్లారెడ్డి, సూరారెడ్డి పాల్గొన్నారు.



జగ్గయ్యపేట రంగుల మండపం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విప్ ఉదయభాను

నాగమ్మ దేవాలయాన్ని పరిరక్షించుకోవాలి

- ఆలయానికి 800 సంవత్సరాల చరిత్ర
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాటి పౌరుషానికి ప్రతీక అయిన నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి భవిష్యత్ తరాలకు అందించాలని పురావస్తు పరిశోధకుడు, కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వారసత్వ సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం జిట్టగామాలపాడు గ్రామం శివారులోని నాయకురాలు నాగమ్మ ఆలయాల శిథిలాలను ఆదివారం పరిశీలించామన్నారు. ఈ ఆలయం 800 సంవత్సరాల నాటిదని చెప్పారు. పల్నాటి యుద్ధంలో నలగామ రాజు మంత్రిగా ఉన్న నాయకురాలు నాగమ్మ బ్రహ్మనాయుడితో పోరాడిన వీర వనితగా గుర్తింపు పొందారన్నారు. నాగమ్మ పౌరుషానికి గుర్తుగా అప్పటి వీరులు నిర్మించిన నాగమ్మ ఆలయం గర్భాలయం, అర్థ, మహామండపం శకలాలు శిథిలావస్థలో పడి ఉన్నాయన్నారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయాన్ని పరిరక్షించుకుని భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించాలన్నారు. నాగమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం లేదా స్థానికంగా ఉండే వారు ముందుకొస్తే స్థపతి (ఆలయాల నిర్మాణంలో వాస్తు చూసే వారు)గా తనకున్న అనుభవంతో ఉచితంగా ఆలయ నిర్మాణానికి తన సేవలను అందిస్తానని శివనాగిరెడ్డి చెప్పారు. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం గల నాయకురాలు నాగమ్మ ఆలయాన్ని పునరుద్ధరించడంతో పాటుగా పల్నాటి యుద్ధ క్షేత్రాలైన మాచర్ల, గురజాల, కారంపూడి, కంభంపాడు, జిట్టగామాలపాడును కలుపుతూ పల్నాడు టూరిస్ట్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాల్సిందిగా ఆయన కోరారు.



ఆలయ శిథిలాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

నేటి నుంచి మల్లేశ్వర స్వామికి నిత్య పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి. స్వామి వారికి తెల్లవారుజామున 6 గంటల నుంచి 11 గంటల వరకు అభిషేకం జరుగుతుంది. అభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ. 500 టికెటు కొనుగోలు చేయడం ద్వారా ఇద్దరిని సేవకు అనుమతిస్తారు. అష్టోత్తర పూజ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు జరుగుతుంది. సేవలో పాల్గొనే భక్తులు రూ. 100 టికెట్టు కొనుగోలు చేయాల్సి ఉంది. టికెట్‌పై ఇద్దరిని సేవకు అనుమతిస్తారు.

దుర్గమ్మకు కాళహస్తి నుంచి పట్టువస్త్రాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామికి కాళహస్తి దేవస్థానం నుంచి ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. భ్రమరాంబికా సమేత కాళహస్తీశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ అంజూరి శ్రీనివాస్, ఆలయ అధికారులు, ప్రధానార్చకుడు పట్టువస్త్రాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి చేరుకోగా దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ ఈవో రామారావుకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో ప్రసాదాలను అందజేశారు.



ఈవో రామారావుకు పట్టువస్త్రాలు అందజేస్తున్న కాళహస్తి ఆలయ చైర్మన్ శ్రీనివాస్


సత్తాచాటిన రైల్వే అధికారుల సతీమణులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ డబుల్స్‌లో రైల్వే అధికారుల సతీమణులు ప్రతిభ కనబర్చి టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా నిలిచారు. ఈ నెల 16 నుంచి 18 వరకు రాజమండ్రిలో జరిగిన ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఉమెన్స్ డబుల్స్‌లో విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు సతీమణి, విజయవాడ డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డీఈఈ ప్రసాదరావు సతీమణి లక్ష్మీ తనూజ పోటీ పడ్డారు. ఓపెన్ కేటగిరి మహిళల 40 ప్లస్ విభాగంలో పాల్గొన్న వారు ప్రిలిమ్స్, లీగ్స్, సెమీ ఫైనల్స్‌లో అజేయంగా నిలిచి ఫైనల్‌లో పోరాడి ఓడారు. చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచి సత్తా చాటిన ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ డి.శ్రీదేవి, లక్ష్మీ తనూజలను డీఆర్‌ఎం నరేంద్ర ఎ. పాటిల్ అభినందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 517.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 817.50 అడుగుల వద్ద ఉంది.



రమణీయం.. ప్రతిష్టాపనోత్సవం

- మల్లేశ్వరుని ఆలయంలో పరివార దేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ట
- వైభవంగా కుంభాభిషేకం
- నూతన ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్ట
- పాల్గొన్న దేవదాయ శాఖ మంత్రి, ఆలయ చైర్మన్, ఈవో



ఆలయంలో దేవతామూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్ నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 14న నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ తాపడ శిఖర ప్రతిష్టా మహోత్సవాలను శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రారంభించింది. ఆదివారం ఉదయం మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో యాగశాలలో ఆది దంపతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులతో పాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. నూతన ధ్వజస్తంభానికి మంత్రి కొట్టు సత్యనారాయణ, చైర్మన్, ఈవోలతో పాటు దాత సంగా నరసింహారావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సుముహూర్తాన..

ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభం, నందీశ్వరుడు, కాలభైరవుడితో పాటు పలు సపరివార దేవతా విగ్రహాల ప్రతిష్ట జరిగింది. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు బద్రీనాథ్‌బాబు, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, లింగంభొట్ల బద్రీనాథ్‌బాబు, రఘునాథ శర్మ(పండు), శ్యావశ్య మహర్షి, యూవీఎస్ మురళీధర్ శాస్త్రిలతో పాటు ఆలయ అర్చకులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 11.45 గంటలకు పరివార దేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ట, పూజా కార్యక్రమాల అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయ శిఖరంపై స్వర్ణ కలశ ప్రతిష్ట జరిగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి బాలాలయంలో భద్రపరిచిన జలాలతో కళాప్రకర్షణ, దేశంలోని వివిధ సముద్రాలు, నదులు, తీర్థాల నుంచి సేకరించిన జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు దంపతులు ఆలయ శిఖరం వద్ద నిర్వహించిన కుంభాభిషేకంలో పాల్గొన్నారు. యాగశాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, ఏఈవోలు ఎన్. రమేష్ బాబు, చంద్రశేఖర్, సుధారాణిలతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

పునర్ వైభవం..

ప్రకృతి అన్ని రకాలుగా కరుణించాలంటే భగవంతుడి అనుగ్రహం ఉండాలని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. వెయ్యేళ్ల చరిత్ర ఉట్టిపడేలా స్వామి వారి ఆలయాన్ని పునర్ నిర్మించామని, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, స్వర్ణ తాపడ శిఖరాన్ని ప్రతిష్ట ఎంతో వైభవంగా నిర్వహించామన్నారు. రాష్ట్రంలో జీర్ణోద్ధరణకు చేరుకున్న ఆలయాలను పునర్ నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో అనేక ఆలయాలకు పునర్ వైభవం తీసుకువస్తున్నామన్నారు.

ఆకాశంలో అద్భుతం!

మల్లేశ్వర స్వామి వారి ఆలయ ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్టా మహోత్సవ సమయంలో అద్భుతం చోటు చేసుకుంది. ధ్వజస్తంభం, స్వర్ణ కలశ ప్రతిష్టకు పది నిమిషాలు ముందు ఆకాశంలో గరుడ పక్షులు ప్రత్యక్షమయ్యాయి. ఆలయ శిఖరానికి స్వర్ణ కలశాన్ని చేరేందుకు పైకి ఎక్కుతున్న ఆలయ అర్చకులు ఈ విషయాన్ని గమనించి ఆలయం వద్ద ఉన్న భక్తులకు, ఆలయ సిబ్బందికి తెలిపారు.



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

విపొత్తుతో వైరాగ్యం

టీడీపీ, జనసేనల్లో టికెట్ల కుంపట్లు

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో నాలుగు సీట్ల కోసం జనసేన పట్టు
- ససేమిరా అంటున్న తెలుగుదేశం
- రెండు పార్టీల మధ్య ముదురుతున్న వివాదం
- ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో కాడి పడేసిన 'తెలుగు తమ్ముళ్లు'



సాక్షి ప్రతినిధి, విజయవాడ: జిల్లా తెలుగుదేశంలో జనసేనతో పొత్తు తీవ్ర కలవరం రేపుతోంది. జనసేన పార్టీ ఒత్తిడికి లోకేష్, చంద్రబాబు మెత్తబడినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో విజయవాడ తూర్పు, పశ్చిమ, మైలవరం, పెడన, అవనిగడ్డ.. ఈ ఐదు నియోజకవర్గాల్లో తమకు నాలుగు నియోజకవర్గాలు కేటాయించాలని జనసేన నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం. ఎటువంటి పరిస్థితుల్లో మూడు సీట్లకు తగ్గేది లేదని భీష్మించుకు కూర్చున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే ఆ మూడు సీట్లతో పాటు, ఎంపీ సీటుపైన టీడీపీ పూర్తి ఆశలు వదులుకుకోవాల్సిందేననే భావనలో టీడీపీ ఉంది.

టికెట్ ఇచ్చినా ఓడిస్తాం..

మరోవైపు విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఒక్క సీటు కూడా ఇవ్వడానికి వీలులేదని, టీడీపీ అధినేతపై ఒత్తిడి తేవాలని తెలుగు తమ్ముళ్లు చూస్తున్నారు. విజయవాడలో జనసేనాని సామాజిక వర్గానికి రాజకీయంగా పట్టు ఏర్పడితే, తెలుగుదేశం రాజకీయ ప్రయోజనాలకు విఘాతం అని చంద్రబాబు కూడా భావిస్తున్నారు. అనివార్యం అయితే ఒకటి, రెండు సీట్లు జనసేనకు ఇచ్చినా, ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని టీడీపీ ధ్యేయంగా పెట్టుకొంది. జనసేనకు గాని, ఆ పార్టీకి దన్నుగా ఉన్న సామాజిక వర్గానికి ఎన్టీఆర్ జిల్లాలో స్థానం లేకుండా చేయాలన్నదే టీడీపీ ఎత్తుగడ. ఈ విషయం బయటికి పొక్కడంతో జన సైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీట్ల వ్యవహారంపై తాడో పేడో తేల్చుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెబుతున్నారు.

టీడీపీ సైలెంట్..

జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు కొన్ని నియోజకవర్గాల్లో కాడి పడేయటం ఆ పార్టీ అధిష్టానాన్ని కలవరపెడుతోంది. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన మధ్య టికెట్‌పై గందరగోళం నెలకొంది. తెలుగుదేశం పార్టీ నాయకులు బుద్దా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంకే బేగ్‌లు తమకే టికెట్ వస్తుందని బహిరంగ ప్రకటనలు గుప్పిస్తున్నారు.

మండలికి మళ్లీ సారీ!

ఇటీవల చంద్రబాబు, పవన్ భేటీలో సైతం అవనిగడ్డ టికెట్ జనసేనకు ఇవ్వాలని కోరారు. దీంతో ఆ నియోజకవర్గంలో టీడీపీ నేత మండలి బుద్ధ ప్రసాద్‌కు ఈసారీ టికెట్ దక్కే అవకాశం లేదనే భావనలో టీడీపీ శ్రేణులు ఉన్నాయి. బుద్ధ ప్రసాద్ కూడా సైలెంట్‌గా ఉన్నారు. ఇక్కడ జనసేనకు టికెట్ ఇస్తే, ఓటమి తప్పదని, టీడీపీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నాయి. పెడన నియోజకవర్గం టికెట్ జనసేనకు కేటాయిస్తారనే గట్టి నమ్మకంతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి. టీడీపీ నేతలు కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ వర్గాల మధ్య వర్గపోరు నడుస్తోంది. టికెట్‌పై ఎటూ తేలకపోవడంతో, టీడీపీ నేతలు అంటీ ముట్టనట్లు నియోజకవర్గంలో తిరుగుతున్నారు. పొత్తు ఖరారు కాకముందే కొన్ని నియోజక వర్గాల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించటాన్ని అక్కడ జనసేన పార్టీ శ్రేణులు జీర్ణించుకొలేకపోతున్నారు.

జనసేన సైతం పొత్తులో భాగంగా ఈ సీటు తమకే కేటాయిస్తారని ఆ పార్టీ నేత పోతిన మహేష్ హడావుడి చేస్తున్నారు. ఇక్కడ టికెట్‌పై స్పష్టత లేకపోవడంతో.. అక్కడ అసలే అంతమాత్రంగా ఉన్న టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం ఏర్పడింది. ఇక్కడ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్ ప్రచారం ముమ్మరం చేశారు.

గద్దె సీటుకు ఎసరు!

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు కొంతకాలంగా నియోజకవర్గంలో పర్యటించడం లేదు. టికెట్ వస్తుందో రాదో అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. జనసేన నాయకులు సైతం ఈ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని రెండు, మూడు సార్లు చుట్టేశారు. తాజాగా కుటుంబ సభ్యులందరితో కలిసి, తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, తమకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని వైఎస్సార్ సీపీ తరఫున పార్లమెంట్ ఇన్‌చార్జిగా ప్రకటించడం పార్లమెంట్ పరిధిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు కలిసొస్తోంది. తాజాగా మైలవరం జనసేనకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. అక్కడ దేవినేని ఉమాకు టికెట్ లేదని టీడీపీ అధిష్టానం ఇప్పటికే స్పష్టం చేయడంతోపాటు, అక్కడ అభ్యర్థి ఎవరో తేలక పోవడంతో దేశం శ్రేణుల్లో స్తబ్దత నెలకొంది.

క్లుప్తంగా

విశిష్టమైనది కూచిపూడి నాట్య సంప్రదాయం



విజయవాడ కల్చరల్: కూచిపూడి నాట్య సంప్రదాయ విలువలు విశిష్టమైనవని కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం అన్నారు. విజయమాధవి సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జాతీయ సంగీత నృత్యోత్సవం సిరీస్ 5 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాధేశ్యాం మాట్లాడుతూ ఒక గ్రామం పేరుతో అద్భుతమైన నాట్య సంప్రదాయం కలిగి ఉండటం అరుదైన విషయమన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కూచిపూడి నాట్య సంప్రదాయంపై ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి మాట్లాడుతూ భారతీయ నృత్య సంప్రదాయాలకు ఆద్యుడు భరతమునిగా వివరించారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని సంగీత, సంప్రదాయ నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన చిన్నారులు సోలో గానూ, బృందంగానూ నాట్యాలను ప్రదర్శించారు.

రెండో అంతస్తు నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిర్మాణంలో ఉన్న రెండో అంతస్తుకు సెంట్రింగ్ బల్లలు పెడుతూ ఓ కార్మికుడు కిందపడి మృతి చెందిన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరెన్సీ నగర్‌కు చెందిన రెడ్డి వెంకట రమణ(43) ఈడుపుగంటి విజయ్‌కుమార్ అనే వ్యక్తి వద్ద సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నందమూరి నగర్ తోటవారి వీధి ఏడో లైన్‌లో నూతన భవన నిర్మాణానికి ఆదివారం ఉదయం రెండో అంతస్తు కోసం సెంట్రింగ్ పెడుతూ ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కిందపడిపోయాడు. వెంకటరమణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృషి, పట్టుదల, దృఢ సంకల్పంతో ఉన్నత స్థానం

- తీసుకునే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలి
- అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్



విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు కృషి, పట్టుదల, దృఢ సంకల్పంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ప్రముఖ సేవా తత్పరుడు పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక గవర్నర్‌పేట మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కోఫా) ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదని అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా 26 ఏళ్లుగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయటంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కోఫా సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవ చేయాలని సూచించారు. విద్యార్థులు తీసుకునే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలని అన్నారు. విశిష్ట అతిథి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి గాదం సత్యప్రభాకర్‌రావు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని విద్యాభివృద్ధికి కోఫా అందిస్తున్న సేవలు అద్వితీయమని కొనియాడారు. కోఫా వ్యవస్థాపకుడు, గౌరవాధ్యక్షుడు బల్లెం నాగేశ్వరరావు మాట్లాడుతూ 1996లో తాము ప్రారంభించిన కోఫా నేడు వేలాది మంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నిరుపుతోందని హర్షం వ్యక్తం చేశారు. తాము చేస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కోఫా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణారావు, రామాయణం నాగసత్యం మాట్లాడుతూ 1996లో 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున మొత్తం రూ.16 వేల ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంతో ప్రారంభమైన కోఫా ప్రయాణం నేడు 180 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఏడాదికి రూ.18 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కోఫా నుంచి ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకోవటంతో పాటు వారు కూడా ఉపకార వేతనాల పంపిణీకి సహకరించటం శుభ పరిణామం అన్నారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, కోఫా నాయకులు డాక్టర్ దావులూరి కైలాసరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశా రు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. డాక్టర్ సీఎస్ఆర్ ప్రసాదరావు, కొత్తపల్లి సంజీవ్, దుట్టా రమేష్ కుమార్, మద్దాలి సాంబశివరావు, కేతినీడి భాస్కర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

క్యూలైన్లలోనే అనుమతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విశేషంగా భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వా తావరణం కనిపించింది. సాధారణ భక్తులతో పాటు నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెళ్లి దుస్తులపై ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం, కుంభాభిషేకం నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి ప్రముఖులు విచ్చేయడంతో ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి కార్లు, ఇతర వాహనాలను అనుమతించలేదు. దీంతో భక్తులు తమ కార్లు, ఇతర వాహనాలను సీతమ్మ వారి పాదాలు, భవానీపురంలో పార్కింగ్ చేసుకుని దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకున్నారు. మరో వైపున మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్లు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని క్యూలైన్లు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. రద్దీ నేపథ్యంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గు రి కాకుండా దేవస్థాన ఏఈవో ఎన్.రమేష్‌బాబు క్యూ లైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మరో వైపున అమ్మ వారికి సాయంత్రం నిర్వహించే పంచహారతుల సేవతో పాటు పల్లకీ సేవలోనూ పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



దుర్గ గుడిలో ఆదివారం దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర పరిధిలోని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం మూడు డివిజన్ల నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. స్థానిక గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం మూడు డివిజన్ల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి.

ఒకటో డివిజన్ కార్యవర్గం

ఒకటవ డివిజన్ అధ్యక్షుడిగా జి.రాములు, సహాధ్యక్షుడిగా సి.హెచ్.హరిబాబు, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాసరావు, ఎం.నవీన్‌కుమార్, కార్యదర్శిగా వి.నరేంద్ర కుమార్, కార్యాలయ కార్యదర్శిగా కె.సందీప్, సంయుక్త కార్యదర్శులుగా కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీవీ నాగార్జున, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రెండవ డివిజన్ కార్యవర్గం

రెండవ డివిజన్ అధ్యక్షుడిగా కె.శ్రీధర్, సహాధ్యక్షుడిగా ఎన్.రవి, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, కార్యదర్శిగా ఎం.విజయ్ కాంత్, కార్యాలయ కార్యదర్శిగా బి.కిరణ్ కుమార్ నాయక్, సంయుక్త కార్యదర్శులుగా ఎ.సాయికుమార్, ఇర్ఫాన్ బేగ్, కోశాధికారిగా ఎస్.వి.సత్యనారాయణ ఎన్నికయ్యారు.

మూడో డివిజన్ కార్యవర్గం

మూడో డివిజన్ అధ్యక్షుడిగా కె.ఆర్.ఎస్.గణేష్, సహాధ్యక్షుడిగా కె.హనుమాన్ బాబు, ఉపాధ్యక్షులుగా సి.హెచ్.ఎస్.మునికుమార్, పి.వేణుకుమారి, కార్యదర్శిగా ఎ.రవి, కార్యాలయ కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా పి.హఫీజ్ ఖాన్, జి.వి.సాయిప్రవీణ్, కోశాధికారిగా జి.మాణిక్యవీణ ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఎన్నికల అధికారులుగా సయ్యద్ జానీ బాషా, ఎస్.ఎల్.నరసింహారావు, ఎం.నాగరాజు వ్యవహరించారు. ఈ కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుంది. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర శాఖ కార్యదర్శి సుధాకర్, అధికారి జీఎస్వీ రత్నకుమార్, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి ఎండి ఇక్బాల్, నగర శాఖ అధ్యక్ష , కార్యదర్శులు సీహెచ్ శ్రీరామ్, కె.సంపత్ కుమార్ ఇతర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కృష్ణలంక(విజయవాడ తూర్పు): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు పీఎన్‌బీఎస్‌లో 45వ ప్లాట్‌ఫాం వద్ద ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతనిని గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12.30 గంటలకు మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ గుర్తించిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణే లక్ష్యం



నృత్యపోటీల న్యాయనిర్ణేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

విజయవాడ కల్చరల్: సంస్కృతి సంప్రదాయ పరిరక్షణ కోసం సంస్కార భారతి కృషి చేస్తోందని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. భరతముని జయంతి సందర్భంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు దుర్గాపురంలోని సంగీత కళాశాలలో ముగిశాయి. ముగింపు సభకు అధ్యక్షత వహించిన పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ లలిత కళల ద్వారా సమాజ సంఘటన కోసం పాటుపడేదే అఖిల భారత సాంస్కృతిక సంస్థ సంస్కార భారతిగా అభివర్ణించారు. పారిశ్రామికవేత్త కోగంటి సత్యం మాట్లాడుతూ మహోన్నతమైన భారతీయ సంస్కృతి పట్ల యువతకు అవగాహన కలిగిస్తున్న సంస్కారభారతి లక్ష్యాలను అభినందించారు. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలో విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారతి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్, విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కోగంటి జగన్నాథరావు, సమతా సేవా సమితి ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన పోటీలలో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఉరి వేసుకుని బాలిక మృతి



మృతిచెందిన పూజిత

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక, బాలాజీనగర్‌లోని సాయిబాబు గుడి వీధిలో స్వర్గం వెంకట దుర్గ జగదీష్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె పూజిత(16), కుమారుడు సాయి ఉన్నారు. పూజిత నగరంలోని శారదా కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతుండగా సాయి తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జగదీష్ తన కుమార్తె పూజితను కళాశాలలో దింపి భార్యతో కలిసి గన్నవరం మండలం, బావాజీ గూడెంలో బంధువుల ఇంటిలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లారు. పూజిత కళాశాల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి అక్కడ నుంచి సాయంత్రం 3 గంటలకు తన ఇంటికి వెళ్లింది. ఫంక్షన్‌కు వెళ్లిన జగదీష్, అతని భార్య భాగ్యలక్ష్మి సాయంత్రం 5.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చారు. పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూశారు. పూజిత ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

రామవరప్పాడు: తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై చర్చికి వెళుతున్న బాలికను లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాదకర సంఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధి నోవాటెల్ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాదంపాడు కోళ్లఫారం బజార్‌లో ఎస్.నాగబాబు, రాధిక దంపతులు నివసిస్తున్నారు. రాధిక ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా, నాగబాబు ఇంటి వద్ద ట్యూషన్లు చెబుతున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె పూనమ్ చౌదరి (12) గుణదలలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తల్లి రాధికతో కలిసి పూనమ్ చౌదరి ద్విచక్రవాహనంపై ఉదయం నిర్మల కాన్వెంట్ సమీపంలోని చర్చికి వెళుతుండగా నోవాటెల్ సమీపంలో వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పూనమ్ చౌదరి లారీ వెనుక చక్రాల కింద పడి తల ఛిద్రమై మృతిచెందింది. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, పటమట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



నున్నలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షరీఫ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. షేక్ నాగూర్ షరీఫ్(27) సూరంపల్లి వద్ద దుర్గా ప్యాకేజ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నున్న గ్రామంలో ఉంటున్న తన అక్క ఇంటికి ఆదివారం బైక్‌పై వెళుతుండగా ఓ కారు ఢీకొనడంతో షరీఫ్ కింద పడిపోయాడు. ఆ కారు వెనుకగా వస్తున్న మరో కారు కూడా అతి వేగంగా వచ్చి షరీఫ్‌ను ఢీకొనడంతో షరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన ప్రాంతానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో మృతదేహం కలకలం



ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఒడ్డుకు చేర్చిన మృతదేహం

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఫెర్రీ పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఆదివారం కలకలం సృష్టించింది. జాలర్లకు నదిలో మృతదేహం కనిపించగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిచారు. ఎస్ఐ పాపారావు నది వద్దకు చేరుకుని ఎస్డీఆర్ఎఫ్ బృందంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్పించారు. మృతుడు 55-60 ఏళ్ల వయస్సు కలిగి, బ్లూకలర్ ప్యాంట్, నిలువు, అడ్డగీతలు గల గ్రే కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. తెల్ల జుట్టుతో బట్టతల కలిగి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

మారణాయుధాలతో యువకులపై దాడి

ముగ్గురి పరిస్థితి విషమం



తీవ్రగాయాలైన ఆరిఫ్



తీవ్రగాయాలైన అఫ్రోజ్

తిరువూరు: స్థానిక బైపాస్‌రోడ్డు సెంటర్లోని చర్చి సెంటర్లో శనివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ముగ్గురు యువకులు కత్తిపోట్లకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే పాల్వంచకు చెందిన రమేష్ చారి కొద్దికాలంగా తిరువూరు తోకపల్లి సెంటర్లో నివసిస్తూ పూజలు చేయిస్తుంటాడు. ఆయన వద్ద తిరువూరుకు చెందిన అఫ్రోజ్, సయ్యద్, ఆరిఫ్ అనే యువకులు, దెందులూరు, నెల్లూరుల నుంచి వచ్చిన శ్రీకాకుళపు మహేశ్వరరావు, నరసింహారావు పూజల నిమిత్తం వస్తుంటారు. వీరంతా శనివారం రాత్రి మద్యం తాగారు. ఈ సందర్భంగా మాటా మాటా పెరిగి రాత్రి 12 గంటల సమయంలో బైపాస్‌రోడ్డుపై ఘర్షణ పడ్డారు. అఫ్రోజ్, సయ్యద్, ఆరిఫ్‌లను మహేశ్వరరావు, నరసింహారావు కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అపస్మారక స్థితిలో ఉన్న యువకులను తిరువూరు పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. గుప్త నిధుల తవ్వకం నేపథ్యంలోనే మాటామాటా పెరిగి ఈ దాడి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీలో డ్రింకింగ్ వాటర్ సెక్షన్‌లో పనిచేస్తున్న కందుల రాకేష్(22) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు నున్న పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాకేష్ నున్న గ్రామ పంచాయతీలో వాటర్ సెక్షన్‌లో పని చేస్తూ అమ్మమ్మ ఆళ్ళ రాజమ్మ ఇంట్లో ఉంటున్నాడు. రాజమ్మ బయటకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తలుపులు వేసి వున్నాయి. స్థానికుల సహాయంతో తలుపులు తీసి చూసే సరికి రాకేష్ ఇంట్లో ఉరివేసుకుని ఉన్నాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే రాకేష్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

1200 ఏళ్ల చరిత్రకు ఆనవాలు



ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న స్వామి వారి వాహనాలు



విజయవాడ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

- నగరంలోని బ్రాహ్మణవీధిలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఉన్న దేవదాయ ధర్మాదాయ శాఖ అధీనంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం వెయ్యేళ్ల చరిత్రకు ఆనవాలుగా నిలిచింది. బెజవాడ చారిత్రక నేపథ్యంలో ఒకటిగా భాసిల్లుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం తరతరాల చరిత్రను వివరిస్తూ భక్తుల పాలిట కొంగుబంగారమై భాసిల్లుతోంది. నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటిగా శ్రీవారి సన్నిధి నిత్యం భక్తులతో కోలాహలంగా దర్శనమిస్తుంది. కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దివ్య మంగళ స్వరూపం ఇక్కడి భక్తులకు మరింత మధురానుభూతులను పంచుతుంది. స్థానికంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత అంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది.

చాళుక్యుల శిల్ప శైలిలో ఆలయ నిర్మాణం

ఈ దేవస్థానం వెయ్యేళ్లకు పూర్వమే ఉన్నట్లు ఇక్కడ లభించే ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. నిర్దిష్టంగా ఈ ఆలయం ఎప్పుడు నిర్మాణం చేసినది ఎవరూ చెప్పలేకున్నా కొన్ని శాసనాల ఆధారంగా ఆలయ చరిత్రను దేవదాయ శాఖ అంచనా వేసింది. స్వామి వారి గర్భాలయ ముఖద్వారం, ముఖద్వారం లక్షణాలు, కుడ్యములు (గోడలు) మీద శిల్పాలు, సోమసూత్రం, కపోతబంధం, అధిష్టానం మొదలైన ప్రధాన అంశాలను పరిశీలిస్తే ఆలయం చాళుక్య శిల్పశైలిలో ఉన్నట్లు తెలుస్తోంది. స్వామి వారి ధ్రువమూర్తికి ఉన్న శిలాతోరణంలో శ్రీదేవి, భూదేవి విగ్రహాలు మలిచారు. సుందర శిల్ప శోభితమైన స్వామి వారి దివ్య విగ్రహం కాకతీయ శిల్ప శైలిని పోలి ఉంటుంది.

కొండపల్లిలో లభించిన విగ్రహం

పూర్వం కొండపల్లిలో రెండు వెంకటేశ్వరస్వామి వారి విగ్రహాలు లభించాయట. భక్తులు ఆ విగ్రహాలను మైలవరం తీసుకువెళ్లి అక్కడ ప్రతిష్ఠించుకోవాలని భావించారు. విగ్రహాలను ఎడ్లబండ్లపై ఎక్కించి ప్రయాణమవగా ప్రస్తుతం ఇక్కడ ఉన్న స్వామి వారి విగ్రహం ఉన్న బండి మైలవరం వైపు కదలలేదట. భక్తులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. స్వామి వారు ఆవేశ రూపంలో వేంచేసి తాను కృష్ణానది తీరంలో నివసించదలచినట్లు తెలియపరచగా స్వామి వారి ఆదేశానుసారం ఎడ్లబండిని విజయవాడ వైపు మరల్చగా అది సునాయసంగా తరలివచ్చింది. స్వామి వారి అభీష్టానుసారం ప్రస్తుతం ఉన్న దేవాలయంలో ప్రతిష్ఠ జరిగి నిత్యం సేవలందుకుంటున్నాడు.

ప్రాచీనాంధ్ర లిపిలో శాసనం

విజయవాడ చరిత్రకు సంబంధించి సుమారు 90 వరకూ శాసనాలు లభిస్తున్నాయి. వాటిలో ఎక్కువ శాసనాలు ఇంద్రకీలాద్రిపైన ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారికి సంబంధించినవే. ఆ శాసనాలన్నీ క్రీ.శ. 11 నుంచి 16వ శతాబ్దాలకు చెందినవిగా గుర్తించారు. ఇక్కడి స్వామి వారి గర్భాలయ ద్వారం రాతి కమ్మీ పైన ప్రాచీనాంధ్ర లిపిలో శాసనం ఒకటి కనిపిస్తుంది. ఈ శాసన లిపికి కొండ పైన లభించిన లిపి ఒకే విధంగా ఉండటంతో ఆ కాలంలో నిర్మాణం చేసిన ఆలయంగా ధ్రువీకరిస్తున్నారు. మిగిలిన ఉపాలయాలుగా ఉన్న పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు కాలానుగుణంగా ఏర్పాటు చేసినవిగా అర్చకస్వాములు చెబుతున్నారు. ఇక్కడ ఆలయంలో పండిత శ్రీమాన్ పరాశరం వెంకటరామాచార్యులు వంశీకులు శ్రీ వైఖానస ఆగమోక్తంగా పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చరిత్ర వివరిస్తుంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆలయంలో మాఘమాసంలో స్వామి వారికి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆ క్రమంలో ఈ నెల 19వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. స్వామి వారు గరుడ, హనుమత్, గజ, శేషవాహనం, అశ్వత్ వాహనాలతో పాటుగా రథంపై ఊరేగుతూ రోజుకొక వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 22వ తేదీన స్వామి వారికి విశేష కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. వాటితో పాటుగా కృష్ణానదిలో చక్రార్చన, పుష్పయాగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

సర్వీస్ రోడ్డులో గడ్డర్ల ఏర్పాటు



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 15, 16 డివిజన్లలో సర్వీస్ రోడ్డులో ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. రహదారికి రెండు వైపులా నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గడ్డర్లను ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని బోర్డులు పెట్టారు. గత కొంతకాలంగా సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా నెలల తరబడి భారీ వాహనాలను ఉంచేవారు. దీంతో ఈ రహదారిన ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపించే విధంగా నగరపాలకసంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా డివిజన్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారామ కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న విగ్రహ పునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం మండప దేవతా హోమాలు, మూలమంత్ర హోమాలు, చండీహోమం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, శ్రీరామ శ్రీహనుమన్మహ మంత్ర హవనం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా జరిపారు. కార్యక్రమాల్లో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయ కార్యదర్శి జి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజశ్యామలాదేవి అలంకారంలో కాళీమాత



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు భక్తులకు రాజశ్యామలాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు రాజశ్యామలా దేవి హోమం నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పూర్ణా హుతి సమర్పించారు. అరుణ పారాయణ సూర్య నమస్కారాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- న్యూ బ్రిడ్జి వద్ద అండర్ పాస్ పనులకు నేడు శంకుస్థాపన
- వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చర్యలు
- రామలింగేశ్వరనగర్, పటమటలంక, ఫకీరుగూడెం వాసులకు ప్రయోజనకరం
- దేవినేని అవినాష్ చొరవతో తీరిన సమస్య



అండర్ పాస్ ఏర్పాటుకు అధికారులతో కలిసి పరిశీలిస్తున్న దేవినేని అవినాష్(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): పటమటలంక, రామలింగేశ్వరనగర్ ప్రజలు నగరంలోకి రావాలంటే పడే ట్రాఫిక్ ఇబ్బందులకు పెద్ద రిలీఫ్ లభించనుంది. ఇక నుంచి వారు బెంజిసర్కిల్ మీదుగా కాకుండా, ట్రాఫిక్ కష్టాలు తొలగిపోయేలా ఫకీరుగూడెం వద్ద న్యూ బ్రిడ్జి కింద అండర్ పాస్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించిన పనులను సోమవారం వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీంతో 50 వేల మంది జనాభాకు పెద్ద ఉపశమనం లభించనుంది.

రూ.20 లక్షలు కేటాయింపు..

పటమటలంక, ఫకీరుగూడెం, రామలింగేశ్వరనగర్ ప్రజలు వారి ట్రాఫిక్ కష్టాలను దేవినేని అవినాష్ దృష్టికి తెచ్చారు. ఏమి చేస్తే ఆ సమస్య పరిష్కారం అవుతుందో కూడా ఆయనకు వివరించారు. వెంటనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నగరపాలక సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులను పిలిపించి అండర్ పాస్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవినాష్ ఆదేశాలతో నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో అండర్‌పాస్ ఏర్పాటుకు తీర్మానం చేయడంతో పాటు అవసరమైన నిధులు రూ.20 లక్షలు కేటాయించడంతో పాటు, సోమవారం పనులను ప్రారంభించనున్నారు. దేవినేని అవినాష్ చొరవతో అధికారులు కదిలారు.

పై ఓవర్ల నిర్మాణంతో..

గతంలో పటమటలంక నుంచి ప్రజలు నగరంలోకి వచ్చేందుకు న్యూ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై దారి ఉండేది. దీంతో బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా రామలింగేశ్వరనగర్, పటమట లంక ప్రాంతాలకు చెందిన వారు నగరంలోకి వచ్చేవారు. జాతీయ రహదారి విస్తరణ, పై ఓవర్ల నిర్మాణంతో వారికి దారిలేకుండా పోయింది. దీంతో పటమట లంక, రామలింగేశ్వరనగర్ ప్రజలు నగరంలోకి వచ్చేందుకు బెంజిసర్కిల్ మీదుగా రావాల్సి వస్తుంది. దీంతో తీవ్రమైన ట్రాఫిక్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. తమకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా అండర్ పాస్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా, అవినాష్ చొరవతో పరిష్కారం కానుంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం..



నియోజకవర్గంలో నిరంతరం పర్యటిస్తూ, వారి సమస్యలు తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా నాలుగున్నరేళ్లుగా పనిచేస్తున్నా. పటమటలంక ప్రాంతంలో పర్యటించిన సమయంలో అండర్‌పాస్ విషయం నా దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించా. కార్పొరేషన్ కౌన్సిల్‌లో తీర్మానం అనంతరం పనులు ప్రారంభించనున్నాం. నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో రూ.650 కోట్లు అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ పథకాలను డీబీటీ ద్వారా రూ.900 కోట్లు ప్రజలకు అందించాం. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నా.

– దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి

సామాన్యులకు నాణ్యమైన వైద్యం



లక్ష్మీ ఫౌండేషన్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వైద్యులు చదలవాడ నాగేశ్వరరావు, సుధ, అబ్బూరి శారద

లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్పొరేట్ వైద్యం అత్యంత ఖరీదైన తరుణంలో సామాన్యులను నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు లక్ష్మీ ఫౌండేషన్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ యూరాలజిస్ట్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. వెటర్నరీకాలనీ వినాయక్ థియేటర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీఫౌండేషన్ ఆస్పత్రిని ఆదివారం డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ చదలవాడ సుధలు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా భావంతో ఆస్పత్రిని ఏర్పాటు చేసి, నామమాత్రపు ఫీజులు వసూలు చేయడం మంచి పరిణామమన్నారు. లక్ష్మీ ఫౌండేషన్ ట్రస్టీ అబ్బూరి శారద మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఏడాదిన్నర కిందట లయోలా కళాశాల రోడ్డులో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. గైనకాలజీ, డయాబెటాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తామని తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

సాహిత్య, సంగీత స్రష్ఠ రామరాజ భూషణుడు



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు, గీతాంజలి దేవి, కోటంరాజు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సాహిత్యంలోనే కాకుండా సంగీతంలోనూ ప్రావీణ్యం గల రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) సాహిత్య, సంగీత స్రష్ఠ అని విజయవాడ సెంట్రల్, పశ్చిమ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీరామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ 40వ వార్షికోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్మించిన రామరాజ భూషణుని విగ్రహాన్ని ఆదివారం ఏపీ భట్టురాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి ఆవిష్కరించారు. అనంతరం కళాక్షేత్రం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లాది, వెలంపల్లి పాల్గొని మాట్లాడారు. భట్టురాజు సామాజికవర్గానికి చెందిన మెరిట్, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కూరపాటి కోటంరాజు అభినందనీయులన్నారు. అదే విధంగా సంఘసేవకులు, సాహితీవేత్తలు, కళాకారులు, విద్యావేత్తలను గౌరవించి సత్కరించటంతో పాటు పారితోషకాలు ప్రదానం చేస్తూ సమాజంలో మంచి విద్య, సాంస్కృతిక, సేవ ట్రస్ట్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. సినీ గేయ రచయిత రసరాజు మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్ట దిగ్గజ కవుల్లో ప్రత్యేక పాత్రను పోషించటంతో పాటు అనేక గ్రంథాలను రచించిన రామరాజ భూషణుడు చిరస్మరణీయుడన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రామరాజ భూషణునిగా ప్రసిద్ధి చెందిన భట్టుమూర్తి శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయల ఆస్థానానికి ఆభరణం మాదిరిగా ఉండటం వలన ఆయనకు రామరాజ భూషణుడిగా పేరు వచ్చిందని గుర్తు చేశారు. ఆయన 16వ శతాబ్దానికి చెందిన తెలుగు కవి, సంగీత విద్వాంసుడని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్‌ల అందజేత..

కార్యక్రమ నిర్వాహకులు, శ్రీరామరాజ భూషణ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఏపీ భట్టురాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులకు విద్యను బోధించటంతో పాటు పేద విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.30 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. కరోనా కష్ట కాలంలో పేద విద్యార్థుల ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.5 లక్షలు అందించామన్నారు. ట్రస్ట్ ట్రెజరర్ పి.జయప్రకాష్ రాజు, ఏపీ భట్టురాజు సంఘం మహిళా అధ్యక్షురాలు లోలభట్టు అనసూయ దేవి, జనరల్ సెక్రటరీ భట్టు మనోహర కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, యువజన సంఘం అధ్యక్షుడు కాసుల రాజా శ్రీధర్ రాజు, ఎల్.శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



ఇస్త్రీ బండిని అందజేస్తున్న దేవినేని సుధీర, యలమంచిలి జయప్రకాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటే అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర చెప్పారు. గడప గడపకు మీ అవినాష్ కార్యక్రమం 8వ డివిజన్ పరిధిలో పాత ఐదో నంబరు బస్సు రూట్‌లో ఆదివారం జరిగింది. రూ.25 వేలు విలువ చేసే ఇస్త్రీ బండిని వైఎస్సార్‌సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎస్ఆర్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ సాయి రెసిడెన్షియల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆర్.ప్రకాష్‌రావు కుటుంబానికి సుధీర చేతుల మీదుగా అందజేశారు. డివిజన్ నాయకులు కొల్లి రవి, కొసరాజు అనురాధ, తుమ్మల మల్లిఖార్జున రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి

ఆటోనగర్(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా, వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. ఆటోనగర్‌లోని జమాక్ భవన సముదాయంలో ఆదివారం గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం జరిగింది. జమాక్ భవన సముదాయంతో పాటు 8వ డివిజన్ తదితర ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 11, 8వ డివిజన్ల ఇన్‌చార్జిలు పర్వతనేని పవన్‌కుమార్ (బాబి), యలమంచిలి జయప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు ముసునూరు సుబ్బారావు, జమాక్ హౌసింగ్ అధ్యక్షుడు త్రిపురనేని నాగచంద్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గ నృత్య మందిరానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు సహస్ర, కావ్యశ్రీ, తన్వి, ధరణి, హారిషిత, నందినిలతో పాటు మరి కొందరు చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. విజయవాడకు చెందిన కెజే.మోహిని బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కళావేదికపై విజయవాడకు చెందిన జి.గౌరీ, రాజ్యలక్ష్మి, జగన్మోహని, అభిరామ్‌లు పలు కీర్తనలను ఆలపించారు.

బహుమతుల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆత్మబంధు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ విజేతలకు ఆదివారం సీవీఆర్ స్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. టాలెంట్ టెస్ట్‌లో వి.శ్యామ్‌శరత్‌బాబు ప్రథమ, ధాత్రిశ్రీ లక్ష్మి ద్వితీయ, ఎం.కీర్తి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వీరికి నగదు బహుమతులు అందజేశారు.

బెజవాడ అక్కచెల్లెమ్మలకు ఆసరా

- మూడు నియోజకవర్గాల్లో రూ.322 కోట్ల మేర మాఫీ
- విజయవాడలో 92,980 మంది అక్కచెల్లెమ్మలకు మేలు
- జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారంటున్న మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటికి ఇల్లాలే వెలుగు.. అలాంటి మహిళామణులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోంది. అక్కచెల్లెమ్మల జీవితాలకు వెలుగులు తెచ్చింది. విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల్లో వేలాది మంది మహిళలకు ఆసరా అండగా నిలిచింది. ఎన్నికల హామీల్లో భాగంగా డ్వాక్రా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసి మాటను నిలబెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, వంటి పథకాలతో మహిళలు సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నారు. విజయవాడ నగరంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.322.80 కోట్లను మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 9,418 గ్రూపులకు చెందిన 92,980 మంది సభ్యులు లబ్ధి పొందారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి(ఫైల్)

చంద్రబాబు హయాంలో దగా

పొదుపు మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నమ్మబలికాడు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నెరవేర్చకుండా మొండిచేయి చూపారు. పొదుపు మహిళలు చంద్రబాబు మాటలను నమ్మి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఎగవేతదారులుగా మిగిలారు. దీంతో పొదుపు సంఘాల మహిళలకు టీడీపీ ప్రభుత్వ హయాంతో బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు చేసిన మోసానికి అక్కచెల్లెమ్మలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాలకు తిరిగి జీవం పోసింది. మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకునేలా బాటలు చేసింది. సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకు సున్నావడ్డీ పథకం అమలు చేస్తూ భరోసా ఇచ్చింది.

విజయవాడ మూడు నియోజకవర్గాల్లో జరిగిన డ్వాక్రా రుణమాఫీ

నియోజకవర్గం	సంఘాలు	సభ్యుల సంఖ్య	మొత్తం
పశ్చిమ	2,783	27,352	81,63,01,001
సెంట్రల్	3,394	33,427	115,85,83,162
తూర్పు	3,241	32,201	125,31,54,100
మొత్తం	9,418	92,980	322,80,38,263

నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు

రాష్ట్ర ప్రజలందరి అభ్యున్నతితో పాటు మహిళలు ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రజా సంకల్పయాత్ర సమయంలో 2019 ఏప్రిల్ నాటికి పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని అప్పటిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళలకు రుణమాఫీని అమలు చేసి భరోసా ఇచ్చారు. ఒక వైపు సున్నా వడ్డీ రుణాలు, మరో వైపు రుణమాఫీ అమలు చేసి వారి సంక్షేమానికి తోడ్పడ్డారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలలు ముందుగానే ఈ రుణ మాఫీ హామీని పక్కాగా అమలు చేసిన సీఎంగా అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారు.

మా జీవితాల్లో వెలుగు..



నేను పొదుపు సంఘ సభ్యురాలిని. సీఎం జగనన్న అందించిన వైఎస్సార్ ఆసరా నగదుతో మా జీవితాలకు వెలుగు వచ్చింది. నాలుగు విడతల్లో మా గ్రూప్‌కు రూ.6.48 లక్షలు మా బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు మద్దతిస్తాం.

– ఏ.సుజాత, షిర్డీ సాయి స్వయం సహాయక సంఘం, విజయవాడ

ఇచ్చిన హామీ ప్రకారం..



గతంలో చంద్రబాబు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు కానీ అమలు చేయలేదు. దీంతో వడ్డీలు కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారు.

– షేక్ అఫ్రిఫాన్, శ్రీ భగవాన్, పొదుపు సంఘం, విజయవాడ

మహిళలకు మేలు చేసే ప్రభుత్వం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం మాకు మేలు చేసేవిగా ఉన్నాయి. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారు. వడ్డీ కూడా చెల్లించారు. నాలుగు విడతల్లో రూ.5.76 లక్షలు మా గ్రూప్‌కు సంబంధించిన మహిళల ఖాతాల్లో జమ అయ్యింది.

– పి.ఉమాదేవి, శ్రీ దుర్గా మహిళా పొదుపు సంఘం



శాస్త్రోక్తం..

కుంభాభిషేకం

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి కుంభాభిషేక మహోత్సవాన్ని దేవస్థానం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించింది. నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ తాపడ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, హోమాలను జరిపారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కెఎస్.రామారావు, ఎమ్మెల్యే విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట శ్రీకల్యాణ షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం వినాయకుడు, షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గణపతి హోమం, లక్ష్మీగణపతి, నవగ్రహ, గురుదత్తాత్రేయ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


రాప్తాడులో 'సిద్ధం' సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

మంచి పాలనకు మళ్లీ సిద్ధం

సంక్షేమంతో కోట్లాది గుండెల తలుపు తట్టాం

మన పథకాల గురించి ఒక్కొక్కరూ వంద మందికి చెప్పాలి

రాప్తాడు సభలో ముఖ్యమంత్రి జగన్ పిలుపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: విశ్వసనీయతకు–వంచనకు మధ్య జరగబోతున్న ఎన్నికల యుద్ధంలో పేదవాడి భవిష్యత్ కోసం వారి తరఫున నిలబడటానికి మీరంతా సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ యుద్ధం.. వేరే రాష్ట్రంలో ఉంటూ మోసం చేసేందుకు అప్పుడప్పుడూ మన రాష్ట్రానికి వచ్చిపోతున్న నాన్ రెసిడెంట్స్ ఆంధ్రాస్‌కు, ఈ గడ్డమీదే పుట్టి ఇక్కడే ఇల్లు కట్టుకుని ప్రజల మధ్యే ఉన్న మనకూ మధ్య జరగబోతోందన్నారు. మనందరి ప్రభుత్వం 57 నెలలుగా అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకుంటూ వాటిని రద్దు చేయడమే లక్ష్యంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

బాబు మార్కు ఎక్కడైనా ఉందా?

ఈ వేదిక నుంచి చంద్రబాబుకు ఒక సవాల్ విసురుతున్నా. మీరు 14 ఏళ్లు పరిపాలన చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నారు. కానీ మీ పేరు చెబితే రైతులకు గుర్తుకొచ్చే ఒక్కటైనా పథకం ఉందా? మీ పేరు చెబితే అక్కచెల్లెమ్మలకు గుర్తుకొచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? మీ పేరు చెబితే విద్యార్థులకు గుర్తొచ్చే పథకం ఏదైనా ఉందా? మీ పేరు చెబితే కనీసం అవ్వాతాతలకైనా కూడా మమ్మల్ని బాగా చూసుకున్నాడు.. మా పెన్షన్ మా ఇంటికే పంపాడనే పరిస్థితి ఏనాడైనా ఉందా? చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఫలానా మంచి చేశాడని చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్క పథకం కూడా గుర్తుకురాదు. చంద్రబాబు పేరు చెబితే ఏ ఒక్క గ్రామంలోనైనా ఏర్పాటు చేసిన పరిపాలన వ్యవస్థ ఒక్కటైనా కనిపిస్తుందా? బాగుపడిన స్కూళ్లు, ఆస్పత్రులు ఏ గ్రామంలోనైనా ఉన్నాయా? కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలోనైనా సరే మీ మార్క్ ఉందా చంద్రబాబూ? పథకాలను పక్కనపెడితే చంద్రబాబు పేరు చెబితే సామాజిక న్యాయం ఏ ఒక్కరికైనా గుర్తుకు వస్తుందా? మేనిఫెస్టోకు రంగులు పూసి ప్రతి సామాజికవర్గాన్ని మోసం చేయడం చంద్రబాబుకు ఆనవాయితీ. ఏనాడైనా కనీసం 10శాతం వాగ్దానాలను అమలు చేశారా? బంగారు కడియం ఇస్తానంటూ ఊబిలోకి దింపి మనుషుల్ని తిన్న పులి మాదిరిగా మరోసారి ఎర వేస్తున్నాడు. అబద్ధాలు చెప్పేటప్పుడు భావ దారిద్ర్యం ఎందుకన్నది బాబు నైజం. నమ్మినవాడు మునుగుతాడు.. నమ్మించినవాడు దోచుకోగలుగుతాడన్నది ఆయన సిద్ధాంతం. చంద్రబాబు వాగ్దానాలన్నీ మోసాలేనని ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. బాబు మోసాల్ని భరించలేకే కదా ఐదేళ్ల క్రితం అన్ని సామాజికవర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలంతా చొక్కా మడతేసి కుర్చీని లాగేసి చీపుర్లతో ఊడ్చి ఆయన పార్టీని శాసనసభలో 102 నుంచి 23కు తగ్గించారు. అదే పని మరోసారి చేయడానికి, చొక్కాలు మడత వేయడానికి మీరంతా సిద్ధంగా ఉండాలి.

లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు

మన ప్రభుత్వ హయాంలో పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం మనకు స్టార్ క్యాంపెయినర్‌గా బయటకు రావాలి. వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాల్సిన అవసరాన్ని చెప్పాలి. మనం చేసినవి తెలియజేస్తూ వాటి కొనసాగింపు ఎంత అవసరమో ప్రతి ఇంటికీ వివరించాలి. ఒక్కసారి అధికారం ఇస్తేనే ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా గ్రామాల్లో రైతన్నను చేయి పట్టుకుని నడిపించే ఆర్బీకే వ్యవస్థను తెచ్చి తోడుగా నిలిచాం. సాగుకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చాం. ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోగానే రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వటం మొదలు పెట్టింది మీ బిడ్డ ప్రభుత్వమే. ఉచిత పంటల బీమా ఇస్తున్నది కూడా మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే. ఈ పథకాలన్నీ కొనసాగాలన్నా, బాబు మార్క్ దళారీ వ్యవస్థ మళ్లీ రాకూడదన్నా ప్రతి రైతన్న మన స్టార్ క్యాంపెయినర్‌గా ముందుకొచ్చి ఇంకో వంద మందికి చెప్పాల్సిన అవసరం ఉంది. విందు భోజనం, బిర్యానీ పెడతానంటూ ఆశ చూపించి చంద్రబాబు ఇప్పుడు మనం పెడుతున్న అన్నాన్ని, గిన్నెను లాక్కోవడానికి అడుగులు వేస్తున్నాడు. గతంలో ఇదే పెద్దమనిషి రూ.87,612 కోట్ల రుణ మాఫీని ఓ మోసంలా ఎలా మార్చాడో ప్రతి రైతన్నకూ గుర్తుచేయాలి. అమ్మ ఒడి, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్లపట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, దిశ యాప్, మహిళా పోలీస్.. ఇవన్నీ గతంలో ఎప్పుడూ జరగని విధంగా మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే జరుగుతున్నాయి. ఇవన్నీ ప్రతి అక్కచెల్లెమ్మకు కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, మరో వంద మందితో ఓటు వేయించాల్సిన బాధ్యత ఉందని మీరంతా చెప్పాలి.

ఏ గ్రామానికైనా వెళదాం..

ఇవాళ రాష్ట్రంలోని ఏ గ్రామానికి వెళ్లి నిల్చున్నా ఓ విలేజ్ సెక్రటేరియట్ కనిపిస్తుంది. పది మంది శాశ్వత ఉద్యోగులు కనిపిస్తారు. నాలుగడుగులు ముందుకేస్తే ఆర్బీకే కనిపిస్తుంది. మరో నాలుగు అడుగులు వేస్తే విలేజ్ క్లినిక్, కడుతున్న డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తాయి. నాడు–నేడుతో రూపురేఖలు మారిన బడులు, హాస్పిటల్స్ కనిపిస్తాయి. ప్రతి 50–60 ఇళ్లకు చేయి పట్టుకొని నడిపించే మంచి వలంటీర్ వ్యవస్థ ఉంది. ఇవన్నీ ఈ 57 నెలల కాలంలోనే జరిగాయి. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలో ఆగి చూసినా, ఏ సామాజికవర్గాన్ని పలుకరించినా మీ జగన్ చేసిన అభివృద్ధి కనిపిస్తుంది. ప్రజలు మనను మొదటిసారి ఆశీర్వదిస్తేనే దేవుడి దయతో ఇంత మంచి చేయగలిగాం. సెకండ్ టైమ్, థర్డ్ టైమ్, ఫోర్త్ టైమ్ ఆశీర్వదిస్తే ఇక ఎంత మంచి జరుగుతుందో ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి.

'నా' వాళ్లకు గరిష్టంగా లబ్ధి

అణగారిన వర్గాలను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు, నా నిరుపేద వర్గాలంటూ చరిత్రలో చూడని విధంగా నామినేషన్ పనులు, కాంట్రాక్టుల్లో 50 శాతం చట్టం చేసి మరీ ఇస్తున్నది ఎవరంటే మీ జగన్ అని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. మీ జగన్ బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేసిన రూ.2.55 లక్షల కోట్లలో 75 శాతం 'నా..' అని ఆప్యాయంగా పిలుచుకునే వర్గాలకే ఇచ్చాడు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలుంటే ఈ 57 నెలల పాలనలోనే ఏకంగా 2.13 లక్షల ఉద్యోగాలు కొత్తగా ఇచ్చాం. ఆ ఉద్యోగాల్లో 80 శాతం నా ఎస్సీలు, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు, నా నిరుపేద వర్గాలకే దక్కాయి. ఇంతటి సామాజిక న్యాయం మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే కనిపిస్తోంది. 35 లక్షల ఎకరాలపై అనుభవదారులు, గిరిజనులు, రైతన్నలు, నిరుపేదలకు సర్వహక్కులు ఇచ్చింది ఎవరంటే మీ జగనే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో సింహభాగం వాటా దక్కింది మీ జగన్ వచ్చాకే. చంద్రబాబుకు ఓటేయడం అంటే సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఓటేయడమే. డీబీటీకి వ్యతిరేకంగా ఓటు వేయడమే. ఈ విషయాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి. మీరంతా గతంలో చంద్రబాబు పాలన చూశారు. ఇంకా చాలామంది పరిపాలన చూశారు. కానీ మేనిఫెస్టోను 99శాతం అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తున్నది మీ జగన్ మాత్రమే. మొదటి చాన్స్ ఇస్తేనే మీ జగన్ ఇంత గొప్పగా అన్ని వర్గాలనూ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నాడు. మరి మూడుసార్లు సీఎంగా, 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయాడని ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటికీ వెళ్లి అడగండి.



మీ జగన్ పేరు చెబితే..

మీ జగన్ పేరు చెబితే.. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, విద్యాకానుక, గోరుముద్ద, బాగుపడ్డ పాఠశాలలు, బైజూస్ కంటెంట్, బైలింగ్యువల్ బుక్స్, ట్యాబ్‌లు, డిజిటల్ బోధనతో ఐఎఫ్‌పీ ప్యానళ్లు, తొలిసారిగా సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టోఫెల్ శిక్షణ, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం గుర్తొస్తాయి. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యా దీవెన, వసతి దీవెన, జాబ్ ఓరియెంటెడ్‌గా కరిక్యులమ్‌లో మార్పులు, ఆన్‌లైన్ వర్టికల్స్ చదువులతో అనుసంధానం.. ఇవన్నీ తల్లిదండ్రులకు వివరించాలి. ఇవన్నీ కొనసాగాలంటే, పిల్లలు అనర్గళంగా ఇంగ్లిషులో మాట్లాడాలంటే, పెత్తందార్ల పిల్లలతో పోటీ పడే పరిస్థితి రావాలంటే మీ అన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే జరుగుతుందని చెప్పండి. ఇవాళ ఒకటో తరగతిలో ఉన్న పేదింటి పాప, పేదింటి బాబు మరో 10–15 ఏళ్లలో అంతర్జాతీయ చదువులతో గొప్ప ఉద్యోగాలు సాధించాలంటే మీ అన్న ప్రభుత్వం మాత్రమే చేయగలుగుతుందని ప్రతి ఇంటికీ చెప్పండి. సైకిల్‌కు ఓటేయడం అంటే గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియం రద్దుకు ఓటేస్తున్నామని గుర్తు పెట్టుకోవాలి. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దే రూ.3 వేల పెన్షన్లు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో పెరగాలన్నా, కొందరికే పింఛన్లు ఇచ్చిన రోజులు మళ్లీ రాకూడదన్నా, లంచాల జన్మభూమి కమిటీలు కాటేయకూడదన్నా ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. ఇవాళ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరినీ సేవలతో విస్తరించిన ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాలు, ఆరోగ్య ఆసరా, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష ఆదుకుంటున్నాయి. వీటి పేరు వింటే కోవిడ్ కష్టకాలంలో అందించిన సేవలు గుర్తుకొస్తాయి. పేదలు వైద్యం కోసం అప్పులపాలు కాకూడదన్నా, గడపగడపకూ వైద్యం అందించే పరిస్థితి కొనసాగాలన్నా లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా ముందుకు రావాలని కోరాలి.

57 నెలల్లో మీకోసం 125 సార్లు బటన్లు

ఈ 57 నెలల్లో నేను ప్రజల కోసం 125 సార్లు బటన్లు నొక్కా. ఏకంగా రూ.2.55 లక్షల కోట్లు నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాలకు వెళ్లాయి. ఇంత మంచి చేసిన మనందరి ప్రభుత్వానికి మద్దతుగా, ఈ పాలనకు కొనసాగింపుగా ప్రతి కుటుంబం, ప్రతి ఒక్కరూ మంచి భవిష్యత్ కోసం రెండు బటన్లు నొక్కాలని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. ఒకటి అసెంబ్లీకి, ఒకటి పార్లమెంటుకు. ఫ్యాన్ మీద నొక్కితే మీరు గత ఎన్నికల్లో బటన్ నొక్కి పెట్టెలో బంధించిన చంద్రముఖి బెడద శాశ్వతంగా పోతుంది. పొరపాటు చేశారంటే చంద్రముఖి మళ్లీ సైకిలెక్కుతుంది. టీ గ్లాస్ పట్టుకొని మీ ఇంటికొస్తుంది. పేదల రక్తం తాగేందుకు లకలకా అంటూ మీ ఇంటి తలుపులు తడుతుందని ప్రతి అక్కకూ, ప్రతి చెల్లెమ్మకూ చెప్పండి.

మీకు మంచి జరిగితే నాకు ఓటేయండి

మన పాలనలో మీకు మంచి జరిగితే నాకు ఓటు వేయండి అని, మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడాలని మనం నిబద్ధతతో సిద్ధం అంటుంటే ఏ ఒక్కరికైనా ఏం చేశారో చెప్పుకొనేందుకు ఒక్కటీ కనిపించని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారు. మేమూ సిద్ధం.. సంసిద్ధం అంటూ చంద్రబాబు పోస్టర్లు వేయిస్తున్నారు. ప్రజలకు మంచి చేయకుండా దేనికయ్యా సంసిద్ధం? ఎందుకు సంసిద్ధం? ఎవరితో యుద్ధం? పెత్తందార్ల తరఫున చంద్రబాబు సంసిద్ధం అంటున్నాడంటే ఎవరితోనయ్యా నువ్వు యుద్ధం చేస్తున్నావ్?

కృష్ణుడిలా కోట్ల గుండెలు తోడున్నాయి..

దుష్ట చతుష్టయం బాణాలకు బలి కావడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు. ఇక్కడ ఉన్నది అర్జునుడు. ఆ అర్జునుడికి తోడుగా కృష్ణుడి రూపంలో ప్రతి పేదవాడి ఇంట్లో కోట్ల గుండెలున్నాయి. ప్రజలే అండగా, ప్రజలతోనే పొత్తులతో ఎన్నికల పోరాటానికి మీ బిడ్డ సిద్ధం. ఇది మీ అందరి పార్టీ. జగన్‌ను నమ్మిన వారికి, పార్టీ కోసం కష్టపడిన వారికి అంచెలంచెలుగా అవకాశాలు ఇచ్చిన ఏకైక పార్టీ మన వైఎస్సార్‌సీపీ. ప్రతి కార్యకర్తకూ మీ అన్న జగన్ ఎల్లప్పుడూ తోడుగా ఉంటాడని తెలియజేస్తున్నా. ప్రతి కార్యకర్త, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరికీ మరో రెండు మెట్లు ఎక్కే అవకాశం కల్పించే బాధ్యత నాది. మా నాయకుడు మాటిచ్చాడంటే చేస్తాడంతే అని ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి చెప్పుకునేలా ఉండాలి. 99 శాతం వాగ్దానాలు అమలుచేసి ప్రతి ఇంటికీ వెళ్లి మేనిఫెస్టో చూపించి మరీ ప్రజల ఆశీస్సులు కోరుతున్న పార్టీ మనదే. అందుకే ఎన్నికల్లో 175కు 175 మన టార్గెట్. మన టార్గెట్ 25కు 25 ఎంపీ సీట్లు. పరిపాలనలో మనం ఎక్కడా తగ్గలేదు. మనకు ఒక్క ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ తగ్గేందుకు వీలేలేదు.


మరో 55 రోజుల్లో

మరో రెండు నెలల్లోనే ఎన్నికలు. ఈరోజు నుంచి చూస్తే మరో 55 రోజులు కూడా ఉండవేమో. చంద్రబాబు అబద్ధాలు, ఈనాడు, ఏబీఎన్, టీవీ5, ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ఎదుర్కొంటూ పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మీరంతా సిద్ధంగా ఉండాలి. చీకటి రాతల్ని, చీకటి పనుల్ని బట్టబయలు చేసేందుకు సంసిద్ధంగా ఉండాలి. మీరంతా సెల్‌ఫోన్ టార్చిలైట్లు వెలిగించి సిద్ధమే అని చెప్పండి. ప్రతి కార్యకర్త, బూత్ కమిటీ సభ్యులు, వలంటీర్లు, గృహ సారథుల పాత్ర అత్యంత కీలకం. సమరభేరి మోగిద్దాం.. సమరనాదం వినిపిద్దాం. చంద్రబాబుకు ఇప్పటికే 75 ఏళ్లు. ఎన్నికలు అయిపోయిన తర్వాత చంద్రబాబు వయసు 80కి చేరుతుంది. ఎన్నికల తర్వాత టీడీపీ రూపురేఖలు ఎక్కడా కనిపించవు. ఈ ఎన్నికలు చాలా కీలకం కావడంతో పెత్తందార్లంతా ఏకం అవుతున్నారు. వీరంతా సరిపోరని జాతీయ పార్టీలతో పరోక్షంగా ఒకరితో, ప్రత్యక్షంగా మరొకరితో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారు. ఒకే ఒక్కడిపై యుద్ధం చేయడానికి ఇన్ని తోడేళ్లు ఏకం అవుతున్నాయి. ఈ తోడేళ్లను ఎదుర్కోవాలంటే మీ జగన్ ఒక్కడికే సాధ్యం కాదు. మీ జగన్‌కు ప్రతి గుండె తోడుగా నిలబడాలి. ప్రతి ఇంట్లో అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, తల్లీతండ్రీ, ప్రతి రైతన్న మీ జగన్‌కు తోడుగా స్టార్ క్యాంపెయినర్లుగా బయటకు రావాల్సిన అవసరం ఉంది. మీరు వేసే ఓటు పేదవాడి భవిష్యత్‌ను, జీవితాన్ని నిర్ణయించే ఓటు అవుతుంది. పొరపాటు జరిగిందంటే పేదవాడి బతుకులు అతలాకుతలం అవుతాయి.

మీకెందుకు ఓటేయాలి బాబూ?

జగన్ మార్కు ప్రతి గ్రామంలో కనిపిస్తున్నప్పుడు, ప్రతి పేద ఇంట్లో, ప్రతి సామాజికవర్గంలో, ప్రతి ప్రాంతంలో మంచి మార్పు కనిపిస్తున్నప్పుడు బాబుకు ఎందుకు ఓటు వేయాలని అడుగుతున్నా. జగన్ పాలనలో ప్రజలకు మంచి చేయలేదని, జగన్‌కు ప్రజాబలం లేదని చంద్రబాబు నిజంగా నమ్మితే ఇన్ని పొత్తులు ఎందుకయ్యా చంద్రబాబూ? అని అడుగుతున్నా. ఊతం కోసం అటో కర్ర, ఇటో కర్ర ఎందుకయ్యా? సైకిల్ తోయడానికి నీకొక ప్యాకేజీ స్టార్ ఎందుకయ్యా? జగన్ ప్రతి ఇంటికీ మంచి చేశాడని తెలుసు కాబట్టే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.


రాప్తాడు 'సిద్ధం' సభలో విల్లును ఎక్కుపెట్టిన సీఎం వైఎస్ జగన్


రాప్తాడులో 'సిద్ధం' సభ కోసం తరలివచ్చిన జనసందోహం, వాహనాల్లో ఓ భాగం

ట్రెండింగ్‌లో 'సిద్ధం'



'ఎక్స్'లో దేశంలోనే మొదటి స్థానంలో 'సిద్ధం' హ్యాష్ ట్యాగ్

- సామాజిక మధ్యమాల్లో కొనసాగిన సీఎం జగన్ హవా
- ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సభ విశేషాలు
- ఎప్పటికప్పుడు పోస్టులతో హోరెత్తించిన అభిమానులు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభ సోషల్ మీడియా (సామాజిక మధ్యమాలు)లో ట్రెండింగ్‌లో నిలిచింది. ఎక్స్(ట్విట్టర్)లో దేశంలోనే మొదటి స్థానంలో 'సిద్ధం' హ్యాష్ ట్యాగ్‌తో ట్రెండ్ అయింది. సిద్ధం సభ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ అభిమానులు భారీ ఎత్తున ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు చేశారు. జనసంద్రాన్ని తలపిస్తున్న 'సిద్ధం' సభా ప్రాంగణం, సభకు హాజరైన ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలుకుతున్న జనం ఫొటోలతో సామాజిక మాధ్యమాలు నిండిపోయాయి. వైఎస్ జగన్ ఎగైన్, ఎండ్ ఆఫ్ టీడీపీ హ్యాష్‌ట్యాగ్‌లతోనూ 'సిద్ధం' సభ విశేషాలను ఎప్పటికప్పుడు పోస్టు చేస్తూ అభిమానులు హోరెత్తించారు. తద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఉన్న క్రేజ్ గురించి మరోమారు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది.

– సాక్షి, అమరావతి



కనుచూపుమేరలో నలువైపులా జనసంద్రమే..

సభలో యువోత్సాహం











ఇంతటి అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు




గతంలో ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలంటే రోగులు భయపడేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నాలుగున్నరేళ్లలో ఆస్పత్రులు నాడు–నేడు ద్వారా అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఆధునికంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఈ మార్పు కనిపిస్తోంది. ఖరీదైన ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లు సైతం ఏర్పాటు చేశారు. ఓపెన్ హార్ట్ సర్జరీ యూనిట్లను పునరుద్ధరించారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కోవిడ్‌తో సరిపోయింది. మిగిలిన తక్కువ సమయంలోనే ఈ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు.
– శివకృష్ణ, వైద్యాధికారి, రాప్తాడు, అనంతపురం జిల్లా

పేదలంటే బాబు దృష్టిలో కూలీలు



పేదలంటే పెత్తందార్ల ఇళ్లలో పనిచేసే కూలీలుగా చంద్రబాబు భావించేవారు. 2014 ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తానని ప్రకటించి.. గెలిచిన తర్వాత పక్కన పెట్టేశారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతే రాజయ్యాడు. ఏటా పెట్టుబడి రాయితీ, విత్తనాలు, ఎరువులు రైతుల వద్దకే చేరుతున్నాయి. మనసున్న ముఖ్యమంత్రిగా అందరి మన్ననలు అందుకున్నారు.
– మల్లిరెడ్డి, పత్తికోట, అన్నమయ్య జిల్లా

బాబు పాలనలో నరకం చూశాం



చంద్రబాబు పాలనలో నరకం చూశాం. వర్షాలు కురవక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. తినేందుకు తిండి లేక వలసలు వెళ్లాల్సి వచ్చేది. మూగ జీవాలకు మేత దొరక్క వాటిని కూడా అమ్ముకున్నాం. జగన్ ముఖ్యమంత్రి కాగానే రాజన్న పాలన మళ్లీ ప్రారంభమైంది. రైతులకు మంచిరోజులు వచ్చాయి. కడుపునకు అన్నం తినే ఎవడూ చంద్రబాబుకు ఓటు వేయరు.
– జయరామిరెడ్డి, రైతు, బుక్కచెర్ల, అనంతపురం జిల్లా

జిత్తులమారి పొత్తులను తిప్పికొడతాం



ప్రతిపక్షాలు నక్క జిత్తుల పొత్తులతో జగన్‌ను గద్దె దింపాలని చూస్తున్నాయి. సీఎం జగన్ తన ప్రసంగంతో ఇచ్చిన స్ఫూర్తితో పనిచేస్తాం. వచ్చే ఎన్నికల్లో గ్రామాల్లో ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను తిప్పి కొడతాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును అందరికీ అర్థమయ్యేలా వివరిస్తాం. జగనన్నను గెలిపించుకుంటాం.
– సుప్రజ, అనంతపురం

నా తొలి ఓటు జగనన్నకే



నేను అనంతపురంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. తొలిసారి ఓటు హక్కు పొందా. నా తొలి ఓటు జగనన్నకే వేస్తాను. జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలనే మా ఊరోళ్లతో కలిసి సభకు వచ్చాను. నాలాంటి వారి చదువులకు సీఎం జగన్ ఎంతో సాయం అందిస్తున్నారు. అందుకే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.
– మేఘనాథ్‌రెడ్డి, పైలబోయినపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సీఎం జగన్ రాష్ట్రంలో అర్హులైన 33 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు అందించలేదు.
– అబ్దుల్లా, బస్తిపాడు, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా

జగనన్నపై నమ్మకం పెరిగింది



సీఎం వైఎస్ జగన్ ప్రసంగం విన్నాక రాష్ట్రంలో 175కు 175 స్థానాలు వైఎస్సార్ సీపీ సాధిస్తుందన్న నమ్మకం పెరిగింది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా దిశా నిర్దేశం చేశారు. పార్టీ విజయం కోసం మరింతగా పని చేయాలన్న సంకల్పం మా అందరికీ కలిగింది. మేమంతా ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సిద్ధంగా ఉన్నాం.
– చంద్రకళాబాయి, కర్నూలు

మహిళలంతా జగనన్న వెంటే



సీఎం జగన్ వస్తున్నారంటే మా మహిళలంతా స్వచ్ఛందంగా తరలివచ్చాం. మహిళలను తన అక్క, చెల్లెమ్మల్లా భావించి ఎన్నో పథకాలు అందిస్తున్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయి. ఇదే విషయాన్ని ఊరెళ్లాక అందరికీ చెబుతాను.
– వై.హేమలత, రామినేపల్లి, అనంతపురం జిల్లా

ఈ యుద్ధంలో జగన్‌దే గెలుపు



విపక్షాలు ఎన్ని పన్నాగాలు పన్నినా అర్జునుడిలా పోరాడి రానున్న ఎన్నికల రణరంగంలో విజేతగా నిలుస్తానని వైఎస్ జగన్ చేసిన ప్రకటన కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ఎన్నికల రణరంగంలో జగన్ విజేతగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. – జగదీశ్వర్ రెడ్డి, చిన్నకులాల గ్రామం, వైఎస్సార్ జిల్లా

- రాప్తాడు

రాప్తాడులో సిద్ధం సభకు హాజరైన జనసందోహానికి ర్యాంపుపై నడుస్తూ నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీమలో జనసముద్రం

అనంతపురం: రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రజా సభగా రాప్తాడు సిద్ధం సభ నిలిచింది. వైఎస్ జగన్ వస్తే ప్రభంజనమేనని మరోసారి ప్రజలు చాటి చెప్పారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో 175, 25 లోక్‌సభ స్థానాల్లో 25 గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లక్షలాది జనం బ్రహ్మరథం పట్టారు. రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల నుంచి వేలాది వాహనాల్లో ప్రజలు తరలివచ్చారు. సభా వేదికపైకి సీఎం జగన్ చేరుకోకముందే ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఇంకా లక్షలాది మంది ప్రజలు హైదరాబాద్‌- బెంగళూరు, అనంతపురం–చెన్నై జాతీయ రహదారులపై ఎక్కడికక్కడే నిలిచిపోయారు. అనంతపురం–చెన్నై జాతీయ రహదారిలో ఎస్కే యూనివర్సిటీ దాటి సంజీవపురం వరకు 12 కిలోమీటర్ల పొడవునా, ఇటు రాప్తాడు వైపు బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై మరూరు టోల్‌గేట్, మరో వైపు రాప్తాడు నుంచి అనంతపురం వరకు వాహనాలు నిలిచిపోయాయి. సభా ప్రాంగణంలో ఎన్ని లక్షల మంది ఉంటారో.. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వారు అంతకు మించే ఉన్నారని అనంతపురం నగరం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

'సిద్ధం' అని నినదించిన లక్షలాది గొంతులు

దుష్ట చతుష్టయంపై యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా? అంటూ వైఎస్ జగన్ చేసిన రణ గర్జనకు ..'సిద్ధం' అంటూ లక్షలాది గొంతులు ప్రతిధ్వనించాయి. ఎండ తీవ్రత పెరిగినా జనం లెక్కచేయలేదు. సీఎం జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటూ జై జగన్ అంటూ నినదించారు. పెత్తందారులతో యుద్ధానికి మీరు సిద్ధమేనా? విశ్వసనీయతకు, వంచనకు మధ్య యుద్ధం జరుగుతోంది. పక్క రాష్ట్రాల్లో ఉంటూ ఇక్కడ రాజకీయాలు చేసే నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్ అవసరమా? చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకొస్తుందా? ప్రజల మంచి కోసం చంద్రబాబు చేసిన మంచి పని ఒక్కటైనా ఉందా? చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో రైతులకు గుర్తుకు వచ్చే పథకం ఒక్కటైనా ఉందా? మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 10 శాతమైనా అమలు చేశారా? అని అడిగిన ప్రశ్నలకు.. లక్షలాది మంది టార్చ్ ఆన్ చేసిన మొబైల్ ఫోన్లను చేత్తో పట్టుకుని చూపుతూ ప్రతిస్పందించారు. 'రంగు రంగుల మేనిఫెస్టోతో మళ్లీ మోసం చేయడానికి బాబు వస్తున్నాడు. చంద్రబాబు చేసేవన్నీ మోసాలే, చెప్పేవన్నీ అబద్ధాలే. గత ఎన్నికల్లో అందరూ చొక్కాలు మడతపెట్టి చంద్రబాబు కుర్చీని మడతేసి వాళ్ల సీట్లను తగ్గించారు. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లో ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలి' అన్నప్పుడు లక్షలాది గొంతులు 'అవును.. అవును..' అంటూ నినదించాయి.

> **ఇదివరకెన్నడూ చూడని రీతిలో జనసందోహం**
> - కెరటాల్లా దూసుకొచ్చిన అభిమాన సంద్రం.. ఇసుకేస్తే రాలని విధంగా కిక్కిరిసిన 250 ఎకరాల ప్రాంగణం
> - నలు దిక్కులా కనుచూపు మేర జనమే జనం.. సీఎం జగన్ రాకముందే సభా ప్రాంగణం ఫుల్
> - ఖాళీ లేక రోడ్లపై నిలిచిపోయిన లక్షలాది మంది జనం
> - సెల్ ఫోన్లలో లైవ్ చూస్తూ ఆనంద పరవశం.. అత్యధికంగా తరలివచ్చిన అన్నదాతలు, యువత


పోటెత్తిన రైతన్నలు

రాప్తాడు సిద్ధం సభకు హాజరైన వారిలో అత్యధికులు అన్నదాతలే ఉండడం గమనార్హం. రాయలసీమ వ్యవసాయాధారిత ప్రాంతం. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వ్యవసాయ సంస్కరణలు, రైతు సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందిన అన్నదాతలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు. అందుకే ఈ సభకు ఇంత భారీ స్థాయిలో తరలి వచ్చారు. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుంటేనే రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, వర్షాలు సమృద్ధిగా పడతాయని ఆకాంక్షిస్తున్నారు. సీఎం జగన్ రైతు బాంధవుడిగా ఉంటారనే నమ్మకంతోనే అన్నదాతలు వైఎస్సార్‌సీపీ పక్షాన నిలబడుతున్నారు. ఈ సభకు యువతతో పాటు మహిళలు, వృద్ధులు సైతం తరలిరావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సభకు సీఎం వైఎస్ జగన్ మధ్యాహ్నం 3 గంటలకు వస్తారని తెలిసినా.. ఉదయం 11 గంటల నుంచే జనం తరలివచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకే సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభలో సీఎం జగన్ ప్రసంగిస్తున్నంత సేపు వాహనాల్లో జనం వస్తూనే ఉన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రాంగణానికి చేరుకోలేక పెద్ద సంఖ్యలో మధ్యలో నిలిచి పోయిన వారు తమ సెల్ ఫోన్లలో లైవ్ చూస్తూ ఆనందించారు.



సీఎం వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో సిద్ధం.. సిద్ధం.. అని నినదిస్తున్న అభిమానులు

జగనన్నను గెలిపించేందుకు సిద్ధం



ఎన్నడూ చూడనివిధంగా జగనన్న సైనికులు 'సిద్ధం' సభకు తరలివచ్చారు. సీఎం జగన్‌కు అండగా ఉండేందుకు సిద్ధమని నినదించారు. ఆయన ముఖ్యమంత్రయ్యాక బడుగు, బలహీన వర్గాలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. అణగారిన వర్గాలకు నేరుగా లబ్ధి కల్పించిన ఏకైక ప్రభుత్వం జగనన్నదే. రూ.2.55 లక్షల కోట్లు పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. –అంజాద్ బాషా, ఉప ముఖ్యమంత్రి

ప్రభంజనం అంటే ఇదే



ప్రభంజనం అంటే ఇలాగే ఉంటుంది. ఎల్లో మీడియా కూటమి విషప్రచారం చేస్తున్నా.. గొప్ప నాయకుడిని మాత్రం చరిత్ర ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుంది. టీడీపీ కంచుకోటలుగా చెప్పుకునే నియోజకవర్గాలన్నీ జగనన్న దెబ్బకు మంచుకొండల్లా కరిగిపోతాయి. రానున్న ఎన్నికల కోసం కౌరవులందరూ గుంపులుగా వస్తుంటే జగనన్న మాత్రం సింగిల్‌గా వస్తున్నారు. – ఉషశ్రీ చరణ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి

దేశానికి రోల్ మోడల్ జగన్



ప్రజావసరాలను గుర్తించి పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఆయన దేశానికి రోల్ మోడల్. రాబోయే కురుక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. సిద్ధం సభలతో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఏంటో అందరికీ తెలిసింది. –కొరుముట్ల శ్రీనివాసులు, రైల్వేకోడూరు ఎమ్మెల్యే

- అనంతపురం ఎడ్యుకేషన్

మీ అడుగుజాడల్లో నడిచేందుకు సిద్ధం



బ్రిటీష్ వాళ్లపై తిరుగుబాటు చేసిన తొలి భారతీయుడు సీమబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎట్లా ఉంటాడో తెలుసా.. ఇట్లా ఉంటాడు! (సీఎంను చూపుతూ).. దాతృత్వంలో బుడ్డా వెంగల్‌రెడ్డి, రాజసంలో రాజశేఖరరెడ్డి, పౌరుషంలో సైరా నరసింహారెడ్డికి ప్రతీక మన జగన్‌మోహన్‌రెడ్డి. 21 ఏళ్ల టీడీపీ పాలనలో ఈ ప్రాంతం వందేళ్లకు సరిపడా విషాదం చూసింది. ఫ్యాక్షన్ హత్యలు, రైతుల ఆత్మహత్యలు, కరువు కాటకాలు, వలసలతో గ్రామాలు నిర్మానుష్యమయ్యాయి. జగన్ సీఎంగా వచ్చిన క్షణం నుంచి నేటి వరకు ఫ్యాక్షన్ హత్యలు లేవు. రైతు ఆత్మహత్యలు, కరువు కాటకాలు, వలసలు అసలే లేవు. ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చిన జగన్‌కు ఏమిచ్చి రుణం తీర్చుకోవాలి. 'పచ్చ'రాజ్యంలో కాళ్లు పట్టుకుంటే తప్ప పథకాలు వచ్చేవి కాదు. ఈ రోజు ఇంటికే పథకాలు వస్తున్నాయి, జగనన్న అండతో రాయలసీమ అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. నిన్నే నమ్ముకున్న రాయలసీమ బిడ్డలంతా నీ అడుగులో అడుగు వేసేందుకు సిద్ధం. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఈ ప్రాంతంలో తెగిన స్త్రీల తాళిబొట్లను, రైతులకు జరిగిన అన్యాయం, నిరుద్యోగులు, పొదుపు సంఘాల మహిళలకు జరిగిన మోసాన్ని గుర్తు చేసుకోవాలి. జగనన్న వచ్చిన తర్వాత ప్రతి ఇంటికీ మేలు చేశారు. అందుకే ధైర్యంగా జనాల్లో తిరుగుతున్నాం. వచ్చే ఎన్నికల్లో పెత్తందారులతో యుద్ధానికి కార్యకర్తలంతా సిద్ధమా? – తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే, రాప్తాడు

జగన్ సత్తా చాటిన సిద్ధం సభ



ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి ఇంత భారీగా సభ ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. పేదల జీవితాలను మార్చగలిగే కలియుగ బ్రహ్మ వైఎస్ జగన్. అంబేడ్కర్ కలలను ఆయన నిజం చేశారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారు. ప్రజాభిమానంతో వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలిచితీరుతుంది.
–బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

నిరుపేదలను గుండెల్లో పెట్టుకున్న జగన్



నిరుపేదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుండెల్లో పెట్టుకున్నారు. బడుగు, బలహీన వర్గాలను అధికారంలో భాగస్వామ్యం చేశారు. రాజకీయంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేశారు. అలాంటి జగనన్నకు రెండు చేతులు పైకెత్తి దండం పెట్టడం తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.
–పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు

2.30లక్షల మందికి ఉద్యోగాలిచ్చారు



గ్రామ సచివాలయాల ద్వారా 2.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైద్య, ఆరోగ్య శాఖలో కూడా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నారు. కరోనా సమయంలో ప్రజలకు బాసటగా నిలిచారు.
– అమర్‌నాథ్ రెడ్డి, తాడిపల్లి గ్రామం, వైఎస్సార్ జిల్లా

బాబు మళ్లీ వస్తే అవినీతి తప్పదు



ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా మన ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. మధ్యవర్తులు లేని ప్రజా పాలన సాగిస్తున్నారు. లంచాలకు, అవినీతికి తావు లేదు. చంద్రబాబు పొరపాటున వస్తే అవినీతికి ద్వారాలు తెరిచినట్టే.
– జయమ్మ, ఎర్రవంకపల్లి గ్రామం, శ్రీసత్యసాయి జిల్లా

చంద్రబాబు హామీలు ఎవరూ నమ్మరు



ఎన్నికల ముందు చంద్రబాబు ఓట్ల కోసం ఇచ్చే హామీలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. గతంలో 600 అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేశాడు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని సామాజిక వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారు. సమ సమాజ స్థాపనే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోంది.
– అమరావతి, అనంతపురం

రుణమాఫీతో మహిళలకు చేయూత



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా స్వయం సహాయక సంఘాల మహిళల రుణాలను సీఎం వైఎస్ జగన్ మాఫీ చేశారు. ఒక్కో మహిళకు రూ.5వేల నుంచి రూ.లక్ష వరకు రుణమాఫీ జరిగింది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. గతంలో చంద్రబాబు 'పసుపు–కుంకుమ' పేరుతో మహిళలను మోసం చేశారు. మళ్లీ ఆయన మాయలో పడేది లేదు.
– జయమ్మ, రాంపురం, అనంతపురం జిల్లా

జగన్ సీఎం అయితేనే పథకాల అమలు



పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆయన మళ్లీ సీఎం అయితేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయి. పేదల బ్యాంకు అకౌంట్లలో డబ్బులు పడతాయి. సంక్షేమ పథకాలు ఆగకూడదని సీఎం మాటగా గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు ఇదే చెబుతాం.
– విశ్వనాథ్, వానవోలు, శ్రీసత్యసాయి జిల్లా

జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



ఉదయించే సూర్యుడు లాంటివాడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. జన సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆయనపై బురద చల్లాలనుకోవడం అవివేకమే. చంద్రబాబు, పవన్‌లను ఎన్నికల్లో ఓడించడం ద్వారా వారికి తగిన బుద్ధి చెబుతాం. జనరంజక పాలన సాగించే జగన్‌నే మళ్లీ సీఎంను చేసుకుంటాం.
– శ్రీనివాసులు, గాజులపల్లి, నంద్యాల జిల్లా

కరువు, చంద్రబాబు కవలలు



కరువు, చంద్రబాబు ఇద్దరూ కవల పిల్లలు. ఆయనకు ఓటు వేసి గెలిపించుకుంటే కరువు విలయతాండవం చేస్తుంది. గ్రామాల్లో తాగేందుకు చుక్కనీరు కూడా దొరకదు. ఆయన కుమారుడు యువగళం పేరుతో పాదయాత్ర చేసినందుకు మా జిల్లాలో వర్షాలు కూడా రాకుండా అటే వెళ్లిపోయాయి. మళ్లీ చంద్రబాబును అధికారంలోకి తేవడమంటే కరువు తెచ్చుకున్నట్లే అవుతుంది.
– రవీంద్రారెడ్డి, ధర్మవరం, శ్రీసత్యసాయి జిల్లా

మా పాలిట దేవుడు జగన్



మా లాంటి నిరుపేదలకు వలంటీర్‌గా ఉద్యోగం ఇచ్చి జగనన్న దేవుడయ్యాడు. ఉద్యోగాలు లేక ఇంటి పట్టున ఉండేవాళ్లం. వలంటీర్ ఉద్యోగం వచ్చాక సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి దగ్గరకు తీసుకెళ్లి అందిస్తున్నాం. ప్రజలు మమ్మల్ని దేవుళ్లలా భావిస్తున్నారు. జగనన్న మేలు మరచిపోలేం.
– రామాంజనేయులు, కొత్తాళం గ్రామం, కర్నూలు జిల్లా

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



విద్య, వైద్యం, ఉపాధి, పారిశ్రామిక తదితర రంగాల్లో అభివృద్ధితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడం ఎంతో అవసరం. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేను మేలు చేశానని భావిస్తేనే ఓటు వేయండి అని అడుగుతున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. – పార్వతి, రుద్రంపేట, అనంతపురం.

- రాప్తాడు

3 వరుస టెస్టుల్లో రెండు డబుల్ సెంచరీలు బాదిన మూడో భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్. ఈ వరుసలో వినోద్ కాంబ్లి (1993లో), కోహ్లి (2017లో) ముందున్నారు.

9 స్వదేశంలో జడేజా అందుకున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డుల సంఖ్య. అనిల్ కుంబ్లే (9) పేరిట ఉన్న రికార్డును జడేజా సమం చేశాడు.

12 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా అక్రమ్ (12 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డును జైస్వాల్ సమం చేశాడు.

28 రాజ్‌కోట్ టెస్టులో భారత్ సిక్స్‌ల సంఖ్య. ఒకే టెస్టులో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా 2019లో వైజాగ్‌లో దక్షిణాఫ్రికాపై నమోదు చేసిన రికార్డును భారత్ సవరించింది.

48 ఈ సిరీస్‌లో ఇప్పటివరకు భారత జట్టు బాదిన సిక్స్‌లు. ఇదో కొత్త రికార్డు. దక్షిణాఫ్రికాపై 2019లో భారత్ 47 సిక్స్‌లు కొట్టింది.

కేరళకు భారీ ఆధిక్యం

సాక్షి, విజయనగరం: ఆంధ్ర జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో కేరళ జట్టు 242 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 258/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ జట్టు 7 వికెట్లకు 514 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. సచిన్ బేబీ (113; 15 ఫోర్లు), అక్షయ్ చంద్రన్ (184; 20 ఫోర్లు) సెంచరీలు సాధించారు. ఆంధ్ర బౌలర్లలో మనీశ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 19 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఆంధ్ర మరో 223 పరుగులు చేయాలి.

భారత్‌ను గెలిపించిన మనిక



బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టుకు తొలి విజయం లభించింది. హంగేరితో ఆదివారం జరిగిన గ్రూప్-1 రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-2తో గెలిచింది. భారత నంబర్‌వన్ మనిక బత్రా తాను ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. తొలి మ్యాచ్‌లో మనిక 8-11, 11-5, 12-10, 8-11, 11-4తో డోరా మదర్సాజ్‌ను ఓడించింది. రెండో మ్యాచ్‌లో ఆకుల శ్రీజ 3-11, 7-11, 11-9, 11-9, 8-11తో పోటా జార్జినా చేతిలో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 7-11, 11-7, 11-8, 11-8తో బెర్నాడెట్‌పై గెలిచింది. నాలుగో మ్యాచ్‌లో ఆకుల శ్రీజ 4-11, 6-11, 11-5, 7-11తో డోరా మదర్సాజ్ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2-2తో సమమైంది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో మనిక బత్రా 11-5, 14-12, 13-11తో పోటా జార్జినాపై నెగ్గడంతో భారత్‌కు విజయం ఖరారైంది. మరోవైపు భారత పురుషుల జట్టు గ్రూప్-3లో భాగంగా పోలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-3తో ఓడిపోయింది.

అమెరికాపై భారత్ విజయం

రూర్కెలా: మహిళల ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం దక్కింది. అమెరికా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సవితా పూనియా నాయకత్వంలోని భారత జట్టు 'షూటౌట్'లో 2-1తో గెలిచింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఫలితం తేలేందుకు 'షూటౌట్' నిర్వహించారు. అమెరికా క్రీడాకారిణులు కొట్టిన ఐదు షాట్‌లలో నాలుగింటిని నిలువరించి గోల్‌కీపర్ సవితా పూనియా భారత్‌కు విజయాన్ని అందించింది.

434 పరుగుల తేడాతో...

ఇంగ్లండ్‌పై మూడో టెస్టులో భారత్ బ్రహ్మాండ విజయం

- పరుగుల పరంగా టెస్టుల్లో టీమిండియాకిదే అతిపెద్ద విజయం
- యశస్వి అజేయ డబుల్ సెంచరీ
- రాణించిన సర్ఫరాజ్, జడేజా
- రాంచీలో 23 నుంచి నాలుగో టెస్టు


యశస్వి


జడేజా

విరామం తర్వాత మళ్లీ తాజాగా మొదలైన మూడో టెస్టులో యశస్వి జైస్వాల్ విధ్వంసం... కొత్త కుర్రాడు సర్ఫరాజ్ ఖాన్ ప్రతాపం... బౌలింగ్‌లో జడేజా మాయాజాలం... వెరసి భారత్ చరిత్రకెక్కే విజయం సాధించింది. మ్యాచ్ మొదలైన రోజు నుంచీ ప్రతీరోజు భారత్ ఆధిపత్యమే కొనసాగడంతో ఏ మలుపు లేకుండా ఈ టెస్టు నాలుగు రోజుల్లోనే ముగిసింది. ఈ గెలుపుతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి రాంచీలో జరుగుతుంది.

రాజ్‌కోట్: టీమిండియా బలగం ముందు ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆట కుదేలైంది. మ్యాచ్ జరిగే కొద్దీ బ్యాటర్ల పరుగుల పరాక్రమం, బౌలర్ల వికెట్ల మాయాజాలం ప్రత్యర్థి జట్టును చిత్తు చేసింది. మరో రోజు ఆట మిగిలి ఉండగానే ఈ మ్యాచ్‌లో భారత్ 434 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై బ్రహ్మాండ విజయం నమోదు చేసింది. పరుగుల తేడా పరంగా టెస్టుల్లో భారత జట్టుకిదే అతి పెద్ద విజయం. ఇంతకుముందు భారత జట్టు 2021లో ముంబైలో న్యూజిలాండ్‌పై 372 పరుగుల తేడాతో గెలిచింది. ఆట నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 196/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 98 ఓవర్లలో 4 వికెట్లకు 430 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్‌కు 557 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా (5/41), కుల్దీప్ యాదవ్ (2/19), అశ్విన్ (1/19) స్పిన్ దెబ్బకు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది.

యశస్వి 'డబుల్'...

ఓవర్‌నైట్ బ్యాటర్లు శుబ్‌మన్ గిల్ (91; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుల్దీప్ (27; 3 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. గిల్ రనౌటయ్యాక శనివారం వెన్నునొప్పితో వ్యక్తిగత స్కోరు 104 పరుగులవద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన యశస్వి జైస్వాల్ మళ్లీ క్రీజులోకి వచ్చాడు. అదే దూకుడు కొనసాగిస్తూ యశస్వి జైస్వాల్ (236 బంతుల్లో 214 నాటౌట్; 14 ఫోర్లు, 12 సిక్స్‌లు) తన కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (72 బంతుల్లో 68 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధసెంచరీతో అదరగొట్టాడు. ప్రస్తుత టెస్టు క్రికెట్లోనే విశేషానుభవజ్ఞుడు అండర్సన్ వేసిన ఇన్నింగ్స్ 85వ ఓవర్లో యశస్వి హ్యాట్రిక్ సిక్సర్లు అతని విధ్వంసానికి మచ్చుతునకలు కాగా... సర్ఫరాజ్ అంతర్జాతీయ టెస్టుకు కొత్తైన... దూకుడు నాకు పాతే అని మరో అర్ధసెంచరీతో నిరూపించుకున్నాడు. 231 బంతుల్లో జైస్వాల్ ద్విశతకాన్ని సాధించాడు. ఇద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 172 జోడించడం విశేషం.

స్పిన్ ఉచ్చులో పడి...

కొండంత లక్ష్యం కావడంతో ఇంగ్లండ్ బజ్‌బాల్ ఆట చేతులెత్తేసింది. కలిసొచ్చిన స్పిన్ పిచ్‌పై జడేజా పట్టు సాధించాడు. ఆరంభంలోనే డకెట్ (4) రనౌటయ్యాక, క్రాలీ (11)ని బుమ్రా ఎల్బీగా పంపాడు. తర్వాత జడేజా స్పిన్ మాయాజాలంలో పోప్ (3), బెయిర్‌స్టో (4), రూట్ (7) తేలిగ్గానే పడిపోయారు. జట్టు స్కోరు 50 వద్దే రూట్‌తో పాటు స్టోక్స్ (15), రేహాన్ అహ్మద్ (0) అవుటయ్యారు. మార్క్ వుడ్ (15 బంతుల్లో 33; 6 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ కావడంతో ఇంగ్లండ్ 100 పరుగులు దాటింది. అత్యవసర వ్యక్తిగత కారణాలరీత్యా రెండో రోజు ఆట ముగిశాక చెన్నై వెళ్లిన అశ్విన్ ఆదివారం మైదానంలోకి దిగి ఒక వికెట్ కూడా తీశాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 319; భారత్ రెండో ఇన్నింగ్స్: 430/4 డిక్లేర్డ్. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 11. డకెట్ (రనౌట్) 4; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3; రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 7; బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 4; స్టోక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 15; ఫోక్స్ (సి) జురేల్ (బి) జడేజా 16; రేహాన్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0; హార్ట్‌లీ (బి) అశ్విన్ 16; వుడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33; అండర్సన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (39.4 ఓవర్లలో ఆలౌట్) 122. వికెట్ల పతనం:** 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122. **బౌలింగ్:** బుమ్రా 8-1-18-1, సిరాజ్ 5-2-16-0, జడేజా 12.4-4-41-5, కుల్దీప్ 8-2-19-2, అశ్విన్ 6-3-19-1.



ఆసియా క్వీన్స్...

ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు స్వర్ణం

షా ఆలమ్ (మలేసియా): ఊహించని అద్భుతం జరిగింది. ఏమాత్రం అంచనాలు లేకుండా ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత జట్టు ఏకంగా ట్రోఫీనే సొంతం చేసుకొని అబ్బుర పరిచింది. ఆదివారం జరిగిన మహిళల టీమ్ విభాగం ఫైనల్లో పీవీ సింధు నాయకత్వంలోని భారత జట్టు 3-2తో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. గతంలో భారత పురుషుల జట్టు రెండుసార్లు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సాధించగా... భారత మహిళల జట్టు మాత్రం ఫైనల్ చేరిన తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలువడం విశేషం.

థాయ్‌లాండ్‌తో టైటిల్ పోరు తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21-12, 21-12తో సుపనిదను ఓడించి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో ట్రెసా జాలీ-పుల్లెల గాయత్రి జోడీ 21-16, 18-21, 21-16తో జోంగ్‌కొల్ఫాన్-రవింద జంటపై గెలిచి భారత ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. అయితే మూడో మ్యాచ్‌లో అస్మిత 11-21, 14-21తో బుసానన్ చేతిలో ఓడిపోయింది. నాలుగో మ్యాచ్‌లో ప్రియా కొంజెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా ద్వయం 11-21, 9-21తో బెన్యాపా-నుంతాకర్న్ జోడీ చేతిలో పరాజయం పాలైంది. దాంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖర్బ్ 21-14, 21-9తో పోర్న్‌పిచాను ఓడించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ అత్యద్భుత ఆటతో అదరగొట్టింది. తొలి లీగ్ మ్యాచ్‌లో చైనాపై... సెమీఫైనల్లో జపాన్‌పై భారత్ నెగ్గడంలో అన్‌మోల్ కీలకపాత్ర పోషించింది. విజేతగా నిలిచిన భారత జట్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.

6,6,6,6,6,6

- ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన ఆంధ్ర బ్యాటర్ వంశీకృష్ణ
- సీకే నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో అద్భుతం



కడప స్పోర్ట్స్: కల్నర్ సీకే నాయుడు ట్రోఫీ జాతీయ అండర్-23 క్రికెట్ టోర్నీలో భాగంగా రైల్వేస్ జట్టుతో ఆదివారం మొదలైన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఓపెనర్ మామిడి వంశీకృష్ణ (64 బంతుల్లో 110; 9 ఫోర్లు, 10 సిక్స్‌లు) అద్భుతం చేశాడు. గుంటూరు జిల్లాకు చెందిన 22 ఏళ్ల వంశీకృష్ణ ఒకే ఓవర్‌లోని వరుస 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టి సంచలనం సృష్టించాడు. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసింది. రైల్వేస్ లెగ్ స్పిన్నర్ దమన్‌దీప్ సింగ్ వేసిన ఇన్నింగ్స్ 10వ ఓవర్లో వంశీకృష్ణ 6 బంతుల్లో 6 సిక్స్‌లు సంధించాడు. అనంతరం ఈ జోరు కొనసాగిస్తూ వంశీకృష్ణ 48 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సీకే నాయుడు ట్రోఫీ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆంధ్ర బ్యాటర్‌గా వంశీకృష్ణ రికార్డు నెలకొల్పాడు. మామిడి వంశీకృష్ణతోపాటు వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ వంశీకృష్ణ (55; 6 ఫోర్లు, 1 సిక్స్), ధరణి కుమార్ (81; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకట్ రాహుల్ (61 బ్యాటింగ్; 6 ఫోర్లు) కూడా రాణించారు.

ఇంతకుముందు అంతర్జాతీయ వన్డేల్లో హెర్షల్ గిబ్స్ (దక్షిణాఫ్రికా), జస్కరణ్ మల్హోత్రా (అమెరికా)... అంతర్జాతీయ టి20ల్లో యువరాజ్ సింగ్ (భారత్), కీరన్ పొలార్డ్ (వెస్టిండీస్)... ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (మూడు/నాలుగు రోజులపాటు జరిగే మ్యాచ్‌లు) గ్యారీ సోబర్స్ (వెస్టిండీస్), రవిశాస్త్రి (భారత్), లీ జెర్మన్ (న్యూజిలాండ్)... దేశవాళీ వన్డేల్లో తిసారా పెరీరా (శ్రీలంక), రుతురాజ్ గైక్వాడ్ (భారత్)... దేశవాళీ టి20ల్లో రోజ్ వైట్లీ (ఇంగ్లండ్), లియో కార్టర్ (న్యూజిలాండ్), హజ్రతుల్లా జజాయ్ (అఫ్గానిస్తాన్) ఒకే ఓవర్లో వరుస 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

రామగుండం ఫెర్టిలైజర్స్‌లో 28 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)-10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)-6, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)-3, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్‌స్ట్రుమెంటేషన్)-2, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)-3, మేనేజ్‌మెంట్ ట్రైనీ(లా)-1,మేనేజ్‌మెంట్ ట్రైనీ(హెచ్ఆర్)-3
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 60శాతం మార్కులతో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 29.02.2024 నాటికి కనీస వయస్సు 18 ఏళ్లు, గరిష్టంగా గ్రాడ్యుయేట్లకు 25 ఏళ్లు, పీజీ అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.
» **బేసిక్ పే:** రూ.40,000 నుంచి రూ.1,40,000
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.03.2024
» **వెబ్‌సైట్:** www.rfcl.co.in

ఏఐఈఎస్ఎల్, న్యూఢిల్లీలో 100 టెక్నీషియన్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఈఎస్ఎల్).. వివిధ విభాగాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **పోస్టుల వివరాలు:** ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(మెయింటెనెన్స్/ఓవర్‌హాల్, ఏవియానిక్స్), ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(ఏవియానిక్స్, ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటల్ /రేడియో), టెక్నీషియన్(ఫిట్టర్/షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్), టెక్నీషియన్ (ఎక్స్-రే/ఎన్‌డీటీ).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్ సర్టిఫికేట్, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:**స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్,టెక్నికల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తులకు చివరితేది:** 23.02.2024.
» **వెబ్‌సైట్:** www.aiesl.in

టీచర్ కొలువుల కల నెరవేరేలా..

» 6,100 పోస్టులతో ఏపీ టీఆర్‌టీ నోటిఫికేషన్
» ఎస్‌జీటీ, ఎస్ఏ, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపల్ పోస్టులు
» రాత పరీక్ష ఆధారంగా నియామకాలు
» మార్చి 15 నుంచి పరీక్షలు ప్రారంభం

బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో.. మొత్తం 6,100 పోస్టల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసెంది. ఏపీ టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్-2024కి దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది. ఈ నోటిఫికేషన్ ద్వారా విద్యా శాఖ పరిధిలోని పాఠశాలల్లో పోస్టలను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ టీఆర్‌టీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం 6,100 పోస్టులు

ఏపీ టీఆర్‌టీ ద్వారా మొత్తం 6,100 పోస్టలను భర్తీ చేయనున్నారు. వీటిల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ): 2,280 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్స్ (ఎస్ఏ): 2,285 పోస్టులు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ): 1,264 పోస్టులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ): 215 పోస్టులు, ప్రిన్సిపల్స్: 42 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

ఆయా పోస్టలను అనుసరించి సంబంధిత విభాగంలో/సబ్జెక్టులో ఇంటర్, డీఈడీ/డీఈఎల్ఈడీ; బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ తదితర అర్హతలుండాలి. ఏపీ టెట్‌లో అర్హత సాధించాలి.

వయసు

జులై 1, 2024 నాటికి 18-44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లుగా నిర్ణయించారు.

రాత పరీక్షలో ప్రతిభ

ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్టను నిర్వహించనున్నారు. పోస్టల వారీగా టెస్ట్‌ల ఆ వివరాలు..

ఎస్‌జీటీ.. పరీక్ష

సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులకు 160 ప్రశ్నలు-80 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొత్తం 8 పార్ట్‌లుగా పరీక్ష జరుగుతుంది. ఇందులో పార్ట్-1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 16 ప్రశ్నలు- 8మార్కులు; పార్ట్-2 పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్-8 ప్రశ్నలు-4 మార్కులు; పార్ట్-3 ఎడ్యుకేషన్ సైకాలజీ-16 ప్రశ్నలు-8మార్కులు; పార్ట్-4 లాంగ్వేజ్-1 కంటెంట్ 16 ప్రశ్నలు-8 మార్కులు, లాంగ్వేజ్-1 మెథడాలజీ 8 ప్రశ్నలు-4మార్కులు; పార్ట్-5 లాంగ్వేజ్-2(ఇంగ్లిష్) కంటెంట్ 16 ప్రశ్నలు-8 మార్కులు, మెథడాలజీ 8ప్రశ్నలు-4మార్కులు; పార్ట్-6 మ్యాథమెటిక్స్ కంటెంట్ 16 ప్రశ్నలు-8 మార్కులు, మ్యాథమెటిక్స్ మెథడాలజీ 8 ప్రశ్నలు -4 మార్కులు; పార్ట్-7 సైన్స్ కంటెంట్-16 ప్రశ్నలు-8 మార్కులు; సైన్స్ మెథడాలజీ 8 ప్రశ్నలు-4 మార్కులు; పార్ట్-8 సోషల్ స్టడీస్ కంటెంట్ 16 ప్రశ్నలు-8 మార్కులు, సోషల్ స్టడీస్ మెథడాలజీ 8 ప్రశ్నలు-4 మార్కులకు ఉంటుంది. లాంగ్వేజ్-1కు సంబంధించి అభ్యర్థులు తెలుగు/ఉర్దూ/హిందీ/తమిళం/ఒరియా/కన్నడ/సంస్కృతం భాషలను ఎంచుకోవచ్చు.

స్కూల్ అసిస్టెంట్స్ పరీక్ష స్వరూపం

స్కూల్ అసిస్టెంట్ పోస్టలకు నాలుగు విభాగాలుగా 160 ప్రశ్నలు-80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పార్ట్-1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్-20 ప్రశ్నలు-10 మార్కులు; పార్ట్-2 పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్-10 ప్రశ్నలు-5 మార్కులు; పార్ట్-3 క్లాస్‌రూమ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సైకాలజీ -10 ప్రశ్నలు-5 మార్కులు; పార్ట్-4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్-80 ప్రశ్నలు-40 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ-40 ప్రశ్నలు-20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

ప్రిన్సిపల్ పోస్టల రాత పరీక్ష ఇలా

ఈ పోస్టలకు రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1ను ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌గా పేర్కొన్నారు. ఇందులో 100 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటాయి. పేపర్-2ను 5 విభాగాల్లో 200 ప్రశ్నలతో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు-15 మార్కులు, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 30 ప్రశ్నలు-15 మార్కులు, ఎడ్యుకేషన్ సైకాలజీ 40 ప్రశ్నలు-20 మార్కులు, సమకాలీన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు, ఇతర కార్యక్రమాలు, అదే విధంగా స్కూల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కార్యక్రమాలు, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, పర్యవేక్షణ -నాయకత్వ లక్షణాలు 70 ప్రశ్నలు-35 మార్కులు, టీచింగ్ మెథడాలజీపై అవగాహన 30 ప్రశ్నలు-15 మార్కులకు ఉంటాయి.



పీజీటీ పరీక్ష

పీజీటీ పోస్టలకు రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1 ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది. పేపర్-2ను నాలుగు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు-10 మార్కులు; పార్ట్-2 పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 20 ప్రశ్నలు-10 మార్కులు; పార్ట్-3 ఎడ్యుకేషన్ సైకాలజీ 20 ప్రశ్నలు-10 మార్కులు; పార్ట్-4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ 100ప్రశ్నలు-50 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ 40 ప్రశ్నలు-20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

టీజీటీ పరీక్ష ఇలా

ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ పరీక్షను కూడా రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. పేపర్-1 ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది. పేపర్-2ను నాలుగు విభాగాలుగా 80 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-1 జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు-10 మార్కులు; పార్ట్-2 పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్ 10 ప్రశ్నలు-5 మార్కులు; పార్ట్-3 క్లాస్‌రూమ్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సైకాలజీ 10 ప్రశ్నలు-5 మార్కులు; పార్ట్-4 సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ 80 ప్రశ్నలు-40 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీ 40 ప్రశ్నలు-20 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఫీజు చెల్లింపునకు చివరి తేది: 21-02-2024.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024,ఫిబ్రవరి 22
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: మార్చి 5 నుంచి
- స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పరీక్ష తేదీలు: మార్చి 15 నుంచి 30 వరకు
- పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపల్ పరీక్ష తేదీలు: మార్చి 15 నుంచి 30 వరకు
- ఫలితాల వెల్లడి: 2024, ఏప్రిల్ 15
- వెబ్‌సైట్: https://cse.ap.gov.in

విజయం సాధించాలంటే

ఎస్‌జీటీ

ఎస్‌జీటీ అభ్యర్థులు జీకే, కరెంట్ అఫైర్స్ సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. సబ్జెక్టుల వారీ పటిష్ట ప్రణాళికతో అధ్యయనం సాగించాలి. భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు-రాజధానులు, ప్రపంచంలో తొలి సంఘటనలు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్, అంతర్జాతీయ రాజకీయ, శాస్త్రసాంకేతిక అంశాలు తెలుసుకోవాలి.

- **విద్యా దృక్పథాలు:** దేశంలో విద్యా చరిత్ర, కమిటీలు; వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధిత అంశాలు; ఉపాధ్యాయ సాధికారత; చట్టాలు-హక్కులు; జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం (ఎన్‌సీఎఫ్-2005); విద్యాహక్కు చట్టం, నూతన విద్యా విధానం తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- **విద్యా మనోవిజ్ఞానశాస్త్రం:** శిశు వికాసం అభివృద్ధి,వైయక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం అంశాలు చాలా ముఖ్యమైనవి. శిశు వికాసంలో వికాసం, పెరుగుదల, పరిపక్వత భావన-స్వభావం, వికాస నియమాలు, వికాసంపై ప్రభావం చూపే కారకాలు, వికాస దశలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ముఖ్య భావనలు, అనువర్తనాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.
- **కంటెంట్:** తెలుగు(ఆప్షనల్), ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల కంటెంట్‌లో సన్నద్ధతకు ప్రిపరేషన్ పరంగా పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. తెలుగులో కవులు-కావ్యాలు,అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు తదితరాలతో పాటు భాషాంశాలను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, టైప్స్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. గణితంలో అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, క్షేత్ర గణితం, రేఖా గణితం, బీజ గణితం, సాంఖ్యక శాస్త్రం అంశాలపై పట్టు సాధించాలి. పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్‌ను అధ్యయనం చేయడం లాభిస్తుంది.
- సైన్స్‌లో జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, సైన్స్‌లో విభాగాలు, పోషణ, ఆహార పిరమిడ్ , మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు-క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి., ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి.
- సోషల్ స్టడీస్‌లో స్థానిక భౌగోళిక అంశాలు, ఖండాలు, పారిశ్రామిక విప్లవం, మనీ-బ్యాంకింగ్, ప్రభుత్వం; రాజకీయ వ్యవస్థలు, జాతీయ ఉద్యమం, భారత రాజ్యాంగం, పరిపాలన, సాంఘిక సంస్థలు, అసమానతలు, మతం-సమాజం, సంస్కృతి, కమ్యూనికేషన్ తదితర అంశాలపై అవగాహన అవసరం.

స్కూల్ అసిస్టెంట్‌కు ఇలా

- **మ్యాథమెటిక్స్:** బీజ గణితం,సదిశా బీజ గణితం , వైశ్లేషిక రేఖాగణితం, కలన గణితం,త్రికోణమితి అంశాలపై పట్టు సాధించాలి. బయాలజీలో జీవ ప్రపంచం, సూక్ష్మజీవుల ప్రపంచం, జీవశాస్త్రం-ఆధునిక పోకడలు, జంతు ప్రపంచం తదితర పాఠ్యాంశాలు ఎంతో ముఖ్యమైనవి.
- **స్కూల్ అసిస్టెంట్స్-సోషల్ స్టడీస్:** భారత స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ యుద్ధాలు-అనంతర పరిస్థితులు; రాజ్యాంగం, యూఎన్‌వో, సమకాలీన ప్రపంచ అంశాలు; జాతీయ ఆదాయం, భారత ఆర్థిక వ్యవస్థ లక్షణాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.వరల్డ్ జాగ్రఫీ, ఇండియన్ జాగ్రఫీలపై పట్టుసాధించాలి.
- **సైన్స్:** జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, సైన్స్‌లో విభాగాలు, పోషణ, ఆహార పిరమిడ్, మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు-క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి., ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా మన పర్యావరణానికి సంబంధించి జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి.
- **మెథడాలజీ:** ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధన ఉద్దేశాలు, విద్యా ప్రణాళిక, బోధనోపకరణాలు, మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం బీఈడీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
19-2-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 376	నిఫ్టీ ▲ 130
72,427	22,041

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు			
నాస్‌డాక్	15,776	▽	131
డోజోన్స్	38,628	▽	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,712	▲	114
డాక్స్	17,117	▲	71
షాంఘై (గత శుక్రవారం ముగింపు)	2,886	▲	36
నికాయ్	38,487	▲	353

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.63	83.65
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.33	105.88
€	యూరో	ఎస్‌బీఐ	88.31	90.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.72	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.21	55.13
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.37	64.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.70	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

టర్మ్ ప్లాన్స్.. అన్నీ ఒకటి కాదు!



- కవరేజీకే మొదటి ప్రాధాన్యం
- దీనికి ప్రీమియం తక్కువే
- ప్రీమియం వెనక్కి ఇచ్చేది మరో రకం
- ఇందులో రెట్టింపు బాదుడు
- మధ్యలో తప్పుకుంటే కట్టిందంతా వెనక్కి
- వ్యత్యాసం తెలిస్తేనే మెరుగైన ఎంపిక

జీవిత బీమాను పెట్టుబడి సాధనంగా చూసే ధోరణిలో మార్పు వస్తోంది. అయినా, ఇప్పటికీ అధిక శాతం మంది బీమా ప్లాన్‌ను రాబడి కోణం నుంచే చూస్తుంటారు. చివరిలో ఎంతొస్తుందని అడుగుతారు. అందుకే బీమా ఏజెంట్లు ఎండోమెంట్ ప్లాన్లను ఎక్కువగా మార్కెటింగ్ చేస్తుంటారు. కానీ, బీమా అర్థం వేరు. ఒక వ్యక్తి మరణం కారణంగా కుటుంబం ఆర్థికంగా కష్టాలు పడకుండా ఆదుకునే సాధనం ఇది. బీమా రక్షణను ఈ కోణంలోనే తీసుకోవాలి. అచ్చమైన బీమా కవరేజీ ఇచ్చేదే టర్మ్ ఇన్సూరెన్స్. కానీ, ఇందులోనూ పలు రకాలు ప్రవేశించాయి. నిక్షేపంగా జీవించి ఉంటే మాకేంటి..? అని ప్రశ్నించే వారి కోసం టర్మ్ ప్లాన్‌ను బీమా సంస్థలు వినూత్నంగా అందిస్తున్నాయి. కానీ, ఏది తీసుకోవాలి..? దీనికి సమాధానం కావాలంటే నిపుణుల విశ్లేషణ తెలుసుకోవాల్సిందే.

తన కుటుంబ క్షేమం కోరేవారు తీసుకోవాల్సిన బీమా పాలసీ ఏదన్నా ఉందంటే అది టర్మ్ ఇన్సూరెన్స్ అని చెప్పాలి. తక్కువ ప్రీమియానికే మెరుగైన కవరేజీ ఇందులో లభిస్తుంది. కానీ, పాలసీ గడువు ముగిసే వరకు జీవించి ఉంటే ఇందులో చెల్లించిన ప్రీమియం వెనక్కి రాదు. దీంతో కట్టిన ప్రీమియం గంగపాలేనా? అని ఆలోచించే వారి కోసం బీమా సంస్థలు పరిష్కారాన్ని కనుగొన్నాయి. సగటు మనిషి ఆలోచనా తీరుకు అనుగుణంగా, చెల్లించిన ప్రీమియం చివర్లో వెనక్కి వచ్చే ఆప్షన్‌తోనూ టర్మ్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టాయి. అలాగే, పాలసీ గడువు ముగియకపోయినా కానీ, మధ్యలో వైదొలిగితే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియాన్ని వెనక్కి ఇచ్చే రకాన్ని కూడా తీసుకొచ్చాయి. కానీ, పాలసీదారు తనకు నిజంగా ప్రయోజనకరమైన పాలసీ తీసుకున్నప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది.

టర్మ్ పాలసీలో రకాలు

టర్మ్ ఇన్సూరెన్స్‌లో ప్రధానంగా మూడు రకాలు ఉన్నాయి. ఇందులో మొదటిది రెగ్యులర్ టర్మ్ ప్లాన్. దీన్నే లెవల్ టర్మ్ ప్లాన్ అని కూడా అంటారు. పాలసీదారులు తమ అభీష్టం మేరకు నిర్ణీత వయసు వరకు (నిర్ణీత కాలానికి) కవరేజీని తీసుకోవచ్చు. కొన్ని బీమా సంస్థలు నూరేళ్ల కాలానికి కవరేజీని ఆఫర్ చేస్తుంటే, కొన్ని గరిష్ఠంగా 85 ఏళ్లకే రక్షణను పరిమితం చేస్తున్నాయి. ఇక టర్మ్ ప్లాన్‌లో రెండో రకం టీఆర్‌వోపీ. అంటే టర్మ్ ప్లాన్ విత్ రిటర్న్ ఆఫ్ ప్రీమియం. గడువు తీరే వరకు పాలసీదారు జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం నుంచి 18 శాతం జీఎస్టీని మినహాయించి మిగిలినది వెనక్కిచేస్తాయి బీమా సంస్థలు. మూడో రకం జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్. ఇప్పుడు బీమా సంస్థలు దీన్ని ఎక్కువగా ప్రచారం చేస్తున్నాయి. మిగిలిన రెండు రకాల కలయికగా ఇది ఉంటుంది.



పాలసీ కాల వ్యవధిలోనే కట్టిన ప్రీమియంలు వెనక్కి ఇవ్వాలని కోరొచ్చు. వీటిల్లో మూడో రకం 2022 నుంచే అందుబాటులోకి వచ్చింది. మ్యాక్స్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్, కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ తదితర సంస్థలు జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్లను ప్రవేశపెట్టాయి. వీటిల్లో రెగ్యులర్ టర్మ్ ప్లాన్ కాకుండా మిగిలిన రెండు రకాల పట్ల మొగ్గు చూపించేట్టు అయితే, ముందుగా వాటికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే తుది నిర్ణయానికి రావాలి.

వ్యత్యాసాలు...

రెగ్యులర్ టర్మ్ ఇన్సూరెన్స్‌లో.. పాలసీ కాల వ్యవధి ముగిసేలోపు పాలసీదారు ఏ కారణంతో మరణించినా, పరిహారాన్ని నామినీకి చెల్లిస్తారు. పరిహారం మొత్తాన్ని ఒకే విడత లేదంటే, వాయిదాలుగానూ తీసుకోవచ్చు. కేవలం ఈ రిస్క్ వరకే ఈ పాలసీ పరిమితం. గడువు ముగిసేలోపు పాలసీదారు జీవించి ఉంటే ఏమీ తిరిగి రాదు. దీన్ని చౌక ప్లాన్‌గానూ చెబుతారు. కోటి రూపాయిల కవరేజీ సైతం 30 ఏళ్ల ఆరోగ్యకరమైన వ్యక్తికి రూ.12వేల కంటే తక్కువ వార్షిక ప్రీమియానికి వచ్చేస్తుంది. టీఆర్‌వోపీ (పాలసీ గడువు తీరిన తర్వాత ప్రీమియం వెనక్కి వచ్చేవి) ప్లాన్‌లో పాలసీ గడువులోపు పాలసీదారు మరణించినట్టయితే నామినీకి పరిహారం వస్తుంది. పాలసీ గడువు ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం నుంచి 18% జీఎస్టీని తగ్గించి ఇస్తారు. కానీ, రెగ్యులర్ టర్మ్ ప్లాన్‌లతో పోలిస్తే ఇవి ఖరీదుగా ఉంటాయి. రెగ్యులర్ టర్మ్ ప్లాన్ ప్రీమియం కంటే 2 రెట్ల వరకు అధిక ప్రీమియం వీటి కోసం చెల్లించాల్సి వస్తుంది. ఇలా అదనంగా వసూలు చేసే ప్రీమియంను సంప్రదాయ డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసి, గడువు తీరిన తర్వాత పాలసీదారులకు బీమా కంపెనీలు చెల్లిస్తుంటాయి. అదనంగా చెల్లించే మొత్తం నుంచే తమ ప్రీమియం వెనక్కి వస్తుందన్న వాస్తవాన్ని పాలసీదారులు గుర్తించాలి. జీరో కాస్ట్ ప్లాన్‌లో పాలసీ గడువు కంటే ముందుగానే వైదొలగొచ్చు. ఒక వ్యక్తి తన ఆర్థిక బాధ్యతలు ముగిశాయని భావించినప్పుడు లేదంటే పదవీ విరమణ తర్వాత పాలసీ గడువు ఇంకా మిగిలి ఉన్నా వైదొలగడానికి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత ఇలా చేయవచ్చు. ఇలా ముందస్తుగానే తప్పుకుంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం మొత్తం నుంచి 18% జీఎస్టీని మినహాయించి బీమా సంస్థలు వెనక్కి ఇచ్చేస్తాయి. దీంతో పాలసీ రద్దయిపోతుంది. దీనివల్ల బీమా సంస్థలకు ప్రయోజనం.. వృద్ధాప్యానికి వచ్చిన పాలసీదారు తప్పుకోవడం వల్ల వాటికి క్లెయిమ్ రిస్క్ తగ్గుతుంది.

వాస్తవం ఏంటి?

జీరోకాస్ట్ టర్మ్ ప్లాన్ అంటే, ఎలాంటి చార్జీలు ఉండవని, దీన్నే చౌక ప్లాన్ అని పొరబడే అవకాశం లేకపోలేదు. ''కొన్ని ప్లాన్లకు జీరోకాస్ట్ టర్మ్ ఇన్సూరెన్స్ అనే లేబుల్ వేయడం ఎందుకంటే.. ప్రత్యేకంగా వైదొలగడం, ప్రీమియం వెనక్కి వచ్చే ఆప్షన్ వల్లే. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు అనుసరించే మార్కెటింగ్ ఎత్తుగడల్లో భాగమే ఇది'' అని ప్రోబస్ ఇన్సూరెన్స్ బ్రోకర్ డైరెక్టర్ రాకేశ్ గోయల్ పేర్కొన్నారు. ప్రీమియం వెనక్కి వస్తుంది కనుక, జీరోకాస్ట్‌గా బీమా కంపెనీలు వీటిని వర్ణిస్తున్నాయి. అయినా, పాలసీదారు ఎప్పుడంటే అప్పుడు పాలసీ నుంచి తప్పుకోవడం కుదరదని పాలసీబజార్ టర్మ్ ఇన్సూరెన్స్ హెడ్ రిషబ్ గార్గ్ స్పష్టం చేశారు. కనీస కాల వ్యవధి ముగిసి, ఆర్థిక బాధ్యతలు తీరిన తర్వాతే ఇందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ''జీరో కాస్ట్ అనేది మైండ్‌గేమ్. ఈ పాలసీ కోసం నేడు చెల్లించే ప్రీమియం విలువ, చివర్లో బీమా సంస్థ తిరిగిచ్చే ప్రీమియం కంటే చాలా ఎక్కువ'' అని వివరించారు.



ఏమిటి మార్గం?

టర్మ్ పాలసీ కాల వ్యవధి సాధారణంగా 30–40 ఏళ్లు అంతకంటే ఎక్కువే ఉండొచ్చు. ఉద్యోగం వచ్చిన నాటి నుంచే జీవిత బీమా కవరేజీ ఉండాలన్నది నిపుణుల సూచన. కనుక రిటైర్మెంట్ వరకు తీసుకోవడం ఎంతో అవసరం. 60 ఏళ్ల నాటికి కూడా ఆర్థిక బాధ్యతలు తీరుతాయో, లేదో అన్న సందేహంతో 75 ఏళ్లు, 85 ఏళ్ల వరకు కూడా పాలసీలు తీసుకుంటున్నారు. అయితే, కొన్ని పాలసీల్లో వయసు ఆధారంగా ఫీచర్లను బీమా సంస్థలు పరిమితం చేస్తుంటాయి. జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్ తీసుకుంటే ఆర్థిక బాధ్యతలు తీరిన వెంటనే పాలసీ నుంచి వైదొలగొచ్చు. దీనివల్ల ప్రీమియంలు వెనక్కి వస్తాయి. పాలసీ కాల వ్యవధి ముగియక ముందే ప్రీమియంల కోసం వైదొలగడం సరికాదు. దీనివల్ల జీవిత బీమా రక్షణను కోల్పోవాల్సి వస్తుంది. రెగ్యులర్ ప్లాన్‌లో రూ.50 లక్షల కవరేజీకి ప్రీమియం ఎంత? ప్రీమియం వెనక్కి వచ్చే ప్లాన్‌లో ప్రీమియం ఎంత? ఈ రెండింటి మధ్య అంతరం చెప్పుకోదగినంత ఉంటుంది. కనుక చివర్లో ప్రీమియం వెనక్కి వచ్చే ప్లాన్ కాకుండా రెగ్యులర్ ప్లాన్ తీసుకుని, మిగిలిన మేర మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే.. దీర్ఘకాలంలో భారీ మొత్తమే సమకూరుతుందని ఎన్నో నిదర్శనాలు చెబుతున్నాయి.

ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఐప్రొటెక్ట్ స్మార్ట్ జీరో కాస్ట్ టర్మ్ ప్లాన్' 60 ఏళ్ల వయసు వచ్చే వరకు రూ.కోటి కవరేజీ తీసుకునేట్టు అయితే ప్రీమియం రూ.16,287గా ఉంది. రెగ్యులర్ ప్లాన్‌లో ఇదే కవరేజీకి ప్రీమియం రూ.12,686. వ్యత్యాసం రూ.3,601. రెగ్యులర్ ప్లాన్ తీసుకుని, మిగిలే మొత్తాన్ని ప్రతి నెలా రూ.300 చొప్పున (ఏడాదికి రూ.3,600) ఈక్విటీ ఫండ్‌లో 30 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇలా చేస్తే 12 శాతం రాబడి అంచనా ప్రకారం 30 ఏళ్లకు రూ.10.5 లక్షలు సమకూరుతుంది. రిస్క్ తీసుకోని డెట్ సాధనంలో ఇన్వెస్ట్ చేసుకున్నా రూ.4.5 లక్షలు సమకూరుతుంది. ఇలా చేయడం వల్ల రెగ్యులర్ ప్లాన్ సైతం జీరోకాస్ట్‌గానే సమకూరుతుంది. ఇక్కడ చెప్పుకున్నట్టు జీరోకాస్ట్ టర్మ్ ప్లాన్ కోసం ఏటా రూ.16,287 చొప్పున 30 ఏళ్లలో రూ.4.89 లక్షలు చెల్లించుకోవాలి. చివరి వరకు జీవించి ఉంటే, చెల్లించిన మొత్తం నుంచి 18 శాతం జీఎస్టీ మినహాయిస్తారు. అప్పుడు చేతికి వచ్చేది రూ.4 లక్షలు. ఇక కనిపించని చార్జీల గురించి కూడా తెలుసుకోవాలి. జీవిత బీమా ప్రీమియంలపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంటుంది. మరి అవే ప్రీమియంలు వెనక్కి వచ్చినప్పుడు పన్ను వర్తించొచ్చు.



ఇతర రకాలు

ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్..

చిన్న వయసులోనే టర్మ్ ప్లాన్ తీసుకునే వారు ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం అనుకూలంగా ఉంటుంది. వివాహం అయిన తర్వాత నుంచి జీవితంలో పలు దశల్లో బాధ్యతలు పెరుగుతూ వెళతాయి. కనుక పెరిగే బాధ్యతలకు అనుగుణంగా జీమా కవరేజీ విస్తృతం చేసుకునేందుకు ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. ఈ ప్లాన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళుతుంది. అలాగే, ఐదేళ్లకోసారి సమ్ అష్యూర్డ్ పెరిగే పాలసీలు కూడా ఉన్నాయి. కవరేజీ పెరిగినప్పటికీ, పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం స్థిరంగానే ఉంటుంది.

డిక్రీజింగ్ టర్మ్ ఇన్సూరెన్స్..

ఏటా కవరేజీ పెరిగే ప్లాన్‌కు విరుద్ధంగా ఇది పనిచేస్తుంది. సాధారణంగా 60–65 ఏళ్లకు వచ్చే నరికి ఆర్థిక బాధ్యతలు తగ్గిపోతుంటాయి. అటువంటప్పుడు ఈ ఆప్షన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర సమ్ అష్యూరెన్స్ తగ్గుతూ వెళుతుంది. ఇందులోనూ ప్రీమియం స్థిరంగానే ఉంటుంది. ఇతర ప్లాన్లతో పోలిస్తే ప్రీమియం తక్కువ.

లమ్సమ్, పీరియాడిక్ పేమెంట్స్..

మరణ పరిహారం మొత్తాన్ని ఒకే విడత చెల్లించేవి లమ్సమ్. ఒకేసారి అంత మొత్తం చేతికి వస్తే. దాన్ని ఆదాయంగా మలుచుకోవడం సమస్యగా భావించేవారు, పీరియాడిక్ పేమెంట్స్ ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీదారు కాల వ్యవధి ముగియక ముందే మరణించిన సందర్భంలో పరిహారాన్ని నెలవారీ చొప్పున పదేళ్ల పాటు చెల్లించేలా ఎంపిక చేసుకోవచ్చు. సగం పరిహారం ఏక మొత్తంలో చెల్లించి, మిగిలిన మొత్తాన్ని నెలవారీ వాయిదాలుగా తీసుకునే ఆప్షన్ కూడా ఇందులో ఉంటుంది.

కన్వర్టబుల్ టర్మ్ ఇన్సూరెన్స్..

టర్మ్ ఇన్సూరెన్స్ అనేది ఎంపిక చేసుకున్న కాలానికి అమల్లో ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 40 ఏళ్ల కాలానికి టర్మ్‌ప్లాన్ తీసుకున్నారని అనుకుందాం. 70 ఏళ్లకు వచ్చే నరికి టర్మ్ ప్లాన్ ముగిసిపోతుంది. అప్పుడు కావాలంటే దాన్ని మరింత కాలానికి జీమా పాలసీ కింద మార్చుకోవచ్చు.

ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్..

చిన్న వయసులోనే టర్మ్ ప్లాన్ తీసుకునే వారు ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం అనుకూలంగా ఉంటుంది. వివాహం అయిన తర్వాత నుంచి జీవితంలో పలు దశల్లో బాధ్యతలు పెరుగుతూ వెళతాయి. కనుక పెరిగే బాధ్యతలకు అనుగుణంగా జీమా కవరేజీ విస్తృతం చేసుకునేందుకు ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. ఈ ప్లాన్‌లో ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళుతుంది. అలాగే, ఐదేళ్లకోసారి సమ్ అష్యూర్డ్ పెరిగే పాలసీలు కూడా ఉన్నాయి. కవరేజీ పెరిగినప్పటికీ, పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం స్థిరంగానే ఉంటుంది.

లిమిటెడ్ పే, సింగిల్ పే..

రెగ్యులర్ ప్లాన్‌లో ఎంపిక చేసుకున్న కాలం అంతటా నిర్ణీత రోజులకు ఒకసారి ప్రీమియం చెల్లిస్తుండాలి. అదే సింగిల్ ప్రీమియం పాలసీలో ఆరంభంలోనే ఒకసారి ప్రీమియం చెల్లించాలి. రెగ్యులర్‌గా ప్రీమియం కట్టే వెసులుబాటు లేని వారు దీన్ని పరిశీలించొచ్చు. ఇక లిమిటెడ్ పే ప్రీమియం ప్లాన్‌లో.. పాలసీ కాల వ్యవధి అంతటా కాకుండా, కొన్నేళ్ల పాటు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తి 80 ఏళ్లు వచ్చే వరకు 50 ఏళ్ల కాలానికి టర్మ్ ప్లాన్ ఎంపిక చేసుకున్నాడని అనుకుందాం. 60 ఏళ్లకు రిటైర్ అయిన తర్వాత కూడా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇది భారంగా భావిస్తే లిమిటెడ్ పే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. 5-10-15 ఏళ్లు ఇలా లిమిటెడ్ పేలో ప్రీమియం చెల్లింపుల కాలవ్యవధి ఉంటుంది.



బ్రిటన్ పార్లమెంటేరియన్లకు 'స్ప్రెడింగ్ జాయ్'



లండన్: జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ తన స్వీయ జీవిత చరిత్ర 'స్ప్రెడింగ్ జాయ్'ను బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులకు అందజేశారు. బ్రిటిష్ సౌత్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ కామర్స్ (బీఎస్ఐసీసీ) లండన్‌లోని గ్రిమాండ్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు మార్టిన్ డే, వీరేంద్ర శర్మ, స్టీఫెన్ టిమ్స్ సహా బరోనెస్ ఉడీన్‌లకు తన ఆత్మకథను బహూకరించారు. బ్రిటిష్ పార్లమెంటేరియన్స్‌కు నా కథను తెలియజేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ ఈ సందర్భంగా అన్నారు. కాగా ఇటీవల తన ఆత్మ కథను భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా జోయ్ అలుక్కాస్ అందజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
19-2-2024	
విశాఖ	555–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	542–00
విజయవాడ	542–00
రిటైల్ ధర (డజను)	72.00
18-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	554–00
వరంగల్	556–00
రిటైల్ ధర	6.15

ఎల్అండ్‌టీ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,389 టార్గెట్: రూ. 4,020

ఎందుకంటే: ఎల్అండ్‌టీ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో రూ. 39,300 కోట్ల అమ్మకాలు సాధించింది. వీటిలో సర్వీసుల ఆదాయం కలసిలేదు. ఇది మా అంచనాలకంటే 2 శాతం అధికంకాగా.. ఎగ్జిక్యూషన్‌లో సీజనల్‌గా మెరుగైన పనితీరు కనబరిచింది. కీలకమైన నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు త్రైమాసికవారీగా నామమాత్ర వృద్ధితో 7.5 శాతాన్ని తాకాయి. వార్షికంగా ఇవి 1 శాతం నీరసించడంతో మా అంచనాలు 8.6 శాతాన్ని అందుకోలేకపోయాయి. అయితే ఇతర అంశాలలో కంపెనీ ప్రగతిని అందుకుంది. వార్షిక ప్రాతిపదికన 26 శాతం వృద్ధితో రూ. 76,000 కోట్ల విలువైన ఆర్డర్లను సాధించింది. ఇవి మా అంచనాలు రూ. 61,000 కోట్లను మించాయి. ఫైనాన్స్ మినహా నికర వర్కింగ్ క్యాపిటల్(ఎన్‌డబ్ల్యూసీ) అమ్మకాలలో 16.6 శాతంగా నమోదైంది. వెరసి మా అంచనాలను అందుకోగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లో మరింత మందగించే వీలుంది. ఆర్డర్‌బుక్‌లో మధ్యప్రాచ్యం నుంచి పెరుగుతున్న కాంట్రాక్టులు, ఈ ఏడాది తొలి 9 నెలల్లో ఫిక్స్‌డ్ ధరల కాంట్రాక్టుల వాటా 30–35% నుంచి 43%కి బలపడటం సానుకూల అంశాలు. దీంతో సిమెంట్, స్టీల్ తదితర కమోడిటీ ధరల పెరుగుదల రిస్కులున్నప్పటికీ సమీపకాలంలో పెద్దగా ప్రభావం కనిపించకపోవచ్చు.



ఐకియో లైటింగ్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 301 టార్గెట్: రూ. 390

ఎందుకంటే: ఐకియో లైటింగ్ దేశీయంగా లైట్ ఎమిటింగ్ డయోడ్ (ఎల్ఈడీ–లెడ్) తయారీలో ఉంది. 2016లో ఏర్పాటైన కంపెనీ లెడ్ లైటింగ్ సొల్యూషన్లు అందిస్తోంది. ప్రధానంగా భవిష్యత్‌కు నష్టం వాటిల్లకుండా సొంత అవసరాలకు అనుగుణమైన తయారీ (సస్టెయినబిలిటీ)పై దృష్టిపెట్టి నడుస్తున్న కంపెనీ తక్కువ విద్యుత్‌ను వినియోగించే లెడ్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. తద్వారా దేశీ సస్టెయినబిలిటీ లక్ష్యాలకు మద్దతుగా నిలుస్తోంది. 2019–20 నుంచి 2022–23 వరకూ గత నాలుగేళ్లలో కంపెనీ ఆదాయం వార్షికంగా 18 శాతం పుంజుకోగా.. నిర్వహణ లాభం(ఇబిటా) మరింత అధికంగా 27 శాతం ఎగసింది. ఇందుకు విభిన్నతరహా ప్రొడక్టులు (ప్రొడక్ట్ మిక్స్), నిర్వహణ సామర్థ్యం, బ్రాండ్ పటిష్టత దోహదపడ్డాయి. బలమైన కస్టమర్లు, పునరావృత ఆర్డర్ల నేపథ్యంలో గత కొన్నేళ్లలో కంపెనీ ఆర్థికంగా బలపడింది. వెరసి కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాక రుణాలను తిరిగి చెల్లించింది. దీంతో రుణరహిత కంపెనీగా ఆవిర్భవించింది. దీంతో గతేడాది(2022–23)లో వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తగ్గించుకుంది. కోవిడ్–19 అనిశ్చితిలో సైతం పనితీరును మెరుగుపరచుకుంటూ వచ్చింది. ఫలితంగా 2019–20లో నమోదైన 17 శాతం ఇబిటా మార్జిన్లు గతేడాదికల్లా 22 శాతానికి ఎగశాయి. పరిశ్రమలోని ప్రత్యర్థి సంస్థలతో పోలిస్తే నిలకడ, పోటీతత్వాన్ని ప్రదర్శించింది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్లు

కోటక్ ఎంఎఫ్ నుంచి టెక్నాలజీ ఫండ్

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా కోటక్ టెక్నాలజీ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 26తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించే నిధులను టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ఎప్పటికప్పుడు మారిపోతున్న సాంకేతిక రంగంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులను అందించేందుకు ఫండ్ ప్రయత్నిస్తుంది. ప్రపంచంలోని టాప్ 10 ఐటీ సర్వీసుల కంపెనీల్లో 8 భారతీయ సంస్థలు ఉన్నాయని కేఎంఏఎంసీ ఎండీ నీలేష్ షా తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ దేశీ ఐటీ కంపెనీలు మార్జిన్లపరంగా మెరుగైన పనితీరు కనపర్చాయని వివరించారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన వృద్ధి అవకాశాలు ఉండి, సముచిత వేల్యుయేషన్‌లో లభిస్తున్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు షా పేర్కొన్నారు.

బరోడా బీఎన్‌పీ పారిబాస్ ఇన్నోవేషన్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పారిబాస్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా ఇన్నోవేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 28తో ముగుస్తుంది. ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీము ద్వారా సేకరించిన నిధులను ఇన్నోవేషన్ థీమ్‌ను బట్టి ఇన్వెస్ట్ చేస్తారు. ఇందుకోసం ప్రధానంగా మూడు కేటగిరీల వినూత్న కంపెనీలను ఫండ్ గుర్తించింది. కొత్త ఆవిష్కరణలు చేసే దిగ్గజ సంస్థలు (డిజిటల్ నేటివ్స్), టెక్నాలజీలు..సప్లై టూల్స్ లాంటివి అందించే సంస్థలు (ట్రాన్స్‌ఫార్మర్స్), మారే మార్కెట్‌కు అనుగుణమైన నవకల్పనలతో వృద్ధి చెందే సంస్థలు (లెగసీ కంపెనీలు) వీటిలో ఉంటాయి.

స్మార్ట్ సిప్ అంటే ఏంటి?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



ఈక్విటీ మార్కెట్ ఎప్పటికప్పుడు నూతన గరిష్ఠ స్థాయిలను తాకుతోంది. కనుక ఈ పరిస్థితుల్లో స్మార్ట్ సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని సూచిస్తారా..? – డి. వెంకట రమణ

స్మార్ట్ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (స్మార్ట్ సిప్) అనేది రెగ్యులర్ సిప్‌తో పోలిస్తే వినూత్నమైనది. ప్రతి నెలా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసే మొత్తం అప్పటి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్మార్ట్‌గా మారిపోతుంది. కొన్ని పారామీటర్ల ఆధారంగా మార్కెట్ల విలువలు ఖరీదుగా ఉన్నాయా? లేక చౌకగా ఉన్నాయా అన్నది ఆల్గోరిథమ్ నిర్ణయిస్తుంది. మార్కెట్లు పూర్తి విలువ మేర ట్రేడ్ అవుతున్నాయని ఆల్గోరిథమ్ (సాఫ్ట్‌వేర్) భావిస్తే, అప్పుడు సిప్‌లో కొంత భాగమే ఈక్విటీ పెట్టుబడిగా వెళుతుంది. మిగిలిన మొత్తాన్ని లిక్విడ్ ఫండ్‌కు తరలిస్తుంది. ఒకవేళ స్టాక్ విలువలు చౌకగా ఉన్నాయని భావిస్తే అప్పుడు పెట్టుబడిలో అధిక భాగం స్టాక్స్‌కే కేటాయిస్తుంది. లిక్విడ్ ఫండ్‌కు పరిమితంగానే వెళుతుంది. స్మార్ట్ సిప్ ఇదే మాదిరిగా పనిచేస్తుంది. ఈ విధానం ఇన్వెస్టర్లకు ఎంతో మేలు చేస్తుంది. ఎందుకంటే ఈక్విటీ వ్యాల్యూషన్లు ఖరీదుగా ఉన్నప్పుడు తక్కువ మొత్తమే పెట్టుబడిగా వెళుతుంది. అదే ఈక్విటీ వ్యాల్యూషన్ చౌకగా మారినప్పుడు సిప్‌లో అధిక భాగం ఈక్విటీలకు వెళుతుంటుంది. మార్కెట్లో అనుకూల సమయాన్ని ఎవరూ అంచనా వేయలేరు. ఓ పద్ధతి ప్రకారం, క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడమే కీలకం. ఇందుకు స్మార్ట్‌సిప్ వీలు కల్పిస్తుంది. నిజానికి సాధారణ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఉద్దేశం కూడా పెట్టుబడులకు సంబంధించి రిస్క్‌ను తగ్గించడమే. మార్కెట్లు ఎప్పుడు దిద్దుబాటుకు గురవుతాయి? ఎప్పటి వరకు ర్యాలీ చేస్తాయి? అని ఎవరూ చెప్పలేరు. అటు ర్యాలీల్లోనూ, ఇటు పతనాల్లోనూ ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడం సిప్ ద్వారా సాధ్యపడుతుంది. మార్కెట్లు ఖరీదుగా మారాయా? చౌకగా ఉన్నాయా? అని చూడక్కర్లేదు. దీని వల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తాన్ని సమకూర్చుకోవడం సాధ్యపడుతుంది. స్టాక్స్ ధరలు దిద్దుబాటుకు గురైనప్పుడు సిప్ పెట్టుబడితో ఎక్కువ ఫండ్ యూనిట్లు సమకూరుతాయి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి కావాల్సినది క్రమశిక్షణ. అందుకు సిప్ వీలు కల్పిస్తుంది. కనుక మార్కెట్లు గరిష్ఠాల్లో ఉన్నాయని చెప్పి స్మార్ట్‌సిప్‌ను పరిశీలించక్కర్లేదు. మీరు రెగ్యులర్ సిప్ మార్గంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

నా పెట్టుబడుల్లో సింహ భాగం ఈక్విటీల్లోనే ఉన్నాయి. రిటైర్మెంట్‌కు మూడేళ్లు మిగిలి ఉంది. ఇప్పుడు ఈక్విటీ పెట్టుబడులను డెట్ ఫండ్స్‌లోకి మళ్లించుకోవచ్చా? నా లాభం రూ.లక్షకు మించే ఉంటుంది. కనుక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇలా డెట్‌లోకి మళ్లించిన తర్వాత ప్రతి నెలా ఇంత చొప్పున సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ద్వారా తీసుకుందామని అనుకుంటున్నాను. డెట్ ఫండ్ నుంచి ప్రతి నెలా బ్యాంక్ ఖాతాకు జమ అయ్యే మొత్తంపైనా పన్ను పడుతుందా? – త్యాగన్ సరేంద్రన్

అవును. రెండు సందర్భాల్లోనూ మూలధన లాభంపై పన్ను పడుతుంది. అయినప్పటికీ రెండింతల పన్ను చెల్లించినట్టు కాదు. పెట్టుబడిపై వచ్చే రాబడిపైనే పన్ను అమలవుతుంది. దీర్ఘకాల లక్ష్యానికి చేరువ అవుతున్న క్రమంలో మూడేళ్ల ముందుగానే ఈక్విటీ పెట్టుబడులను స్థిరాదాయ సాధనాల్లోకి మళ్లించుకోవడం మంచి ఆలోచనే అవుతుంది. లక్ష్యానికి చేరువ అవుతున్నప్పుడు పెట్టుబడులు తక్కువ అస్థిరతలతో కూడిన సాధనాల్లో ఉండడం ఎంతో అవసరం. ఇలాంటప్పుడే సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అక్కరకు వస్తుంది. ఈక్విటీ ఫండ్స్ నుంచి మీ పెట్టుబడులను ఎస్‌డబ్ల్యూపీ ద్వారా డెట్ ఫండ్స్‌లోకి మళ్లించుకోవడం వల్ల మార్కెట్ కనిష్ఠంలో ఉన్నప్పుడు వైదొలిగే రిస్క్‌ను తప్పిస్తుంది.

మరో 12 పాలిటెక్నిక్ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో విప్లవాత్మక మార్పులు

- నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ సాధనలో ముందంజ
- ఇప్పటివరకు 31 కాలేజీల్లో 60 విభాగాలకు ఎన్‌బీఏ సర్టిఫికేషన్
- వచ్చే ఏడాది నాటికి మిగిలిన కాలేజీలకూ గుర్తింపు సాధించేలా కసరత్తు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు సాధనలో దూసుకెళ్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యనందిస్తూ గణనీయమైన ప్లేస్‌మెంట్లు నమోదు చేస్తున్నాయి. తాజాగా మరో 12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలకు ఎన్‌బీఏ సర్టిఫికేషన్ దక్కింది. అనంతపురం, శ్రీశైలం, తిరుపతి, పిల్లరిపట్టు, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, జమ్మలమడుగు, కదిరి, నందిగామ, పలమనేరు, కడప మహిళా పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు మదనపల్లె మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజీకి కూడా ఎన్‌బీఏ సర్టిఫికేషన్ దక్కింది.

పక్కా ప్రణాళికతో ముందుకు..

రాష్ట్రంలో మొత్తం 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా.. తొలి దశలో 41 కాలేజీలకు ఎన్‌బీఏ సర్టిఫికేషన్ సాధించేలా సాంకేతిక విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మొత్తం 31 పాలిటెక్నిక్ కాలేజీల్లోని 60 విభాగాల్లో ఎన్‌బీఏ సర్టిఫికేషన్‌ను సాధించింది. ఈ విద్యా సంవత్సరం ముగిసేలోగా ఎన్‌బీఏ బృందం మరిన్ని కాలేజీలను కూడా పరిశీలించనుంది. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్న సాంకేతిక విద్యా శాఖ పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, సొంత భవనాల నిర్మాణాలను చేపడుతోంది. వచ్చే ఏడాదికి వీలైనన్ని కాలేజీల్లో హాస్టల్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక దృష్టి సారించింది. పాలిటెక్నిక్ విద్య ద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల చేరికలను ప్రోత్సహిస్తోంది. పాలిసెట్ కోసం ఉచితంగా కోచింగ్‌ను కూడా అందుబాటులోకి తెస్తోంది.

ఇది సరికొత్త చరిత్ర

సీఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను పెంపొందిస్తున్నాం. అందువల్లే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలకు అత్యంత ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ సర్టిఫికేషన్ దక్కుతోంది. భవిష్యత్‌లో ప్రతి కాలేజీనూ ఎన్‌బీఏ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కరిక్యులమ్‌లో మార్పులు తెచ్చాం. ఉద్యోగ అవకాశాలు పెంచేలా 674 పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకున్నాం. గత విద్యా సంవత్సరంలో 7 వేల మంది చదువులు పూర్తి చేసుకుంటే 4 వేల మందికి పైగా ప్లేస్‌మెంట్లు సాధించారు. పది శాతంగా ఉన్న ప్లేస్‌మెంట్లను 60 శాతానికి తీసుకువచ్చాం. ఇది సరికొత్త చరిత్ర.

– చదలవాడ నాగరాణి
కమిషనర్, సాంకేతిక విద్యాశాఖ

విద్య.. ప్రపంచాన్ని మార్చే ఆయుధం

ఎస్‌జీఈసీ రజతోత్సవాల ముగింపు సభలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



గవర్నర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుడ్లవల్లేరు (గుడివాడ): ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యే అని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో జరిగిన శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ(ఎస్‌జీఈసీ) రజతోత్సవాల ముగింపు సభకు ఆయన ఆదివారం హాజరయ్యారు. అబ్దుల్ కలాం చెప్పిన ప్రపంచ పురోగతి సాధించాలంటే అది విద్య అనే శక్తివంతమైన ఆయుధంతోనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. దానికి జాతీయ విద్యా విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత వాసులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యం, దూర దృష్టి, అభిరుచి, ఆలోచనా దృక్పథాలతో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించడం హర్షదాయకమన్నారు. తొలుత కాలేజీ స్థాపనతో పాటు అభివృద్ధి చేసిన వ్యవస్థాపకుడు వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావుకు కృతజ్ఞతాంజలి తెలిపిన పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు గవర్నర్ అందజేశారు. గవర్నర్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ సన్మానించారు. కలెక్టర్ పి.రాజాబాబు, గుడివాడ ఆర్డీవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో విమానాల ల్యాండింగ్‌కు అడ్డంకులు



విమానాశ్రయం(గన్నవరం): దట్టమైన పొగమంచు కారణంగా ఆదివారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. తెల్లవారుజాము నుంచి విమానాశ్రయ రన్‌వే ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కప్పేసింది. రన్‌వేపై దిగేందుకు సరైన విజిబిలిటీ లేకపోవడంతో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, న్యూఢిల్లీ నుంచి వచ్చిన విమానాలు సుమారు గంట పాటు గాలిలో చక్కర్లు కొట్టాయి. ఎట్టకేలకు 9.15 గంటల తర్వాత పొగమంచు ప్రభావం కొంత మేర తగ్గడంతో ఐదు విమానాలు కొన్ని నిమిషాల వ్యవధిలో సురక్షితంగా రన్‌వేపై దిగాయి. పొగమంచు కారణంగా విమానాల షెడ్యూల్‌లో జాప్యం చోటు చేసుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చంద్రబాబు నాయుడు నివాసంలో ముగిసిన రాజశ్యామల యాగం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నివాసంలో నిర్వహిస్తున్న రాజశ్యామల యాగం ఆదివారం ముగిసింది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ యాగం జరిగింది. గుంటూరుకు చెందిన వేద పండితులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది రుత్వికులు చంద్రబాబు, భువనేశ్వరిల చేత పలు పూజా క్రతువులు చేయించారని టీడీపీ నేతలు తెలిపారు. ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమంతో ఈ యాగం ముగిసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.